PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 284 | విజయవాడ, ఆదివారం 19 మే 2024 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 19 May 2024 | Rs

న్యాయవ్యవస్థ పరిరక్షణకు ప్రజాస్వామికవాదులు నడుం కట్టాలి

- 'ప్రబీర్ పుర్కాయస్థ' విడుదలను స్వాగతిస్తూ జరిగిన సభలో వక్తలు
- 'అలుపెరగని పోరాటం' ఆవిష్కరణ

2

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నేడు

పీడిత ప్రజల ప్రియతమ నేత, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత అమరజీవి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నేడు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు రాసిన ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో...

4

రంగంలోకి సిట్

నరసరావుపేటలో ఘర్షణలపై ఆరా

తిరుపతి, తాడిపత్రికి చేరిన బృందాలు

ప్రజాశక్తి- గుంటూరు, అనంతపురం ప్రతినిధులు, తిరుపతి బ్యూరో

ఎన్నికలను పురస్కరించుకుని పోలింగ్ రోజున, ఆ తరువాత జరిగిన ఘర్షణపై ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తు ప్రారంభించింది. పల్నాడు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ఘర్షణలపై ఏర్పాటైన సిట్ శనివారం సాయంత్రం నరసరావుపేటకు చేరుకుంది. నరసరావుపేటలోని టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఈ బృందం అధికారులు ఘర్షణల్లో నమోదు అయిన ఎఫ్ఐఆర్ కాపీలను పరిశీలించారు. ఘర్షణలకు సంబంధించిన నమోదైన కేసులు, తీసుకున్న చర్యలు, నిందితుల వివరాలు, దాడులు, ప్రతి దాడులు, వాహనాల ధ్వంసం, వాహనాల దగ్ధం ఘటనలపై సిట్ బృందం అధికారి, అదనపు ఎస్‌పి సౌమ్యలత నేతృత్వంలో ఆరా తీశారు. ఈ ఘర్షణల్లో పాల్గొన్న వ్యక్తులు, వారి గతం, ఆస్తి నష్టం, శాంతిభద్రతల సమస్య ఏర్పడితే తీసుకున్న చర్యల వివరాలను పట్టణ పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిట్ బృందం పరిశీలన నేపథ్యంలో పోలీసు స్టేషన్ దరిదాపులకు ఎవరినీ రానివ్వలేదు. మీడియానూ అనుమతించలేదు.

నరసరావుపేట పోలీస్ స్టేషన్లో రికార్డులను పరిశీలిస్తున్న సిట్ అధికారి సోమ్యలత

కారంపూడిలో 19 మంది అరెస్టు

కారంపూడిలో ఈ నెల 14న ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్లకు సంబంధించి పలు కేసుల్లో నిందితులుగా ఉన్న 19 మందిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వీరిలో వైసిపికి చెందిన 11 మంది, టిడిపికి చెందిన ఎనిమిది మంది ఉన్నారు.

తిరుపతి, తాడిపత్రి చేరుకున్న సిట్ బృందాలు

ఇద్దరు సభ్యులతో కూడిన సిట్ బృందం శనివారం రాత్రి పది గంటల తర్వాత తిరుపతికి చేరుకుంది. ఈ బృందంలో డిఎస్‌పి రవిమనోహర ఆచారి, సి.ప్రభాకర్ ఉన్నారు. వీరు శ్రీ పద్మావతి అతిధి గృహంలో బస చేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రికి కూడా సిట్ బృందం చేరుకుంది. ఈ రెండు బృందాలూ ఆదివారం నుంచి దర్యాప్తు ప్రారంభించనున్నాయి.

క్వాడ్ కూటమి స్థానే స్క్వాడ్

- పేరులోనే మార్పు లక్ష్యం అదే
- చైనాకు వ్యతిరేకంగా అమెరికా సరికొత్త తంత్రం

వాషింగ్టన్: చైనాకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన సైనిక సహకార కూటమి క్వాడ్ పేరును స్క్వాడ్‌గా అమెరికా మార్పు చేసి తిరిగి ప్రారంభించింది. అయితే, చైనాను కట్టడి చేయాలన్న దాని లక్ష్యంలో ఎలాంటి మార్పు లేదు. ఆస్ట్రేలియా, జపాన్, ఫిలీప్పీన్స్, అమెరికా ఈ నాలుగు దేశాలు కొత్త కూటమి స్క్వాడ్‌లో భాగస్వాములుగా ఉన్నాయి. ఇవి గత నెల ప్రారంభంలో దక్షిణ చైనా సముద్రంలో సంయుక్త నావికా విన్యాసాలు నిర్వహించాయి. ఆస్ట్రేలియాకు చెందిన వారముంగా, జపాన్‌కు చెందిన అకెబోనో, ఫిలిప్పీన్స్‌కు చెందిన ఆంటోనియో లూనా, అమెరికాకు చెందిన మొబైల్ కంపెనీల నౌకలు కలిసికట్టుగా పని చేస్తూ ఈ సముద్ర జలాల్లో తమ ఉమ్మడి నావికా సామర్ధ్యాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించినట్లు ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నాయి. దక్షిణ చైనా సముద్ర దీవుల్లో స్వేచ్ఛగా తిరుగాడే హక్కును అంతర్జాతీయ చట్టం తమకు కల్పించిందని స్క్వాడ్ కూటమి పేర్కొంది. కొన్ని వారాల తరువాత అంటే ఏప్రిల్ 22, మే 8 మధ్య బాలికాటన్-2024 పేరుతో ఫిలిప్పీన్స్, అమెరికా, ఆస్ట్రేలియా నుండి వచ్చిన ఓడలు ఫ్రెంచ్ నావికాదళాలతో కలసి విన్యాసాలు నిర్వహించాయి. వీటిలో 16వేల మందికిపైగా సైనికులు ఫిలిప్పీన్స్ ప్రాదేశిక జలాల వెలుప ఉన్న దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో పాల్గొన్నారు. ఈ దేశాల నౌకాదళాలతోబాటు ఫిలిప్పీన్స్ కోస్ట్ గార్డ్ కూడా పాల్గొంది.

బుల్లిపెట్టెలో బూచి

మోడీ పాలనలో నియంతృత్వ సాధనంగా మొబైల్‌ఫోన్

- అడుగడుగునా నిఘా
- ప్రత్యామ్నాయాల కోసం వెతుకులాట

న్యూఢిల్లీ : ప్రభుత్వ అధికారులు పలువురు సాధారణ ఫోన్‌కాల్ కన్నా వాట్సప్ కాల్‌లో మాట్లాడటానికి ప్రాధాన్యత ఇవ్వడం గమనించే ఉంటారు. దీనికి కారణం భయం...నిఘా భయం! తమ ఫోన్లను ఎవరో వింటున్నారన్న భయం! ఆ వినేది ఎవరో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు కదా! మన రాష్ట్రంలోనే కాదు, దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో .. ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఇదే స్థితి నెలకొంది! నరేంద్రమోడీ నేతృత్వంలో బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత గత పదేళ్ల కాలంలో మొబైల్ ఫోన్లు నియంతృత్వ సాధనాలుగా ఎలా మారిపోయాయో వివరిస్తూ 'ది వైర్' ఒక కథనాన్ని ప్రచురించింది. ఈ కథనం ప్రకారం దేశ వ్యాప్తంగా నూతన సాంకేతికతను ప్రభుత్వమే పెద్ద ఎత్తున దుర్వినియోగం చేస్తోంది. ప్రజా ఉద్యమకారులు, అభ్యుదయ శక్తులు, నిష్పాక్షికంగా వ్యవహరించే పాత్రికేయులు, రాజకీయంగా గిట్టని వారు చివరకు అధికార యంత్రాంగంలో స్వతంత్రంగా వ్యవహరించే వారు ఇలా వివిధ తరగతులకు చెందిన వారు ప్రభుత్వ లక్ష్యాలుగా మారిపోతున్నారు. ఇజ్రాయిల్ స్పైవేర్ పెగాసెస్‌తో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, లాయర్లు, జర్నలిస్టుల ఫోన్‌లను ట్యాప్ చేయడం దీనికో పెద్ద నిదర్శనం. ఈ సంఘటన దేశ వ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. ప్రజాస్వామ్య దేశంలో చోటుచేసుకున్న ఈ సర్కారీ నిఘా అంతర్జాతీయంగానూ చర్చనీయాంశమైంది. ఈ స్పైవేర్ విక్రయించే ఎన్‌ఎస్‌ఓ గ్రూపు తాము ప్రభుత్వాలకు, ప్రభుత్వ సంస్థలకు మాత్రమే దీనిని విక్రయిస్తామని చెప్పిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి సుప్రీంకోర్టులో దాఖలైన కేసులో జాతీయ భద్రత దృష్ట్యా అన్ని వివరాలను వెల్లడించలేమని కేంద్ర ప్రభుత్వం ధర్మాసనానికి విన్నవించింది. ఒకవైపు ప్రభుత్వమే ట్యాపింగ్ చేస్తూ, మరోవైపు జాతీయభద్రతను ముసుగుగా తెచ్చుకోవడమేమిటని పౌరసమాజం అడిగిన ప్రశ్నకు నరేంద్రమోడీ ప్రభుత్వం నుండి ఇంతవరకు సమాధానం లేదు. కొన్ని సంవత్సరాల క్రితం యాపిల్ ఫోన్ల సంస్థ పలువురి ఫోన్లు ట్యాపింగ్‌కు గురవుతున్నాయంటూ మెసేజ్‌లు పంపిన సంగతి తెలిసిందే. ఈ సంస్థ నుండి ఈ తరహా హెచ్చరికలు అందిన వారిలో రాజకీయనేతలు, జర్నలిస్టులు, లాయర్లు ఉన్నారు. కొద్దిరోజుల క్రితమే జైలులో ఉన్న ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ ఫోన్ ట్యాప్ చేయడానికి ప్రయత్నించారని, దాన్ని తామే అడ్డుకున్నామని యాపిల్ సంస్థ ప్రకటించింది. ఇలా ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ సాధనాల్లోకి జొరబడటం, తమకు కావాల్సిన సమాచారాన్ని సేకరించడం, లేదా సృష్టించి తప్పుడు కేసులు పెట్టడం కూడా సాధారణ అంశంగా మారింది. బీమా కోరెగావ్ కేసులు దీనికి పెద్ద ఉదాహరణ. కేసులేమైనప్పటికీ ఎలక్ట్రానిక్ పరికరాలను ముఖ్యంగా మిగతా 2లో

నేడు నికోబార్ దీవుల్లోకి 'నైరుతి'

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆగ్నేయ బంగాళాఖాతంలో కొన్ని ప్రాంతాలతోపాటు నికోబార్ దీవుల్లోకి ఈ నెల 19న నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈనెల 22కల్లా నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని తెలిపింది. ఈ మేరకు వాతావరణ కేంద్రం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. అల్పపీడనం మొదట్లో ఉత్తర ఈశాన్యంగా పయనించిన అనంతరం మధ్య బంగాళాఖాతంలో మే 24 కల్లా వాయుగుండంగా బలపడే అవకాశముందని పేర్కొంది. రానున్న మూడు రోజులు ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ, యానాం ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని, ఒకటిరెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. వర్షాలతోపాటు బలమైన ఈదురుగాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉంది.

ఎవరెస్ట్, ఎండిఆర్ మసాలాలపై నేపాల్ నిషేధం



ఖాట్మండు : నాణ్యతా ప్రమాణాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఇండియన్ బ్రాండ్‌లు తయారుచేస్తున్న సుగంధ ద్రవ్యాల ఉత్పత్తులు కొన్నింటి దిగుమతులు, విక్రయాలను నేపాల్ నిషేధించింది. సింగపూర్, హాంకాంగ్‌ల తర్వాత వీటిని నిషేధించిన మూడో దేశం నేపాల్. ఎండిహెచ్, ఎవరెస్ట్ తయారుచేసే నాలుగు రకాల ఉత్పత్తులను శుక్రవారం నుండి నిషేధించారు. వాటిల్లో ఎథిలిన్ ఆక్సైడ్ వుందని అనుమానిస్తున్నారు. ఈమేరకు నేపాల్ ఆహార నాణ్యత నియంత్రణా విభాగం ఒక ప్రకటన జారీ చేసింది. మద్రాస్ కర్రీ పౌడర్, సాంబార్ మిక్స్‌డ్ మసాలా పౌడర్, ఎండిహెచ్‌కి చెందిన మిక్స్‌డ్ మసాలా కర్రీ పౌడర్, ఎవరెస్ట్‌కి చెందిన ఫిష్ కర్రీ మసాలాలు నేపాల్‌లో నిషేధానికి గురయ్యాయి. తక్షణమే మార్కెట్‌లో నుండి ఆ ఉత్పత్తులను వెనక్కి తెప్పించాల్సిందిగా నేపాల్ ఆహార నాణ్యతా విభాగం వ్యాపారస్తులను, దిగుమతిదారులను కోరింది.

కిర్గిజ్‌లో విదేశీ విద్యార్థులపై అల్లరి మూకల దాడి !

- అప్రమత్తంగా వుండండి
- భారతీయ విద్యార్థులకు ఎంబసీ సలహా

బిష్కేక్ : కిర్గిజిస్తాన్ రాజధాని బిష్కేక్‌లో విదేశీ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని అల్లరి మూకలు హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నాయి. దీంతో అక్కడి భారతీయ విద్యార్థుల భద్రత పట్ల భారత ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. భారతీయ దౌత్య కార్యాలయం శనివారం నాడు ఒక ప్రకటన చేస్తూ విద్యార్థులెవరూ బయటకు రావద్దని, తలుపులేసుకుని రూముల్లోనే ఉండాలని సూచించింది. ఈ అల్లర్లు కొన్ని అరాచక మూకల పనేనని కిర్గిజిస్తాన్ అంతర్గత వ్యవహారాల శాఖ ఒక ప్రకటనతో తెలిపింది. అల్లర్లకు సంబంధించిన ఘటనా క్రమాన్ని అందులో వివరించింది. దీని ప్రకారం ఈ నెల 13న తెల్లవారుజాము 2గంటల సమయంలో బిష్కేక్‌లోని పిజారియా సమీపంలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు విదేశీ విద్యార్థులతో తలపడ్డారు. సిగరెట్లు కావాలని ఆ గ్రూపు అడగడం, ఆ ప్రాంతంలో పొగ తాగరాదంటూ విద్యార్థులు అనడంతో ఘర్షణ మొదలైంది. వారిలో ఒక వ్యక్తి కావాలనే ఘర్షణను కొనసాగించడానికి ప్రయత్నిస్తుండడంతో విదేశీ విద్యార్థులు అక్కడ నుండి పారిపోయారు. దాంతో ఆ గ్రూపు వారిని వెంటాడింది. హాస్టల్ భవనంలోకి ప్రవేశించి విదేశీ విద్యార్థుల వద్ద నుండి డబ్బును, వస్తువులను లాక్కున్నారు. ఈలోగా మరికొంతమంది హాస్టల్‌లోని గదుల తలుపులను కొట్టడం ఆరంభించారు. మహిళలు నివసిస్తున్న గదుల్లోకి వారు చొరబడడంతో కొంతమంది విదేశీవి ద్యార్థులు మిగతా 2లో



విదేశీ విద్యార్థులకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న పౌరులు

భయాందోళనలో భారతీయ వైద్య విద్యార్థులు 2

పెళ్లింట విషాదం

- 'అనంత'లో ఘోర రోడ్డు ప్రమాదం
- పెళ్లి కొడుకుతోపాటు ఆరుగురు దుర్మరణం

ప్రజాశక్తి- గుత్తి (అనంతపురం జిల్లా)

పెళ్లి జరగాల్సిన కుటుంబంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. అనంతపురం జిల్లా గుత్తి మండలం బాటసుంకలమ్మ ఆలయ సమీపంలో 44వ జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కాబోయే పెళ్లి కొడుకుతోపాటు ఆరుగురు దుర్మరణం చెందారు. మృతులంతా అనంతపురం జిల్లా కేంద్రం రాణినగర్‌కు చెందిన ఒకే కుటుంబ సభ్యులు. ఈ విషాద ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... అనంతపురం నగరం బిందెల కాలనీలో నివాసం ఉంటున్న షేక్ అలీ సాహెబ్ (58) రెండవ కుమా రుడు షేక్ ఫిరోజ్ బాషా (28)కు అదే నగరానికి చెందిన యువతితో వచ్చే నెల ఆరున వివాహం నిశ్చయమైంది. ఈ నేపథ్యంలో వివాహ దుస్తుల కొనుగోలుకు అలీ సాహెబ్ కుటుంబసభ్యులు శుక్రవారం నాడు హైదరా బాద్‌కు రెండు కార్లలో వెళ్లారు. దుస్తులు కొను గోలు చేసి శనివారం వేకువజామున అనంతపురం బయల్దేరారు. వీటిలో ఒక కారు గుత్తి సమీపంలోని బాట సుంకులమ్మ ఆలయ సమీపంలో 44వ జాతీయ రహదారిపై అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలి రోడ్డులో మిగతా 2లో

షేక్ ఫిరోజ్ బాషా(మధ్యలో), మొహమ్మద్ ఆహిల్, ఆమన్



షేక్ అలీ సాహెబ్(ఫైల్)

షేక్ జహీదా(ఫైల్)

షేక్ రెహానా భాను(ఫైల్)

మూడు జిల్లాలకు కొత్త ఎస్‌పిలు

- సస్పెన్షన్‌కు గురైంది ఇసి నియమించిన వారే
- నూతన నియామకాల్లో రాజకీయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల అనంతరం ఘర్షణల నేపథ్యంలో ఎస్‌పిలపై చర్యలు తీసుకున్న మూడు జిల్లాల్లో కొత్త అధికారులను నియమించారు. పల్నాడు జిల్లాకు మల్లిక గార్గ్, అనంతపురం జిల్లాకు శాలి గౌతమి, తిరుపతికి వి.హర్షవర్ధన్‌రాజును నియమిం చారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ పంపించింది. ఎన్నికల రోజు, అనంతరం తాడిపత్రి, మాచర్ల, చంద్రగిరి నియోజక వర్గాల్లో ఘర్షణలు చోటుచేసు కున్నాయి. వందల సంఖ్యలో పార్టీల నాయకులు గుమిగూడుతున్నా పోలీసులు చూస్తూ ఉండిపోయారు. ప్రత్యర్థుల ఇళ్లపై కర్రలు, రాడ్లు, పెట్రోలు బాంబులతో స్వైర విహారం చేశారు. అయినా డిఎస్‌పి, సిఐ, ఎస్ఐ స్థాయి అధికారులు ఎవరూ అక్కడ కనిపించలేదు. దీనివెనుక రాజకీయ కుట్ర ఉందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీనిపై ఎన్నికల సంఘం కూడా సీరియస్ అయ్యింది. వెంటనే డిజిపి, సిఎస్‌ను ఢిల్లీకి పిలిచి వివరణ అడిగింది. మూడు జిల్లాల ఘటలనపై మిగతా 2లో

గౌతమి(అనంతపురం)

మల్లిక గార్గ్ (పల్నాడు)

హర్షవర్ధన్‌రాజు (తిరుపతి)

VIT-AP UNIVERSITY
Apply Knowledge. Improve Life!



అడ్మిషన్లు ప్రారంభం - 2024

ఆఫరు చేయబడుతున్న ప్రోగ్రాంలు

బి.టెక్ ప్రోగ్రాంలు – మేజర్స్
- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (CSE)
- CSE (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్)
- CSE (బ్లాక్‌చైన్)
- CSE (సైబర్ సెక్యూరిటీ)
- CSE (డాటా అనలిటిక్స్)
- CSE (సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్)
- CSE అండ్ బిజినెస్ సిస్టమ్స్ (TCS సహకారంతో)
- ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ECE)
- ECE (ఎంబెడెడ్ సిస్టమ్స్)
- ECE (విఎల్ఎస్ఐ)
- మెకానికల్ ఇంజనీరింగ్
- మెకానికల్ ఇంజనీరింగ్ (ఆటోమోటివ్ డిజైన్)
- మెకానికల్ ఇంజనీరింగ్ (రొబోటిక్స్)

బి.టెక్ మైనర్స్ /స్పెషలైజేషన్స్ / డబుల్ మేజర్ 4 సంవత్సరాలలో

అర్హతా ప్రమాణం: VITEEE ర్యాంక్ ఆధారంగా ప్రవేశం ఉంటుంది. అర్హతా పరీక్షలో (+2/ ఇంటర్మీడియెట్) ఫిజిక్స్, కెమిస్ట్రీ మరియు మ్యాథమాటిక్స్‌లో కనీస మొత్తంగా 60% పొంది ఉండాలి.

5-సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాంలు
- M.Tech.సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్
- M.Tech. CSE (VIRTUSA సహకారంతో)

అర్హతా ప్రమాణం: ఫిజిక్స్, కెమిస్ట్రీ మరియు మ్యాథమాటిక్స్ (PCM) లో హైయర్ సెకండరీ పరీక్ష లేదా 65% మొత్తంతో తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత.

VITEEE ఆన్‌లైన్ కౌన్సిలింగ్ తేదీలు
ఫేజ్–1: 07.05.2024 నుండి 08.05.2024 (ర్యాంక్: 1–20000)
ఫేజ్–2: 18.05.2024 నుండి 19.05.2024 (ర్యాంక్: 20001–45000)
ఫేజ్–3: 29.05.2024 నుండి 30.05.2024 (ర్యాంక్: 45001–70000)
ఫేజ్–4: 09.06.2024 నుండి 10.06.2024 (ర్యాంక్: 70001–100000)
ఫేజ్–5: 20.06.2024 నుండి 21.06.2024 (ర్యాంక్: 1 లక్షకు పైగా)

హైలైట్స్
14000 పైగా విద్యార్థులు 27 రాష్ట్రాలు, 5Ut's 10 దేశాల నుండి
2+2 3+1 విదేశీ విశ్వవిద్యాలయాలలో స్టడీ ఆప్షన్
406 సూపర్ డ్రీమ్ * & డ్రీమ్ ** ఆఫర్లు గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్ 2024 డాటా
* CTC 10 లక్షలు పైన ** CTC 6 లక్షలు పైన
500 లకు పైగా పేటెంట్లు ప్రచురించబడినవి
100 పైగా పారిశ్రామిక భాగస్వాములతో MoU's

నాన్ ఇంజనీరింగ్ ప్రోగ్రాంలు
- B.B.A
- B.Com (ఫైనాన్స్)
- B.B.A ., LL.B (Hons.)
- B.A ., LL.B (Hons.)
- B.Sc.- M.Sc. డాటా సైన్స్
- B.A . - M.A పబ్లిక్ సర్వీసెస్

నాన్ ఇంజనీరింగ్ ప్రోగ్రాంలకు అర్హతా ప్రమాణం: పర్సనల్ ఇంటర్వ్యూ మరియు +2/ ఇంటర్మీడియేట్‌లో 55% ఆధారంగా ప్రవేశం ఉంటుంది.

లా ప్రోగ్రామ్ కొరకు: పర్సనల్ ఇంటర్వ్యూ మరియు +2/ ఇంటర్మీడియేట్‌లో 45% ఆధారంగా ప్రవేశం ఉంటుంది.

నాన్ ఇంజనీరింగ్ ప్రోగ్రాంల గురించి మరిన్ని వివరాలకు దర్శించండి:
htpps://vitap.ac.in/ug-pg-admissions-2024/
పరిమిత సీట్లు అందుబాటులో ఉన్నవి.

నాన్ ఇంజనీరింగ్ ప్రోగ్రాంల ఇన్ఫో కొరకు స్కాన్ చేయండి

నాన్ ఇంజనీరింగ్ ప్రోగ్రాంలలో ప్రవేశాలకు పొడిగించబడిన తేది 31 మే 2024

పిజి ప్రోగ్రాంలు
- M.Tech. విఎల్ఎస్ఐ డిజైన్
- M.Sc డాటా సైన్స్
- M.Sc కెమిస్ట్రీ
- M.Sc ఫిజిక్స్

అర్హతా ప్రమాణం: VITMEE ర్యాంక్ ఆధారంగా ప్రవేశం ఉంటుంది మరియు అండర్ గ్రాడ్యుయేట్స్ పిజి ప్రోగాంకు దరఖాస్తుచేయుటకు కనీస మొత్తంగా 60% పొంది ఉండాలి.

Ph.D ప్రోగ్రాంలు
ఇంజనీరింగ్ / సైన్సెస్ / మేనేజ్‌మెంట్ కామర్స్ / లా / హ్యూమనిటీస్ / లాంగ్వేజెస్

VIT-AP University, Beside AP Secretariat, Near Vijayawada, Andhra Pradesh-522241
admission@vitap.ac.in 08632370444 7901091283 / 7901311658
Scan for more info
www.vitap.ac.in vitap.university vitap.university vit-ap VITAPuniversity VITAP

పల్నాడు జిల్లా కలెక్టర్‌గా శ్రీకేశ్ లత్కర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా కలెక్టర్‌గా శ్రీకేష్ లత్కర్ బాలాజీరావు నియమితులయ్యారు. ఆయన 2011 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన వారు.

ప్రస్తుతం ఆయన మున్సిపల్ పరిపాలనా శాఖ డైరెక్టర్‌గా ఉన్నారు. గతంలో శ్రీకాకుళం కలెక్టర్‌గా పనిచేశారు. పల్నాడు జిల్లాలో జరిగిన అల్లర్ల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో శ్రీకేష్ లత్కర్‌ను నియమిస్తూ ఎన్నికల కమిషన్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

జూన్ 15 నుండి ముంబై-విజయవాడ సర్వీస్

ప్రజాశక్తి-గన్నవరం

ఎయిరిండియా విమాన సంస్థ జూన్ 15 నుంచి ముంబై- విజయవాడ మధ్య విమాన సర్వీసును నడపనుంది. బోయింగ్ ఎ320 విమానంలో 180 మంది ప్రయాణికులు ప్రయాణించవచ్చును. ఈ విమాన సర్వీస్ ప్రతిరోజు సాయంత్రం 3.55 గంటలకు ముంబైలో బయలుదేరి 5.45 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరిగి 7.10 గంటలకు విజయవాడలో బయలుదేరి రాత్రి తొమ్మిది గంటలకు ముంబై చేరుకుంటుంది. వ్యాపార, వాణిజ్యవేత్తలకు ఈ సదుపాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని విమానాశ్రయ అధికారులు పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

వాహనాలకు మాత్రమే పెట్రోల్, డీజిల్

- నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పల్నాడు ప్రాంతంలో పెట్రోల్ బాంబులు బయటపడిన నేపథ్యంలో ఎన్నికల కమిషన్ అప్రమత్తమైంది. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఆయా జిల్లాల కలెక్టర్లు శనివారం పెట్రోల్ బంక్‌ల యాజమాన్యం పాటించాల్సిన ఎన్నికల నియమావళి గురించి సర్క్యులర్స్‌జారీ చేశారు. మే నెల 10వ తేదీ వరకు పెట్రోల్ బంకుల్లో వాహనాలకు మాత్రమే పెట్రోల్ పోయాలని, కంటైనర్స్, బాటిల్స్, డ్రమ్స్‌తో పాటు ఎటువంటి పాత్రల్లో పెట్రోల్, డీజిల్ అమ్మరాదని, నియమావళిని ఉల్లంఘించి అమ్మకాలు చేస్తే ఆయా పెట్రోల్ బంక్ లైసెన్స్‌ను ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సిఫార్సు చేస్తామని ఆయా జిల్లాల కలెక్టర్లు పేర్కొన్నారు.

స్పెషల్ సెషన్‌లో సెన్సెక్స్‌కు లాభాలు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు శనివారం నిర్వహించిన స్పెషల్ సెషన్‌లో లాభాలను నమోదు చేశాయి. సెన్సెక్స్ 89 పాయింట్లు పెరిగి 74,006కు చేరగా.. ఎన్ఎస్ఇ నిఫ్టీ 36 పాయింట్ల లాభంతో 22,502 వద్ద ముగిసింది. మొత్తం రెండు సెషన్లలో ప్రత్యేక ట్రేడింగ్ నిర్వహించారు. సాధారణంగా శనివారం మార్కెట్లకు సెలవు. కానీ.. ప్రాథమిక సైట్‌లో ఏమైనా లోపాలు తలెత్తితే ఎదుర్కొనే సన్నద్ధతను పరీక్షించేందుకు ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ విభాగాల్లో ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌ను ఏర్పాటు చేశారు. మొదటి సెషన్ ఉదయం 9.15 గంటలకు ప్రారంభమై 10.15 గంటల వరకు నిర్వహించగా.. రెండో సెషన్ 11.30 - 12.30 గంటల మధ్య నిర్వహించారు.

న్యాయవ్యవస్థ పరిరక్షణకు ప్రజాస్వామికవాదులు నడుం కట్టాలి

- 'ప్రబీర్ పుర్కాయస్థ' విడుదలను స్వాగతిస్తూ జరిగిన సభలో వక్తలు
- 'అలుపెరగని పోరాటం' ఆవిష్కరించిన ఎంఎల్‌సి లక్ష్మణరావు

'అలుపెరుగని పోరాటం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి- విజయవాడ

న్యాయవ్యవస్థ పరిరక్షణకు ప్రజాస్వామికవాదులు నడుం కట్టాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి-మోడీ ప్రభుత్వం అన్ని వ్యవస్థల మాదిరిగానే న్యాయ వ్యవస్థనూ తన గుప్పిట్లో పెట్టుకొని దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. దీనికి ప్రముఖ మేధావి, న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ అక్రమ అరెస్టే నిదర్శనమన్నారు. ప్రబీర్ పుర్కాయస్థ అక్రమ అరెస్ట్‌పై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ శనివారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్లో సభ జరిగింది. ముందుగా 'అలుపెరగని పోరాటం' ప్రబీర్ పుర్కాయస్థ ఆత్మకథ పుస్తకాన్ని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సాంస్కృతిక కార్యకర్త గోళ్ల నారాయణరావు అధ్యక్షత వహించారు. సభలో లక్ష్మణరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో నిర్వహించిన అనేక పోరాటాల ఫలితంగా రాజ్యాంగం ద్వారా ప్రాథమిక హక్కులు కల్పించబడ్డాయని వివరించారు. వీటిని మోడీ ప్రభుత్వం హరిస్తోందన్నారు. ప్రాథమిక హక్కులను కాపాడుకునేందుకు జరిగే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఏడాదికిపైగా ఢిల్లీలో జరిగిన మహత్తర రైతు ఉద్యమాలు, సిఎఎ వ్యతిరేక ఉద్యమాలు... ఇలా అనేక పోరాటాలకు వెన్నుదన్నుగా నిలిచి ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారనే కారణంతోనే ప్రబీర్ పుర్కాయస్థ గొంతునొక్కేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. కేంద్రంలోని బిజెపి-మోడీ ప్రభుత్వం ఆయనను అరెస్ట్ చేసి, ఎనిమిది నెలలపాటు జైలులో ఉంచిందని, సుప్రీంకోర్టు జోక్యంతోనే ఆయన విడుదల సాధ్యమైందని వివరించారు. సుప్రీంకోర్టు తీర్పు పట్ల ప్రజాస్వామికవాదులు, అభ్యుదయవాదులు, వామపక్షవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. దేశంలో ఆనాడు ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించగా, ప్రస్తుత మోడీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందన్నారు. ఏ కారణమూ చూపకుండా అత్యంత దుర్మార్గమైన, ప్రమాదకరమైన ఉపా చట్టాన్ని ప్రబీర్ పుర్కాయస్థపై మోపి నెలల తరబడి జైలు పాలు చేసిందన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా, స్టాన్‌స్వామి లాంటి వందలాది మంది మేధావులపైనా, అభ్యుదయవాదులపైనా ఈ చట్టాన్ని మోపి, జైళ్ల పాలు చేసి అత్యంత క్రూరంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ముస్లిములు, క్రిస్టియన్లు, కమ్యూనిస్టులు ఉండరాదని, చివరికి సైన్స్ ఉండరాదని ఆర్ఎస్ఎస్, బిజెపి కత్తి కట్టాయన్నారు. బిజెపి-మోడీ ప్రభుత్వ పాలన అత్యంత ప్రమాదకరంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపా చట్టం చాలా దుర్మార్గమైందని, అనేక మంది ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గుతున్నారని తెలిపారు. సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపల్ చెన్నుపాటి దివాకర్‌బాబు మాట్లాడుతూ పౌర సమాజం నిద్రాణంలో ఉంటే న్యాయవ్యవస్థ కూడా అలాగే ఉంటుందన్నారు. దేశంలో పరిపాలన, రాజకీయ వ్యవస్థను మార్చడం ద్వారానే న్యాయవ్యవస్థలో కూడా మార్పును తీసుకురాగలుగుతామని పేర్కొన్నారు. ప్రజలు, పౌరసమాజం, వామపక్షవాదులు ఇందుకోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు మాట్లాడుతూ ప్రజలపక్షాన కాకుండా ప్రభుత్వాలకు అనుకూలంగా కోర్టు తీర్పులు వస్తున్నాయని, ఇటువంటి తరుణంలో సంఘటితంగా ఉద్యమించి న్యాయవ్యవస్థను కాపాడుకోవాలని కోరారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ పూర్వ సంపాదకులు, 'అలుపెరగని పోరాటం' పుస్తకాన్ని తెలుగులో అనువదించిన కె.ఉషారాణి మాట్లాడుతూ ప్రజాజీవితంతో తన అనుభవాలు కాకుండా 50 ఏళ్లలో దేశంలో జరిగిన అనేక ఘటనలు, అనుభవాల చరిత్రను ప్రబీర్ పుర్కాయస్థ తన ఆత్మకథలో రాశారని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ కె లక్ష్మయ్య, నిర్వాహకులు వొరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలో కురుస్తున్న భారీ వర్షానికి మూతపడ్డ దుకాణాలు

త్రిపురాంతకంలో భారీ వర్షం

- పలుచోట్ల మోస్తరు వాన
- పిడుగుపాటుకు ఇద్దరు మృతి

ప్రజాశక్తి- యంత్రాంగం

ఉపరితల ద్రోణి ప్రభావంతో శనివారం ప్రకాశం, గుంటూరు, పల్నాడు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. భారీ ఈదురుగాలులకు రహదారికి ఇరువైపులా ఉన్న చెట్టు కొమ్మలు విరిగిపడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెనాలి ఆర్‌టిసి బస్టాండ్ జలమయ్యమైంది. పిడుగుపాటుకు ప్రకాశం జిల్లాలో ఒకరు, పల్నాడు జిల్లాలో మరొకరు మరణించారు.ప్రకాశం జిల్లా త్రిపురాంతకంతో పాటు మండలంలోని ముడివేముల, పాపాన్నపాలెం, బడ్డుపాలెం, కంకణాలపల్లి, రాజుపాలెం, డివిఎన్ కాలనీ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. పలు దుకాణాలు మూతపడ్డాయి. యర్రగొండపాలెం రహదారిపై చెట్టు కొమ్మలు పడిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. త్రిపురాంతకంలోని డివిఎన్ కాలనీకి చెందిన నారాయణ (37) తమ పశువులను మేపేందుకు గ్రామసమీపంలోని పొలాల్లోకి తోలుకెళ్లారు. అదే సమయంలో ఆయనకు సమీపంలో పిడుగుపడడంతో అక్కడికక్కడే మరణించారు. పల్నాడు జిల్లా ఈపూరు మండలం ఎముప్పాళ్ల గ్రామానికి చెందిన రైతు హనుమంతరావు (40) తమ గేదెలను మోపుకుని ఇంటికి తిరిగి వస్తుండగా ఆయనకు సమీపంలో పిడుగుపడడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు.అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో వర్షం కురిసింది. పెదబయలులో మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో పాటు ఈదురుగాలులూ వీచాయి. కొన్ని గ్రామాల్లో అరటి చెట్లు నేలకొరిగాయి.

ఇంట్లోకి దూసుకెళ్లిన సిమెంట్ లారీ

- భారీగా ఆస్తి నష్టం.. డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - ముద్దనూరు

వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగు వైపు నుండి సిమెంట్ లోడుతో వస్తున్న లారీ అతి వేగంగా రైల్వే గేటు ఢీ కొని అంతే వేగంతో ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో లారీడ్రైవర్ రాయల బాషా (37) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సిఐ దస్తగిరి తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మలమడుగు టౌన్‌కు చెందిన లారీ యజమాని, డ్రైవర్ రాయల బాషా మైలవరం మండలంలోని దాల్మియా సిమెంట్ కర్మాగారం నుండి లారీలో సిమెంట్ లోడుతో పుంగనూరుకు వెళు తుండగా.. ముద్దనూరు రాగానే లారీ అతి వేగంతో రైల్వే గేటును ఢీ కొని మసీదు సమీపంలో ఉన్న విజయలక్ష్మి ఇంట్లోకి దూసుకెళ్లింది. ఇంట్లో బట్టల షాపు నడుపుతుండడంతో దుస్తులు, ఫ్యాన్సీ ఐటమ్స్, ఫర్నీచర్, ఇంటి ముందు భాగం పైఅంతస్తు పూర్తిగా ధ్వంసమయ్యాయి. డ్రైవర్ లారీలో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. భాదితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్స్ భద్రతపై ఇసి ఫోకస్

మూడంచెల భద్రతతో కట్టుదిట్టం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో, ఎచ్చెర్ల, ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఇవిఎమ్‌లను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్స్ భద్రతపై ఎన్నికల కమిషన్ ఫోకస్ పెట్టింది. తిరుపతి, పల్నాడు, మాచర్ల, గురజాల,నరసరావుపేట, తాడిపత్రిలో చోటుచేసుకున్న సంఘటనలో నేపథ్యంలో ఇసి అప్రమత్తమైంది. మరోవైపు ప్రతిపక్షం నుండి కూడా ఇసికి ఫిర్యాదులు అందుతున్నాయి నాగార్జున యూనివర్శిటీ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్స్ పక్కనే ఉన్న సెమినార్ హాల్‌లో భారీ సంఖ్యలో పోలీస్ సిబ్బందితో సిఎం సెక్యూరిటీ ఆఫీసరు అట్టాడ బాబ్జీ నేతృత్వంలో జరిగిన సభ వివాదామైంది. ఈ సభలో సిద్ధం పోస్టర్‌ను ప్రదర్శించారని టిడిపి నేత దేవినేని ఉమామహేశ్వరరావు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రతను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. ఇందులో స్ట్రాంగ్ రూమ్ ప్రధాన ధ్వారం వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు కేంద్ర బలగాలు గార్డు డ్యూటీ చేస్తున్నట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. వీరితో పాటు జిల్లా ఆర్డ్మ్ పోలీస్ గార్డు, సివిల్ పోలీసులు బందోబస్తు నిర్వహించే విధంగా ఇసి చర్యలు చేపట్టింది. అనధికార వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ స్ట్రాంగ్ రూమ్స్‌లు ఉన్న ప్రాంతానికి అనుమతించరాదని ఎన్నికల కమిషన్ సంబంధిత ఎన్నికల అధికారులను ఆదేశించింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా స్వయంగా జిల్లాలు తిరుగుతూ స్రాంగ్ రూమ్‌ల భద్రతను పర్యవేక్షిస్తున్నారు.

విశాఖలో ఎయు ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేస్తున్న ముకేశ్ కుమార్ మీనా

శ్రీకాకుళం, విశాఖలో స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించిన ముకేశ్ కుమార్

ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా ఆదేశించారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలంలోని శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో శ్రీకాకుళం పార్లమెంట్, ఎనిమిది శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్‌రూమ్‌లను, ఎయు ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో ఏర్పాటు చేసిన ఇవిఎం స్ట్రాంగ్ రూమ్‌లను శనివారం ఆయన పరిశీలించారు. తలుపులకు వేసిన తాళాలు, సీళ్లను పరిశీలించారు. అన్ని చోట్లా సిసి కెమెరాలు ఉన్నాయా ? లేదా ?, అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారా? లేదా ? అనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముకేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ.. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ఇక్కడి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్‌రూమ్‌లు ఉన్న ప్రాంతంలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలన్నారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ తమీమా అన్సారియా, టెక్కలి రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఆయా నియోజకవర్గాల ఆర్ఒలు, తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రయివేటీకరణ కుట్రలను తిప్పికొడతాం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు కేంద్ర బిజెపి చేస్తున్న కుట్రలను, అందుకు సహకరిస్తూ స్టీల్ యాజమాన్యం చేపడుతున్న చర్యలను పోరాటాలతో తిప్పికొడతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1192వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఇఎస్ఎఫ్, ఇఆర్ఎస్, ఇఎండి, సేఫ్టీ విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని ఉపయోగించుకుని కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకుండా కేంద్రం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని వివరించారు. ప్లాంట్ లాభాల్లోకి వచ్చే ప్రత్యామ్నాయ మార్గాలను మూసివేసి ప్లాంటును అమ్మాలని చూస్తున్న కేంద్ర కుట్రలను తిప్పికొడతామన్నారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఉపాధ్యక్షులు కె గంగాధర్ మాట్లాడుతూ స్థానిక స్టీల్ యాజమాన్యం కార్మికుల సహనాన్ని అలుసుగా తీసుకొని జీతాలు చెల్లించడంలేదన్నారు. ప్లాంటును పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపి అమ్మకాలను వృద్ధి చేయాలని కోరారు. ప్లాంట్‌ను నష్టపరిచే చర్యలకు దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ ప్రతినిధులు గణపతిరెడ్డి, నాయకులు గోవిందు, సన్నిబాబు, రమణమూర్తి, ఆలీషా, ప్రసాద్, భాస్కర్, సుమన్ పాల్గొన్నారు.

గుండె వైద్యులు కావడమే లక్ష్యం

- తెలంగాణ ఇఎపి సెట్ మొదటి ర్యాంకర్ ప్రణీత

ప్రజాశక్తి- మదనపల్లి (అన్నమయ్య జిల్లా)

గుండె వైద్య నిపుణులు కావాలని తన ఆశయమని తెలంగాణ ఇఎపి సెట్‌లో అగ్రికల్చర్, ఫార్మసీలో మొదటి ర్యాంకు సాధించిన అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన ఆలూరి ప్రణీత తెలిపారు. పేదలకు వైద్య సేవలందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. శనివారం స్థానిక మీడియాతో ఆమె మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు హోమియోపతి డాక్టర్ ఆలూరు శ్రీకర్, సైన్స్ ఉపాధ్యాయులు కల్యాణి ప్రోత్సాహంతో మదనపల్లి, విజయవాడలో చదివానన్నారు. ఫస్ట్ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందని చెప్పారు.

ప్రణీతకు స్వీట్స్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

ఇంజనీరింగ్ విభాగం

సతివాడ జ్యోతిరాధిత్య (1వ ర్యాంకు)

గొల్లలేఖ హర్ష (2వ ర్యాంకు)

మురసాని సాయి యశ్వంత్‌రెడ్డి (5వ ర్యాంకు)

పుట్టి కుషాల్ కుమార్ (6వ ర్యాంకు)



రోషన్ సాయి పబ్బ (8వ ర్యాంకు)

ధనుకొండ శ్రీనిధి (10వ ర్యాంకు)

అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం

అలూర్ ప్రణీత (1వ ర్యాంకు)

నగుదాసరి రాధాకృష్ణ (2వ ర్యాంకు)

సొంపల్లి సాకేత్ రాఘవ్ (4వర్యాంకు)

వడ్లపూడి ముకేశ్ చౌదరి (7వ ర్యాంకు)

పూల దివ్యతేజ (10వ ర్యాంకు)

తెలంగాణ ఎప్‌సెట్‌లో మన రాష్ట్ర విద్యార్థులకే టాప్ ర్యాంకులు

- ఉత్తీర్ణతలో అమ్మాయిలదే ఆధిక్యం
- ఇంజనీరింగ్‌లో జ్యోతిరాధిత్య, అగ్రికల్చర్‌లో ప్రణీత ప్రథమం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ (ఎంసెట్) రాత పరీక్షల ఫలితాలను విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం శనివారం హైదరాబాద్‌లోని జెఎన్‌టియులో విడుదల చేశారు. ఎప్‌సెట్ ఫలితాల్లో మన రాష్ట్ర విద్యార్థులు టాప్ ర్యాంకులు తెచ్చుకున్నారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో టాప్ టెన్‌లో ఐదు చొప్పున ర్యాంకులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో మొదటి రెండు ర్యాంకులతోపాటు 5, 6, 8, 10 ర్యాంకుల్లో తెచ్చుకున్నారు. అగ్రికల్చర్, ఫార్మసీలో కూడా మొదటి రెండు ర్యాంకులతోపాటు 4, 7, 10 ర్యాంకులు సాధించారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లోనూ ఎక్కువ మంది అమ్మాయిలే అర్హత సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో 74.98 శాతం మంది అర్హులయ్యారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 89.67 శాతం మంది అర్హత సాధించారు.

పెళ్లింట విషాదం

(మొదటి పేజీ తరువాయి)

ఎగిరి పడింది. ఈ సమయంలో ఆ రోడ్డులో ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొని కారు నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో కారులోని షేక్ అలీ సాహెబ్, పెళ్లి కొడుకు షేక్ ఫిరోజ్ బాషా, అలీ సాహెబ్ మనవళ్లు షేక్ మొహమ్మద్ ఆహిల్ (6), షేక్ మొహమ్మద్ ఆమన్ (4) సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. అలీ సాహెబ్ సోదరుని భార్య ఎస్.రెహనా భాను (44), కోడలు షేక్ జహీదా (32), కారును నడుపుతున్న షేక్ మొహమ్మద్ గౌస్ తీవ్రంగా గాయపడ్డారు. సిఐ ఎం.వెంకటరామిరెడ్డి, ఎస్ఐ బి.నబీరసూల్ ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఎస్.రెహనా భాను మరణించారు. ఎస్.జహీదా, షేక్ మహమ్మద్ గౌస్‌లను మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జహీదా మృతి చెందారు. పెళ్లి జరగాల్సిన ఇంట్లో ఇలా మరణాలు సంభవించడం అందరినీ కలిచి వేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడు జిల్లాలకు కొత్త ఎస్‌పిలు

(మొదటి పేజీ తరువాయి)

సిఎస్, డిజిపి వివరణ ఇచ్చి వచ్చారు. ఇందులో పల్నాడు, అనంతపురం జిల్లాల ఎస్‌పిలను సస్పెండ్ చేయాలని, తిరుపతి జిల్లా ఎస్‌పిని బదిలీ చేయాలని సిఎస్ సూచించారు. సస్పెండ్ చేయాలని సూచించిన ఇద్దరు అధికారులు కొత్తగా నియ మితులైన వారే. ఎన్నికల కమిషన్ నియమించిన అధికారుల్లో ఇద్దరిని సస్పెండ్ చేయడం, ఒకరిని బదిలీ చేయడం వెనుక రాజకీయం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తప్పనిసరిగా ఎస్‌పిలను మార్చాలని ఎన్నికల కమిషన్ ఆదేశించడం, కొత్త వారిని నియమించడం చకచకా జరిగిపోయాయి. ఇలా నియమించిన వారినే సస్పెండ్ చేయడం, అనుకూలమైన అధికారిని కేవలం బదిలీ చేశారనే విమర్శలూ వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కొత్తగా నియమించిన ఒక అధికారి కూడా అధికార పార్టీకి అనుకూలంగా ఉండేవారనే విమర్శలు ఉన్నాయి. దీనిపై సస్పెండయిన ఉన్నతాధికారులు ఎన్నికల కమిషన్‌కు తమ వివరణ తెలియజేసేందుకు సిద్ధమయ్యారని తెలిసింది.

కిర్గిజ్‌లో విదేశీ విద్యార్థులపై అల్లరి మూకల దాడి!

(మొదటి పేజీ తరువాయి)

అడ్డుకుని ఆ వ్యక్తులతో ఘర్షణ పడ్డారని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈలోగా హాస్టల్‌లోని విదేశీ విద్యార్థులంద రూ బయటకు రావడంతో గొడవ పెద్దదైంది. దాంతో నలుగురు దుండగుల్లో ముగ్గురు అక్కడ నుండి పారి పోయారు. మిగిలిన వ్యక్తి గాయపడడంతో విద్యార్థులే అంబులెన్స్‌ను పిలిపించి ఆస్పత్రికి పంపారు. అక్కడ చికిత్స తీసుకుని ఆ వ్యక్తి వెళ్లిపోయాడు. ఇదంతా కూడా సెక్యూరిటీ కెమెరాల్లో రికార్డ్ అయింది. ఈ సంఘటనపై పోలీసులు క్రిమినల్ దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తుకు సంబంధించి నలుగురు విదేశీయులను అదుపులోకి తీసుకున్నారు. ఆ దుండగులు ఫోన్లు, డబ్బులు లాక్కున్నారని ముగ్గురు విద్యార్థులు ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన వారిలో ఇద్దరిని పోలీసులు గుర్తించారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన వీడియో బయటకు రావడంతో ప్రజల్లో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. యువతలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. దాంతో స్థానికంగా అశాంతి పెచ్చరిల్లింది. నగరంలోని యువత అంతా ఒకచోట చేరి ఈ పరిణామాలను తీవ్రంగా నిరసించారు. బాధ్యులైన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారని మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే ఈ సంఘటనలో బాధితులకు సంబంధించి కొంత తప్పుడు సమాచారం కూడా వ్యాప్తి చేశారని తెలిపింది. ప్రస్తుతమైతే పరిస్థితులు చక్కబడ్డాయని పేర్కొంది. కిర్గిజ్ విదేశాంగ శాఖ జారీ చేసిన ప్రకటనను ఇండియన్ ఎంబసీ తన ఎక్స్‌లో పోస్టు చేసింది. అప్రమత్తంగా వుండాల్సిందిగా భారత్ అక్కడ నివసిస్తున్న భారతీయులకు, విద్యార్థులకు పలు సూచనలు జారీ చేసింది. బయటకు వెళ్లకుండా ఇళ్లల్లోనే వుండాల్సిందిగా కోరింది. అల్లరి మూక ఆగడాల వీడియోలు సోషల్ మీడియాలో రావడంతో అప్రమత్తమైన ఇండియన్ ఎంబసీ శనివారం ఉదయం ఆదేశాలు వెలువరించింది. భారత విద్యార్థులతో నిత్యం మాట్లాడుతున్నామని తెలిపింది. దాడికి పాల్పడుతున్నవారు, విదేశీయుల మధ్య చెలరేగిన హింసకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో బయటకు వచ్చిన నేపథ్యంలో శనివారం ఉదయం నిరసనలు మొదలయ్యాయి. భారత విదేశాంగ మంత్రి జై శంకర్ ట్వీట్ చేస్తూ, భారత విద్యార్థుల పరిస్థితులను ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. నగరంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు కిర్గిజ్ అంతర్గత వ్యవహారాల శాఖ తెలిపింది. ప్రస్తుతం పరిస్థితులు నిలకడగా వున్నాయని, నగరంలోని అన్ని వీధుల్లో ట్రాఫిక్‌ను పునరుద్ధరించామని పేర్కొంది. ఒక నివేదిక ప్రకారం స్థానికులు, ఈజిప్ట్ విద్యార్థుల మధ్య ఘర్షణ చెలరేగిన ట్లు తెలుస్తోంది. ఈ హింసలో ముగ్గురు పాకిస్తానీ విద్యార్థులు మరణించినట్లు పాక్ అధికారి తెలిపారని పాక్ వార్తా వెబ్‌సైట్ తెలిపింది. అయితే ఆ వార్తలను పాక్ ఎంబసీ కొట్టేసింది. కిర్గిజ్ ఎంబసీతో తాము మాట్లాడుతునే వున్నామని పాక్ ప్రధాని ట్వీట్ చేశారు.

భయాందోళనలో భారతీయ వైద్య విద్యార్థులు

ప్రజాశక్తి- బొబ్బిలి (విజయనగరం జిల్లా)

కిర్గిజిస్తాన్‌లో అల్లరి మూకల దాడులతో ఆ దేశంలో వైద్య విద్యనభ్యసిస్తున్న విజయనగరం జిల్లా రాజాంకు చెందిన 12 మంది విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. కిర్గిజిస్తాన్‌లో అరబ్ దేశానికి చెందిన యువతీ యువకులు ఒకే హాస్టల్‌లో ఉంటున్నారు. అమ్మాయిలను కిర్గిజిస్తాన్ యువకులు మూడు రోజుల క్రితం ర్యాగింగ్ చేయడంతో యువకులు అడ్డుకున్నారు. దీంతో, అదే రోజు సాయంత్రం యువకులు మూకుమ్మడిగా అరబ్ విద్యార్థులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో, పక్కనే నివాసముంటున్న మన దేశానికి చెందిన వైద్య విద్యార్థులు భయంతో రూముల్లోనే ఉంటున్నారు. తమను తీసుకెళ్లిన కాంట్రాక్టర్, ఇండియన్ ఎంబసీ పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. తమకు కిర్గిస్తాన్ కార్మికులు రక్షణగా ఉన్నారని వారు సోషల్ మీడియా ద్వారా కుటుంబ సభ్యులకు తెలిపారు.

బుల్లిపెట్టెలో బూచి

(మొదటి పేజీ తరువాయి)

సెల్‌ఫోన్లను పోలీస్ అధికారులు స్వాధీనం చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇలా ఫోన్లను స్వాధీనం చేసుకుంటున్న సంఘటనలు ఇటీవలే పెరిగాయి. 2022లో 'ది వైర్ జర్నలిస్టు'లపై పరువు నష్టం కేసు దాఖలైంది. దీనికి సంబంధించి 2023లో ఒక రోజు తెల్లవారు జామున 60కి పైగా ప్రాంతాల్లో దాడులు చేసి జర్నలిస్టుల నుండి ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. న్యూస్ క్లిక్ విషయంలో 250కిపైగా ఫోన్లను ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. వాటి ఆధారంగా తప్పుడు కేసులు పెట్టడానికి ప్రయత్నించారు.

ఫోన్‌లలోకి ప్రభుత్వం..!

సెల్‌ఫోన్ల వినియోగం సాధారణమైన ప్రస్తుత రోజుల్లో సామాన్య ప్రజల ఫోన్లలోకి కూడా ప్రభుత్వం ప్రవేశిస్తోంది. ఆధార్, మొబైల్ లింకేజి ద్వారా ఇప్పటికే ఈ తరహా సమాచారం ప్రభుత్వానికి చేరింది. డిజి లాకర్, డిజియాత్ర వంటి యాప్‌ల నుండి కూడా ప్రభుత్వం ప్రజల సమాచారాన్ని సేకరిస్తోంది. సెల్‌ఫోన్లు వాడే ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిఘా పరిధి లోకి వచ్చేశారని టెక్ నిపుణుల అభిప్రాయం. అంటే, ప్రతి ఒక్కరిపైనా తప్పుడు కేసుల కత్తి వేలాడుతున్నట్టే!

జిందాల్ లాకౌట్‌ను ఎత్తివేయాలి

- సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయనగరం జిల్లా అప్పనపాలెంలో జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీలు ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్‌ను ఎత్తివేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.వి.నాగేశ్వరరావు, సిహెచ్.నరసింగరావు శనివారం విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వం, కార్మికశాఖ అధికారులు వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కార్మికులు నిర్వహిస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ముడిసరుకును సాకుగా చూపి యాజమాన్యం అక్రమ లాకౌట్‌ను ప్రకటించిందని తెలిపారు. రెగ్యులర్ కార్మికులతోపాటు 450 మంది కాంట్రాక్టు కార్మికులు ఈ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారని వివరించారు. యాజమాన్యం నిర్ణయం వల్ల వీరందరి కుటుంబాలు రోడ్డున పడతాయని వివరించారు. కార్మికులను ఒరిస్సాలోని జాజ్‌పూర్‌లో పనిచేయాలని ఏకపక్షంగా నిర్ణయించడం అన్యాయమని పేర్కొన్నారు. చాలీచాలని వేతనాలతో అక్కడ పనిచేసే పరిస్థితి లేదని, కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, ఇక్కడే ఉపాధి కల్పించాలని డిమాండు చేశారు.

సిఎం పర్యటన సమయంలో విమానాశ్రయంలో అనుమానాస్పద వ్యక్తి

- అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - గన్నవరం : సిఎం జగన్ విదేశీ పర్యటన నేపథ్యంలో గన్నవరం విమానాశ్రయంలో శుక్రవారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ ఎన్ఆర్ఐ డాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సిఎంకు సమీపంలో తుళ్లూరు లోకేష్ అనే ఓ ఎన్నారై డాక్టర్ సంచరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో వెంటనే ఆయనను అదుపులోకి తీసుకున్నారు. విచారించేందుకు ప్రయత్నించగా.. తనకు గుండెపోటు అని చెప్పి కిందపడిపోయాడు. పోలీసులు అతడిని విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సిఎం జగన్ విదేశీ పర్యటనకు సంబంధించిన అప్‌డేట్ మెసేజ్‌లను ఎప్పటికప్పుడు ఇతరులకు అతను పంపినట్లు తెలిసింది. శనివారం ఉదయం అమెస్టర్ డ్యామ్ ఎయిర్ పోర్టులో దిగి అక్కడి నుంచి లండన్‌లోని తన కుమార్తె వద్దకు సిఎం దంపతులు వెళ్లినట్లు సమాచారం. జూన్ ఒకటి తిరిగి ఆయన రాష్ట్రానికి రానున్నారు.

పే స్లిప్పులు ఇవ్వాలి

- పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి
- ఉపాధి కార్మికుల నిరసన

ప్రజాశక్తి - ఉంగుటూరు (ఏలూరు జిల్లా)

తమకూ పే స్లిప్పులు ఇవ్వాలని, పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని, సంవత్సరానికి 200 రోజులు పనులు కల్పించి రోజుకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ కార్మికులు శనివారం ఆందోళనకు దిగారు. ఎపి రైతుసంఘం, ఎపి కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరంలోని నంది భవాని చెరువు ఉపాధి హామీ పనుల వద్ద నిరసన చేపట్టారు. ఆయా సంఘం నాయకులు ఉపాధి హామీ పనులను పరిశీలించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఏలూరు జిల్లా కైకరంలో నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

సమస్యలపై నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె శ్రీనివాస్, సీనియర్ జిల్లా నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు నిధులు తగ్గించి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. ఉపాధి పనులను రక్షించుకునేందుకు కార్మికులంతా సంఘటితం కావాలని కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం ఉపాధి హామీ కార్మికులకు రావడంలేదన్నారు. పే స్లిప్పులు ఇవ్వకపోవడం వల్ల ఎంత కూలి వస్తుందో కార్మికులకు అర్థం కావడంలేదన్నారు. కనీస సౌకర్యాలు టెంట్లు, మజ్జిగ, తాగునీరు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఊరికి దూరంగా పనులు చేయడం వల్ల రవాణా ఖర్చులు కార్మికులే భరించాల్సి వస్తోందన్నారు. వేతనాలు సకాలంలో చెల్లించకపోవడం వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి

ప్రజాశక్తి- సదుం (చిత్తూరు జిల్లా)

పంట పొలాలపై ఏనుగులు దాడి చేసిన ఘటన చిత్తూరు జిల్లా సదుం మండలం జోగివారిపల్లి పంచాయతీ పరిధిలో చోటు చేసుకుంది. ఐరాల మండలం నుంచి శుక్రవారం అర్ధ రాత్రి ఏనుగుల గుంపు వచ్చి జోగివారిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న వరి, మామిడి, టమాట పంటలను ధ్వంసం చేశాయి. పంట పొలాల చుట్టూ రక్షణ కోసం ఏర్పాటు చేసిన కంచెలను సైతం ధ్వంసం చేసి పంటలను తిని, తొక్కి, డ్రిప్ పైపులనూ తొక్కి నాశనం చేశాయి. ఈ ఘటనలో రూ. లక్షల్లో పంటలు నష్టపోయామని రైతులు నరసింహారెడ్డి, రెడ్డప్పరెడ్డి, సురేష్ రెడ్డి, రఘులు ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి నుంచి బత్తలవారిపల్లి, జోగివారిపల్లి ప్రాంతాల్లో ఏనుగులు గుంపు సంచరిస్తూ పంటలను తొక్కి నాశనం చేశాయని రైతులు తెలిపారు. ఇకనైనా తగిన చర్యలు తీసుకోవాలని, తమ తమ పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై అవగాహన కల్పించండి

- ఇసికి టిడిపి విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు అవగాహన కల్పించాలని టిడిపి విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి పి కోటేశ్వరరావును ఆ పార్టీ ఎమ్మెల్సీ పి అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్సీ ఎఎస్ రామకృష్ణ, మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్ర సచివాలయంలో శనివారం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఎన్నికల విధులకు హాజరైన ఉద్యోగులందరూ ఫారమ్ 12/12డి దాఖలు చేసే సమయంలో ఉద్యోగస్తులు గెజిటెడ్ ఆఫీసర్ ధృవీకరణతో డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ఫెలిసిటేషన్ సెంటర్‌లోనే ప్రభుత్వం తరపున ఒక గెజిటెడ్ ఆఫీసర్‌ను నియమిస్తారని, కాని కొన్ని చోట్ల డిక్లరేషన్‌లపై కొంతమంది గెజిటెడ్ అధికారులు తమ డిజిగ్నేషన్ స్టాంపు గానీ, అఫీసీయల్ సీల్ కానీ వేయలేదని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సమయంలో కొన్ని చోట్ల ప్రిసైడింగ్ ఆఫీసర్లు బ్యాలెట్ పేపర్ వెనుక వారి సంతకం గానీ, ముద్రకానీ వేయలేదన్నారు. ఈ నెల 10వ తేదిన ఎన్నికల కమిషన్ దృష్టికి ఈ అంశాలను తీసుకొచ్చామని వివరించారు. ఈ లోపాల వల్ల ఎన్నికల నిబంధనల ప్రకారం బ్యాలెట్ పేపర్లను ఇన్వాలిడ్ చేసే అవకాశం ఉందని తెలిపారు. వీటిని వ్యాలిడ్ ఓట్లుగా పరిగణించి బ్యాలెట్ కౌంటింగ్‌లో చేర్చాలని కోరారు. ఎన్నికలు ముగిసినా ఈ అంశంపై ఇప్పటివరకు ఎటువంటి లిఖిత పూర్వక ఉత్తర్వులు సిఇవో కార్యాలయం నుంచి విడుదల కాలేదని తెలిపారు.

ఓటమి భయంతో రక్తపాతం : వర్ల రామయ్య

జగన్ తీరు దొంగే దొంగా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. ఓటమిని జీర్ణించుకోలేక రాష్ట్రంలో రక్త చరిత్రను సృష్టించి ఎన్నికల కమిషన్‌పై మళ్లీ బురద చల్లేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓటమి భయంతో జగన్ ప్లాన్ బితో అరాచకం సృష్టించారని తెలిపారు. రాష్ట్రం పంపిన ప్రతిపాదనల నుంచే అధికారులను ఎన్నికల కమిషన్ నియమించిందని తెలిపారు. 2019లో ఒకే రోజు డిజిపి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంటిలిజెన్స్ డిజితో పాటు పలువురు ఎస్పీలను తొలగిస్తే ఎన్నికల కమిషన్ చర్యలు భేష్ అని జగన్ మెచ్చుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు.

వైసిపి నేతలను అరెస్టు చేయాలి సిట్ అధికారిని కలిసిన టిడిపి

వైసిపి నేతలు పిన్నెళ్లి రామకృష్ణారెడ్డి సోదరులను, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మోహిత్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డిలను వెంటనే అరెస్టు చేయాలని సిట్ చీఫ్ వినిత్ బ్రిజ్‌లాల్‌ను టిడిపి కోరింది. ఆ పార్టీ పొలిట్ బ్యూరోసభ్యులు వర్ల రామయ్య, నేతలు మన్నవ సుబ్బారావు, కోడూరి అఖిల్ శనివారం సిట్ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. మాచర్ల, తాడిపత్రి, తిరుపతి, నరసరావుపేట, అనంతపురాల్లో జరిగిన సంఘటనలపై వీడియో క్లిప్పింగ్‌లను వినిత్‌కు అందించామని అనంతరం నాయకులు మీడియాతో చెప్పారు. తప్పుచేసిన వారిని శిక్షించి తప్పుచేయనివారికి తోడుగా ఉండాలని కోరామని అన్నారు. అందరికీ సమన్యాయం చేయాలని తెలిపారు. తమ ఫిర్యాదులపై వినిత్ సానుకూలంగా స్పందించారని చెప్పారు.

సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వి.శ్రీనివాసరావు, రమాదేవి, తదితరులు

ఆదర్శ కమ్యూనిస్టు ధూళిపాళ్ల

- సంస్మరణ సభలో వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కొల్లూరు (బాపట్ల జిల్లా)

కమ్యూనిజం.. ఒకరు చంపితే చనిపోయేది కాదని, ఉన్నవాడు.. లేనివాడు.. ఇలాంటి అసమానతలు ఉన్నంతకాలం దాని అవసరం ఉంటుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గత నెల 28న మృతి చెందిన ధూళిపాళ్ల సుబ్బారావు సంస్మరణ సభ బాపట్ల జిల్లా కొల్లూరు మండలం, అనంతవరంలో శనివారం వారి స్వగృహంలో జరిగింది. సంస్మరణ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి హాజరయ్యాయరు. సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి.. నివాళు లర్పించారు. సభకు ముందు కామ్రేడ్ సుబ్బారావు స్మారక స్తూపం వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ...కమ్యూనిస్టు సిద్ధాంతాలను సుబ్బారావు నమ్మి ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించారని అన్నారు. అమెరికా లాంటి దేశాలే సంక్షోభంలో పడిపోయాయని, ఆ దేశం అమలుపరుస్తోన్న విధానాల వల్లే అసమానతలు పెరగడమే ఇందుకు కారణమని వివరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ.. 20-30 సంవత్సరాల క్రితం వ్యవసాయ కార్మికుల పోరాటం అంటే పెద్ద యుద్ధం చేయడమేనని, రేపల్లెలో కూలి పోరాటం చేసేటప్పుడు ఎన్నో దాడులు జరిగాయని, తానూ స్వయానా అనుభవించానని, అలాంటి సమయంలో సుబ్బారావు లాంటివారు ఎందరో ఈ పోరాటంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. కార్యక్రమానికి సిపిఎం కొల్లూరు మండల నాయకులు బొనిగల సుబ్బారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య, పార్టీ నాయకులు టి.కృష్ణమోహన్, వై.నేతాజీ, ములక శివసాంబిరెడ్డి, వేములపల్లి వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో ముగ్గురు యువకులు మృతి

ప్రజాశక్తి - అమలాపురం(డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా)

గోదావరిలో స్నానానికి వెళ్లిన ముగ్గురు ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెందిన ఘటన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... రావులపాలేనికి చెందిన సబ్బిల్ల ఈశ్వర్‌రెడ్డి (20), సబ్బిల్ల సత్యనారాయణరెడ్డి అన్నదమ్ములు. వారి స్నేహితులు సత్తి సంపత్‌రెడ్డి (16), పెంటజయకుమార్ (17), కొమ్మర్తి రాజేష్‌తో కలిసి స్నానం చేసేందుకు గోదావరికి వెళ్లారు. రాజేష్‌కు ఈత రాకపోవడంతో గట్టుపైన కూర్చొన్నాడు. మిగిలిన నలుగురూ గోదావరిలో స్నానానికి దిగారు. లోతు ఎక్కువగా ఉండడంతో ఈశ్వర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి మునిగిపోయారు. వారిని రక్షించేందుకు జయకుమార్, సత్యనారాయణరెడ్డి ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో జయకుమార్ కూడా గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. ఈశ్వర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, జయకుమార్ మృతదేహాలను వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

ధాన్యం కొనుగోళ్లపై ఎన్నికల ఎఫెక్ట్

- 70 శాతానికే లక్ష్యం పరిమితం
- సిసిఆర్‌సి కార్డులు లేక బయట మార్కెట్‌ను ఆశ్రయిస్తున్న కౌలుదారులు
- వాతావరణ మార్పులతో అన్నదాతల్లో ఆందోళన

రాజానగరంలో ధాన్యాన్ని బస్తాలకు ఎక్కిస్తున్న అన్నదాతలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ధాన్యం కొనుగోళ్ల లక్ష్యంలో తూర్పుగోదావరి జిల్లా వెనుకబడింది. రబీ సీజన్ లక్ష్యంలో కేవలం 70 శాతానికే కొనుగోలు పరిమితమైంది. దాదాపు కోతలు పూర్తయినా కొనుగోలు లక్ష్యం ఆమడ దూరంలో నిలిచింది. ఎన్నికల ప్రభావం ధాన్యం కొనుగోలుపై పడింది. నోటిఫికేషన్ విడుదల అయినప్పటి నుంచి అధికారులు ఎన్నికల విధుల్లో తలమునకలయ్యారు. దీంతో ధాన్యం సేకరణ నిలిచిపోయింది. దీనికి తోడు గత వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది.

తూర్పుగోదావరి జిల్లాలో ఈ రబీ సీజన్‌లో 1.50 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. సుమారు ఐదు లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి వచ్చినట్లు వ్యవసాయ శాఖ అధికారులు గణాంకాలు చెబుతున్నాయి. 3.20 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం కాగా ఇప్పటి వరకు 22,766 మంది రైతుల నుంచి కేవలం 2.24 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. ప్రస్తుతం జిల్లాలో 99.8 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. దేవరపల్లి, తాళ్లపూడి, సీతానగరం, గోపాలపురం, తాళ్లపూడి మండలాల్లో రైతుల వద్ద ఇంకా ధాన్యం నిల్వలు ఉన్నాయి. వరి ఏ-గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ.2203, కామన్ రకం రూ.2040 ప్రభుత్వ మద్దతు ధర ప్రకటించింది.ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్ 18 నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి అధికారులు ఆ విధుల్లో తలమునకలయ్యారు. దీంతో కొనుగోళ్లపై ఆర్‌బికెల్లో పర్యవేక్షణ కొరవడింది. రైతులు ఆర్‌బికె కేంద్రాలకు వెళ్లినప్పటికీ గోనె సంచులు అందుబాటులో లేకపోవటం, సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వెనుతిరగక తప్పలేదు. తాజాగా వాతావరణంలో నెలకొన్న మార్పులు అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. గతిలేని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తున్నారు. క్వింటాలు ధాన్యం రూ.1800కు ధర మించడం లేదు. 75 కేజీల బస్తా రూ.1400 మించి దళారులు కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వ మద్దతు ధరతో పోల్చితే సరాసరిన బస్తాకు రూ.300 వరకూ రైతులు నష్టపోతున్నారు. రైతులు, రైతు సంఘాల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర గతేడాది కంటే క్వింటాలుపై రూ.143లు వరకు పెంచినప్పటికీ ఆ ఫలాలు రైతు దరి చేరలేదు.

కౌలురైతులకు ప్రభుత్వ నిబంధనలు ఆటంకం

కౌలు రైతులకు ప్రభుత్వ నిబంధనలు ఆటంకంగా మారాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష మంది కౌలురైతులు ఉన్నారు. సిసిఆర్‌సి కార్డులు 57వేలకు మించి పంపిణీ జరగడం లేదు. సిసిఆర్‌సి కార్డులు లేని కౌలురైతులు ఆర్‌బికె సెంటర్లలో ధాన్యాన్ని విక్రయించలేకపోతున్నారు. ఎన్నికల ప్రభావం, వాతావరణ మార్పుల వల్ల ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర కన్నా క్వింటాలుకు సుమారు రూ.400 తక్కువ ధరకు దళారులకు విక్రయించి నష్టపోతున్నారు.

ధరలు పెరగడంతోనే..

ఇప్పటి వరకు 2.24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాలకు రూ.259 కోట్లు జమ చేశాము. జిల్లాలో దాదాపుగా ధాన్యం అమ్మకాలు పూర్తయ్యాయి. మరో పదిరోజుల పాటు ఆర్‌బికెలలో కొనుగోలు ప్రక్రియ కొనసాగిస్తాం.

- జె.రాధిక, జిల్లా మేనేజర్ పౌరసరఫరాల శాఖ

100 కేజీల బస్తా రూ.1800 చొప్పున విక్రయించాను

పదెకరాలు కౌలుకు తీసుకుని గత కొన్నేళ్లుగా వ్యవసాయం చేస్తున్నాను. ఎకరాకు 25 బస్తాలు చొప్పున దిగుబడి వచ్చింది. క్వింటాల్ బస్తా రూ.1800 చొప్పున వ్యాపారికి విక్రయించాను. నాకు సిసిఆర్‌సి కార్డు లేదు. దీంతో ఆర్‌బికెలో విక్రయించే అవకాశం లేదు. వాతావరణం మార్పుల నేపథ్యంలో తక్కువ ధరకు విక్రయించాను.

- బి.సత్తిబాబు, రాజానగరం, కౌలు రైతు.

ఎఐలో లక్ష మందికి ఇంటర్న్‌షిప్

- ఇంజినీరింగ్ విద్యార్థులకు మద్దతు
- ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యం
- స్వేచ్ఛ వ్యవస్థాపకులు వై కిరణ్ చంద్ర వెల్లడి


'సమ్మర్ ఆఫ్ ఎఐ' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రవీణ్ చంద్ర, కిరణ్ చంద్ర, చైతన్య చొక్కారెడ్డి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా లక్ష మంది విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)పై ఇంటర్న్‌షిప్ కల్పిస్తున్నట్లు స్వేచ్ఛ వ్యవస్థాపకుడు వై కిరణ్ చంద్ర తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని స్వేచ్ఛ కార్యాలయంలో సెక్రటరీ ప్రవీణ్ చంద్ర, ఓజోనెటెల్ కమ్యూనికేషన్ సిటిఒ చైతన్య చొక్కారెడ్డితో కలిసి కిరణ్ చంద్ర మీడియాతో మాట్లాడారు. ఈ ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని ఐఐఐటి హైదరాబాద్, ఓజోనెటెల్ కమ్యూనికేషన్స్, మెటా సహకారంతో చేపడుతున్నామన్నారు. స్వేచ్ఛ అనేది ఉచిత సాఫ్ట్‌వేర్, ఉచిత నాలెడ్జ్‌ను అందించే లాభాపేక్ష లేని సంస్థ అన్నారు. ఈ వేసవిలో విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 'సమ్మర్ ఆఫ్ ఎఐ'పై ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. తెలుగు భాషా కేంద్రీకృత లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం) అభివృద్ధికి స్వేచ్ఛకు సహాయం చేస్తూనే.. ఎఐ నైపుణ్యాలతో సన్నద్ధం చేయనున్నామని తెలిపారు.

ఈ ఇంటర్న్‌షిప్ తొలి బ్యాచ్ 10,000 మందితో ప్రారంభమయ్యిందన్నారు. భాషా సుసంపన్నమైన తెలుగు సంపదను ఈ ఇంటర్న్‌షిప్‌లో ఒక్కో విద్యార్థి కనీసం 50 మందిని కలిసి తమ ప్రాంతాలలో, వివిధ మాండలీకాలలో ఉన్న ఈ సంపదను డాక్యుమెంట్ చేసి, అలా రూపొందించన డేటా సెట్ల మీద ఎఐ ట్రైనింగ్ పొందనున్నారన్నారు. ఇది ప్రపంచంలోనే వినూత్నమైన ఒక విశిష్ట ప్రయోగమన్నారు. ఈ ఇంటర్న్‌షిప్‌లో పాల్గొనే విద్యార్థులకు ఎఐ నిపుణులు తర్ఫీదునిస్తారన్నారు. నెలరోజుల పాటు ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్‌లను ఇవ్వనున్నామన్నారు.

"ఎఐ అంటే అందరికీ చాట్ జిపిటి గుర్తుకు వస్తుంది. ఇంగ్లీషు భాష మినహాయించి ఇతర భాషలలో ఈ టెక్నాలజీ అందుబాటుకి సంబంధించి పరిమితులున్నాయి. భారతీయ భాషల విషయానికి వస్తే మరీ అంతంత మాత్రమే. భారతీయ భాషలలో ఎఐ సొల్యూషన్లు అందుబాటులోకి తీసుకురావాలనే ఆకాంక్షతో స్వేచ్ఛ సంస్థ ఒక పరిపూర్ణమైన తెలుగు భాషలో ఒక లార్జ్ లాంగ్వేజ్ మోడల్ అంటే చాట్ జిపిటి వంటి పరిష్కారాన్ని తయారు చేసే ప్రక్రియను ప్రారంభించింది. దీని సాధనకై ఒక లక్ష మంది ఇంజనీరింగ్, సాంకేతిక,ఇతర విద్యార్థులను భాగస్వాములను చేస్తుంది." అని స్వేచ్ఛ సంస్థ పేర్కొంది.

రూ.1 కోటి విలువ నివాసాలకే డిమాండ్

హైదరాబాద్ అమ్మకాల్లో 92% వృద్ధి
నాలుగు నెలల్లో 26వేల యూనిట్ల విక్రయాలు

హైదరాబాద్ : ఎన్నికల సమయంలోనూ తెలంగాణ రాజధానిలో నివాస అమ్మకాలు జోరు మీద సాగాయి. హైదరాబాద్‌లో 2024 మొదటి నాలుగు నెలల్లో మొత్తంగా 26,000 నివాస విక్రయాలు జరిగాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా విడుదల చేసిన రిపోర్ట్‌లో తెలిపింది. వీటి విలువ రూ.16,190 కోట్లుగా ఉందని వెల్లడించింది. గత ఏడాది ఇదే కాలం రిజిస్ట్రేషన్ల సంఖ్యలో 15 శాతం, విలువ పరంగా 40 శాతం వృద్ధి చోటు చేసుకుంది. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలను పరిధిలోకి తీసుకుని నైట్ ఫ్రాంక్ ఈ రిపోర్ట్‌ను రూపొందించింది.

ముఖ్యంగా రూ.1 కోటి, అంతకంటే ఎక్కువ ధర కలిగిన గృహాల విక్రయాలు ఏకంగా 92 శాతం పెరగడం విశేషం. 2023 జనవరి నుంచి ఏప్రిల్ కాలంలో 2,060 యూనిట్ల అమ్మకాలు జరగ్గా.. 2024 అదే సమయంలో 3,959 నివాస విక్రయాలు నమోదయ్యాయి.

రూ.50 లక్షలు ఎగువన, రూ.1 కోటి దిగువన నివాసాల రిజిస్ట్రేషన్లలో 47 శాతం పెరుగుదల నమోదయ్యింది. స్థూలంగా అధిక విలువ కలిగిన ఇళ్లకు ఎక్కువ డిమాండ్ నెలకొంది. ప్రస్తుత ఏడాది ఏప్రిల్‌లో 46 శాతం వృద్ధితో 6,578 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. వీటి విలువ రూ.4,260 కోట్లుగా ఉంది. " కరోనా అనంతరం నివాస ధరలు క్రమంగా పెరిగాయి. గృహ కొనుగోలుదారులు అధిక విలువైన ఆస్తులకు స్పష్టమైన ప్రాధాన్యతను చూపుతున్నారు". అని నైట్ ఫ్రాంక్ ఇండియా సిఎండి శిశిర్ బైజాల్ పేర్కొన్నారు.

పిట్టీ ఇంజనీరింగ్‌కు రూ.40 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో 62 శాతం వృద్ధితో రూ.40.36 కోట్ల నికర లాభాలు సాధించినట్లు పిట్టీ ఇంజనీరింగ్ తెలిపింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ4లో రూ.24.84 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.247.50 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ4లో 32.48 శాతం పెరిగి రూ.327.88 కోట్లకు చేరింది. 2023-24లో మొత్తంగా కంపెనీ లాభాలు 53.32 శాతం వృద్ధితో రూ.90.20 కోట్లుగా.. రెవెన్యూ 9.22 శాతం పెరిగి రూ.1,201.60 కోట్లుగా నమోదయ్యింది.

సుందరయ్యగారి 39వ వర్ధంతి సందర్భంగా అధ్యయనం కోసం పుస్తకాలు

30 శాతం ప్రత్యేక తగ్గింపుతో

సుందరయ్యగారి రచనలు

1. వీరతెలంగాణా విప్లవ పోరాటం గుణపాఠాలు	400/-
2. సుందరయ్య రచనల సంకలనం	50/-
3. సుందరయ్య ఆత్మ కథ	270/-
4. విశాలాంధ్రలో ప్రజారాజ్యం	150/-
5. భారతదేశంలో విప్లవ సాధనపట్ల మార్క్సిస్టు పార్టి అవగాహన	10/-
6. భూ సమస్యలపై అవగాహన, గంగా, కావేరికాలువ, తదితర సమస్యలు	10/-
7. Telangana People's Struggle and Its Lessons (Original Pirce - 695/-)	300/-

ఇతర రచనలు

1. సుందరయ్య స్మారకోపన్యాసాలు - ఎస్‌వికె, హైదరాబాద్ ప్రచురణ	120/-
2. వామపక్ష సాంస్కృతిక వారసత్వం - వకుళాభరణం రామకృష్ణ	20/-
3. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రచురణ	10/-
4. స్ఫూర్తి శిఖరం (దీర్ఘ కవిత) - కె.ఆనందాచారి	20/-

ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్
ఫోన్ : 9490099061, 9490099057

బ్రాంచీలు
విశాఖపట్నం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు

ఐసిఐసిఐ బ్యాంక్ మాజీ సిఎండి నారాయణన్ కన్నుమూత



చెన్నయ్ : ఐసిఐసిఐ బ్యాంక్ మాజీ ఛైర్మన్ నారాయణన్ వఘుల్ శనివారం మరణించారు. నారాయణన్ చెన్నయ్‌లో కన్ను మూశారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం ఇంట్లో పడిపోవడంతో అపస్మారక స్థితిలోకి జారిపోయిన ఆయన్ను అపోలో ఆస్పత్రిలో చేర్చారు. అప్పటి నుంచి వెంటిలేటర్ మద్దతుతో చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. 88 ఏళ్ల వయసు కలిగిన వఘుల్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఐసిఐసిఐ బ్యాంక్ ప్రయివేటీకరణలో నారాయణన్ కీలక పాత్ర పోశించారు. ఆ బ్యాంక్‌కు 24 ఏళ్ల పాటు ఛైర్మన్‌గా, సిఇఒగా పని చేశారు. నారాయణన్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో తొలుత కెరీర్‌ను ప్రారంభించారు. ఆ తరువాత 44 ఏళ్ల వయసులో 1981లో బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛైర్మన్‌గా నియమితులై ప్రభుత్వ రంగ బ్యాంక్‌కు అతి పిన్న వయస్కుడైన ఛైర్మన్‌గా గుర్తింపు పొందారు. 1984 వరకు ఆయన అదే హోదాలో ఉన్నారు. 1985లో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ ఐసిఐసిఐ లిమిటెడ్ సిఎండిగా నియమించారు. 1995లో ఆ బ్యాంక్ ప్రయివేటీకరణలో ప్రధాన పాత్ర పోశించడంతో పాటుగా 2009 పదవి విరమణ వరకు అందులోనే కొనసాగారు. వాణిజ్యం, పరిశ్రమలకు చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 2009లో పద్మభూషణ్‌తో సత్కరించింది.

కూలిన ప్రయివేటు వెంచర్ ఆర్చ్

- ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు దుర్మరణం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లా కూడేరు మండలం గొటుకూరు గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న ఓ ప్రయివేటు వెంచర్ ఆర్చ్ కూలిపోవడంతో శిథిలాల కింద చిక్కుకుని ఇద్దరు కార్మికులు మరణించారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కూడేరు మండలం గొటుకూరు జాతీయ రహదారికి ఆనుకుని భవ్యశ్రీ వెంచర్ పేరుతో నిర్మాణం జరుగుతోంది. వెంచర్ ఆర్చ్ కాంక్రీట్ పనులకు శనివారం మధ్యప్రదేశ్ రాష్ట్రం సుల్కారిక్ గ్రామానికి చెందిన పురాన్ సింగ్ (21), ఆశాక్ (22), తీహార్, అనంతపురం రూరల్ మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన నాగరాజు, ఆంజనేయులు వెళ్లారు. పనులు చేస్తుండగా ఒక్కసారిగా ఆర్చ్ పిల్లర్లు విరిగిపోయాయి. ఆర్చ్ కింద పనిచేస్తున్న పురాన్ సింగ్, ఆశాక్, తీహార్‌లపై ఆర్చ్ కుప్పకూలి పడిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జెసిబి సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాలను తొలగించగా అప్పటికే సిమెంట్ కంకరలో కూరుకుపోయి ఊపిరాడక పురాన్ సింగ్, ఆశాక్ మరణించారు. తీహార్‌కు కాలు విరగగా, నాగరాజు, ఆంజనేయులుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సంపాదకీయం

వృక్షో రక్షతి రక్షిత:

మానవ మనుగడకు, సర్వజీవుల సుఖజీవనానికి వృక్ష సంపదను రక్షించాలని శాస్త్రవేత్తలు ఘోషిస్తున్నారు. వృక్షాలను దేవతలుగా పూజించి, ఆదరించే దేశంలో వృక్ష సంపద రోజురోజుకూ తరిగిపోతోంది. 'క్షీరసాగర మథనం'లో 'కల్పవృక్షం' ఆవిర్భావం, 'రామాయణం'లో అడుగడుగునా చెట్ల వర్ణనలు, ప్రత్యేకతలను పురాణాల్లోనూ చెప్తారు. పర్ణశాల నిర్మాణవేళ లక్ష్మణునితో 'వృక్ష సంపద ఆవశ్యకతను' శ్రీరాముడు వివరించినట్లుగా రాస్తారు. 'కుమార సంభవం'లో చెట్ల రక్షణ కోసం పార్వతీదేవి పెద్దపులినే కాపలాగా కట్టి వేసిందని రాస్తాడు కాళిదాసు. 'భాగవతం'లోనూ వనాల వర్ణన మనసులను పరవశింపజేస్తుంది. నీడ, పూలు, ఫలరసాలు మాత్రమేకాక ప్రాణవాయువునూ నిరంతరం విడుదల చేస్తున్న చెట్లు జీవకోటికి గొప్ప మేలు చేస్తున్నాయి. వేలాది సంవత్సరాలు జీవిస్తూ, ఎంతోదూరం, నిరంతరం ఆక్సిజన్‌ను అందించే శక్తి ఈ మహావృక్షాలకు ఉంది. 'అవ్వకైనగాని గువ్వకైనను కాని/ తల్లి ఒడిగ చెట్టు తావునొసగు/ చెట్టు గుణములేదె? చెట్టంత మనిషికి' అంటాడో కవి. ప్రకృతి ఒడిలో పచ్చల హారం అని కొనియాడబడే ఈ మహా వృక్షాలు... మనిషి ఆశకు తమ ప్రాణాలను బలిపెడుతూ ఎండిన మోళ్ళవుతున్నాయి.

పూలకొమ్మలతో, లేరెమ్మలతో, కొమ్మల్లోని గిజిగాడి గూళ్ళతో, నిలువ నీడలేని నిర్భాగ్యుల చిన్నారుల ఊయలలూపుతూ- మనిషి పోయినా, తరం మారినా నిరంతరంగా నిలబడేవి చెట్లు. 'పచ్చ చెట్టును గూల్చ మనసెట్టులొప్పెనో/ కరకు గుండెల కర్కశ మూకలు/ దుడుకు గుండెల ముష్కర మూకలు/ చెలగి చెండాడి తునిమి ముక్కలు చేసి/ పదును రంపాల పరపరా కోసి/ కూల్చినారే నిన్ను కర్తవ్యమూఢులై' అంటూ చెట్టు వేదనను వర్ణిస్తారో కవయిత్రి. ఇప్పుడు గూడు లేదు... ఆ చెట్టూ లేదు. చెట్టు మనిషి అత్యాశకు బలైందని తెలియని వెర్రి పిచ్చుక రోజూ వచ్చి వెతుక్కుని నిరాశతో వెనక్కి తిరిగిపోతున్న దృశ్యం నిత్యం కనిపిస్తూనేవుంది. మనిషి ప్రకృతి వనరులను అడ్డూఅదుపూ లేకుండా కొల్లగొడుతున్నాడు. మనిషి దురాశ పర్యావరణ కాలుష్యానికి కారణమౌతోంది. ఈ కాలుష్యం వల్ల భూమి వేడెక్కుతోంది. భూసారం క్షయమవడం, అడవులు క్షీణించడం, వందలాదిగా జంతు, వృక్ష జాతులు నశించిపోవడంతో పర్యావరణం హానికరంగా మారుతోంది. కార్పొరేట్ల లాభార్జన కోసం అభివృద్ధి పేరుతో సాగిస్తున్న జీవనయానం మనిషిని పతనపుటంచులలో నిలబెట్టింది. 'మానవుడు ముందుచూపు కోల్పోయాడు. భూమిని నాశనం చేస్తున్నాడు' అంటాడు ఆల్బర్ట్ స్విట్జర్. తాజాగా 2018 నుంచి 2022 వరకు- ఈ మూడేళ్లలో దాదాపు 60లక్షల చెట్లు వ్యవసాయ భూముల నుంచి అదృశ్యమయ్యాయని శాటిలైట్ మ్యాపింగ్ అధ్యయనం తెలిపింది. దేశంలో సుమారుగా 56శాతం వ్యవసాయ భూములు, 22శాతం అడవులు వున్నాయి. 2010 నుంచి 2022 వరకు చెట్ల సంఖ్యలోని మార్పులను అంచనా వేయడానికి పరిశోధకులు రాపిడ్‌ఐ, ప్లానెట్ స్కోప్ రెండు రిపోజిటరీల నుండి ఉపగ్రహ చిత్రాలను కలిపి చూశారు. అనేక హాట్‌స్పాట్ ప్రాంతాల్లోని వ్యవసాయ భూమి చెట్లలో 50శాతం వరకు కోల్పోయినట్లు గుర్తించారు. చదరపు కిలోమీటరుకి 22 చెట్లు అదృశ్యమయ్యాయి. 'బ్రతికినన్ని నాళ్లు ఫలములిచ్చుటెగాదు/ చచ్చి కూడ చీల్చి ఇచ్చు తనువు/ త్యాగభావమునకు తరువులే గురువులు' అంటారు జంధ్యాల పాపయ్యశాస్త్రి.

చెట్టు, పుట్ట, నది, మబ్బు, వర్షం, ఆకాశం ఇలా... ప్రపంచమంతా ప్రకృతి పలవరింతే. మానవాళికి ఎంతో మేలు చేస్తున్న ప్రకృతిపై పగబట్టినట్లు చెరబడుతున్నాడు మనిషి. చెట్లను ధ్వంసం చేస్తున్నాడు. నదులను కలుషితం చేస్తున్నాడు. 'నేడు ప్రపంచ సమస్య టెర్రరిజం కాదు... కాలుష్యం' అంటారు దాశరథి రంగాచార్య. వందేళ్ల క్రితం భారత భూభాగంలో 40శాతంగా వున్న అడవులు- క్రమేణా అంతరించి పోతున్నాయన్నది వాస్తవం. అభివృద్ధి పేరుతో అడవులు కనుమరుగవు తున్నాయన్నది చేదు నిజం. ప్రాణాధారమైన చెట్లను సంరక్షిస్తూ, నరికివేతకు గురవుతున్న వృక్షాలను కాపాడుకోవాలి. కలుషితమైపోతున్న ప్రాణవాయువును స్వచ్ఛమైనదిగా మార్చుకోవాలంటే ఇంటింటా చెట్లను నాటాలి. అడవులను సంరక్షించాలి. వృక్షం గమయ అంటూ నినదించాలి.

సందర్భం

విప్లవకారులు సాదాసీదాగా,
నమ్రతగా, నిగర్వంగా వుంటారు.
సానుకూల పరిస్థితులు,
విజయాలు పలుకరించినా...
అగ్ని పరీక్షలు ఎదురైనా...
ధైర్యంగా వుంటారు.
- హోచిమిన్

Hochi Minh

జననం : 19.5.1890 మరణం : 2.9.1969

సుందరయ్య స్ఫూర్తితో నూతన రాజకీయ సంస్కృతి

వ్యాసం



వి. శ్రీనివాసరావు

దేశానికి, రాష్ట్రానికి నేడు సుందరయ్య స్ఫూర్తిదాయక విధానాల ఆవశ్యకత పెరిగింది. 1951 నాటికి తెలుగు ప్రజలు నాలుగైదు ముక్కలై ఉన్నారు. ఒక పెద్ద భాగం మద్రాసు ప్రావెన్సులో, మరో భాగం నైజాం తెలంగాణలో మరి కొన్ని చిన్న భాగాలుగా మహారాష్ట్ర, మైసూరు సంస్థానం, ఒరిస్సాలలో ఉన్నారు. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన పిలుపు భాషా ప్రాతిపదికపై రాష్ట్రాలు ఏర్పడాలన్న నినాదం దేశమంతటా వేగంగా వ్యాపించింది. అది భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు దారితీసింది. రాష్ట్రాలు బలంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుందన్న ఫెడరల్ స్ఫూర్తికనుగుణంగా ఈ ఉద్యమాలు నడిచాయి. అప్పటికే రాష్ట్రంలో జమిందారీ వ్యతిరేక పోరాటాలు, వీర తెలంగాణ సాయుధ పోరాటం కమ్యూనిస్టు పార్టీకి బలమైన పునాది వేశాయి. ఈ పోరాటాలన్నింటినీ సుందరయ్య అగ్రభాగాన ఉండి నడిపించారు. ఈ నేపథ్యంలో పుచ్చలపల్లి సుందరయ్య రాసిన "విశాలాంధ్రలో ప్రజారాజ్యం" గ్రంథం తెలుగు ప్రజల హృదయ స్పందనగా మారింది. 1951 ప్రథమ పార్లమెంటులో కమ్యూనిస్టు పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల నుండి ఎక్కువ మంది ఎంపీలుగా ఎన్నికయ్యారు. సుందరయ్య ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నికయ్యారు. 1955 ఎన్నికల్లో నాటి ఆంధ్ర (విభజనానంతరం నేటి ఆంధ్రప్రదేశ్) భాగంలో కమ్యూనిస్టు పార్టీ అధికారాన్ని అందుకోబోతున్నంత ఉధృతంగా క్యాంపెయిన్ సాగింది. నాటి కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకించి భూస్వామ్య శక్తులు కమ్యూనిస్టులపై అనేక అభాండాలు, తప్పుడు ప్రచారాలు చేశారు. పెత్తందారీతనాన్ని, డబ్బుని ఉపయోగించి కమ్యూనిస్టుల్ని అధికారంలోకి రాకుండా నిరోధించగలిగారు. క్రమంగా ఆర్థిక, రాజకీయ రంగాలలో వచ్చిన అనేక మార్పులు కమ్యూనిస్టు పార్టీని బలహీనపరుస్తూ వచ్చాయి. నూతన పరిస్థితులకు అనుగుణంగా పార్టీ వ్యూహం, ఎత్తుగడలను నిర్ణయించుకోవడంలో పార్టీలో వచ్చిన అంతర్గత విభేదాలు చీలికలకు దారితీశాయి. ఎడాపెడా చీలికల అనంతరం 1969 నాటికి సిపిఐ(యం) బలహీనమైన స్థానంలోకి వెళ్ళిపోయింది. బడా పెట్టుబడిదారుల నాయకత్వంలోని బూర్జువా, భూస్వామ్య శక్తులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రజలపై పట్టు సాధించాయి. 1973-75 మధ్య బెంగాల్‌లో అర్ధ ఫాసిస్టు నిర్బంధకాండలో వేయి మందికిపైగా నేలకొరిగారు. 1975-77 ఎమర్జెన్సీ, తదనంతర పరిణామాలు సిపిఐ(యం) తీసుకున్న రాజకీయ విధానానికి విజయంగా భావించవచ్చు. అప్పటి వరకు కొన్ని రాష్ట్రాలకే పరిమితమైన సిపిఐ(యం) దేశవ్యాపిత పార్టీగా విస్తరించింది. సిపిఐ(యం) నాయ కత్వంలో కేరళ, బెంగాల్, త్రిపురలలో ఎన్నికల్లో సాధించిన విజయాలు జాతీయ స్థాయిలో వామపక్ష పార్టీల మధ్య ఐక్యతకు పునాది వేశాయి. ఈ విజయాల అనంతరం సిపిఐ కూడా వామపక్ష ప్రభుత్వాల్లో భాగస్వామ్యమైంది. ఈ కాలమంతటా సుందరయ్య సిపిఐ(యం) పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.

సుందరయ్య 1978 తరువాత రాష్ట్రానికి తిరిగి వచ్చి 1981లో రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలను చేపట్టారు. రాష్ట్రంలో పార్టీ విస్తరణకు ప్రణాళికాబద్ధమైన కృషిని సాగించారు. 1978 నాటికి మన రాష్ట్రంలో చాలా జిల్లాల్లో పార్టీ లేదు. ఉన్న జిల్లాల్లో కూడా కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది. ఈ స్థితిలో విద్యార్థి, కార్మిక రంగాలపై కేంద్రీకరించి పురోగతి సాధించింది. 1979-81 మధ్య రాష్ట్ర వ్యాపితంగా పెద్ద ఎత్తున భూపోరాటాలు సాగాయి. గిట్టుబాటు ధరల కోసం రైతు ఉద్యమాలు నడిచాయి. వేతనాల పెంపుదల కోసం వ్యవసాయ కార్మిక సమ్మెలు నడిచాయి. కార్మికోద్యమాలను సంఘటితపర్చడానికి కీలక పరిశ్రమల్లో ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని బలపర్చడానికి సుందరయ్య చేసిన కృషి అపారమైనది. ఈ పోరాటాల ఫలితంగా 1983 నాటికి రాష్ట్రంలో ఒక బలమైన శక్తిగా కమ్యూనిస్టు పార్టీ ముందుకు రావడానికి అవసరమైన రాజకీయ నేపథ్యం ఏర్పడింది. ఈ సమయంలోనే ఎన్.టి.రామారావు రాజకీయ రంగ ప్రవేశం చేసి తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉండే భూస్వామ్య శక్తులు, కొందరు ధనిక రైతులు తెలుగుదేశంలో చేరారు. ఫలితంగా కమ్యూనిస్టు పార్టీని వెనక్కి నెట్టి తెలుగుదేశం ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా అవతరించింది. నాడు సిపిఐ, సిపిఐ(యం) అభ్యర్థులు స్వతంత్రంగా పోటీ చేసి 9 స్థానాల్లో విజయం సాధించారు. 1984లో కాంగ్రెస్ ప్రోద్బలంతో నాదెండ్ల భాస్కరరావు వెన్నుపోటుతో ఎన్‌టిఆర్ ప్రభుత్వాన్ని కూల్చారు. ప్రజలు దీన్ని సహించలేకపోయారు. దీనిని తమమీద దాడిగా భావించారు. వెనువెంటనే రాష్ట్ర వ్యాపితంగా పెద్ద ఎత్తున ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం రగిలింది. దీన్ని ముందుండి నడిపించినవారు సుందరయ్య. నాడు సుందరయ్య ఇచ్చిన పిలుపు ఎన్‌టిఆర్ సహా వామపక్ష, ప్రజాతంత్ర శక్తులకు, తెలుగుదేశం అభిమానులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఫలితంగా ఇందిరా గాంధీ తలవంచి ఎన్‌టిఆర్ ప్రభుత్వాన్ని పునరుద్ధరించాల్సి వచ్చింది. రాష్ట్ర చరిత్రలోనే కాదు దేశ ప్రజాస్వామిక చరిత్రలో ఇదొక అపూర్వ ఘట్టం.

కార్పొరేట్ రాజకీయ సంస్కృతి

నూతన ఆర్థిక విధానాల పేరుతో 1991లో ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ షరతులను దేశంపై రుద్ది అమలు చేయడం మొదలు పెట్టాక కొత్త పరిణామాలు ప్రారంభమయ్యాయి. రాజకీయ రంగం మీద వాటి ప్రభావం తీవ్రంగా పడింది. స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ తదితర బూర్జువా పార్టీలలో వ్యాపారాల్లో, వ్యవసాయంలో సంపాదించుకున్న బడా వ్యాపారవేత్తలు, భూస్వాములు రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించారు. బడా పెట్టుబడిదారులెవరూ ప్రత్యక్ష రాజకీయాల్లో లేరు. స్వాతంత్ర్యోద్యమ ప్రభావం కొంత కాలం పాటు కొనసాగింది. బయట సంపాదించుకున్న డబ్బుని ఎన్నికల్లో ఖర్చు పెట్టి, గెలిచి తమ అధికారాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడేందుకు సాధనంగా వాడుకునేవారు. స్థానికంగా ప్రజల మీద తమ పట్టు నిలబెట్టుకునేందుకు అధికారాన్ని ఉపయోగించారు. కానీ 21వ శతాబ్దం ప్రారంభం నుండి రాజకీయ రంగం రూపురేఖలు మారాయి. డబ్బున్నవాళ్ళు

నేడు పి.ఎస్ వర్ధంతి

రాజకీయాల్లోకి రావడంగాకుండా డబ్బు సంపాదించడానికే రాజకీయాల్లోకి రావడం మొదలైంది. బడా కార్పొరేట్లు ప్రత్యక్షంగా దిగారు. రాజకీయం వ్యాపార రంగంగా మారింది. ఓటును ఒక సరుకుగా మార్చేశారు. మీడియాను నియంత్రణలోకి తెచ్చుకున్నారు. సోషల్ మీడియాను దానికి సాధనంగా వాడుకుంటున్నారు. స్వేచ్ఛగా ఓటేసే హక్కును ప్రజలు కోల్పోతున్న పరిస్థితి. ఓటర్లకు పెద్ద ఎత్తున డబ్బు పంపిణీ చేసే విధానం మొదట దక్షిణాది రాష్ట్రాల్లో మొదలై క్రమంగా దేశమంతటా విస్తరించింది. కేరళ, బెంగాల్, త్రిపుర లాంటి వామపక్షాలు బలంగా ఉన్న రాష్ట్రాల్లో డబ్బు పంపిణీ దాదాపు లేదనే చెప్పవచ్చు. కానీ ఇటీవల కాలంలో ఆ రాష్ట్రాలకూ ఈ జబ్బు విస్తరించింది. డబ్బు అనేక రూపాల్లో రాజకీయాలను ప్రభావితం చేస్తున్నది. ఓటు వేస్తారా లేదా అనే దాంతో నిమిత్తం లేకుండా ప్రతి ఇంటికి ఓటుకు ఇంత అని స్లిప్పుతో పాటు కవర్‌లో పెట్టి పంపిణీ చేస్తున్నారు. తమకు డబ్బు అందకుంటే ఆందోళన చేసే స్థాయికి ప్రజలు కూడా వెళ్ళారు. ఎన్నికల సమయంలో డబ్బు పంపిణీ చేయడమే గాకుండా దానికి ముందు సేవా, సహాయ కార్యక్రమాల పేరుతో ధనవంతులు ప్రజలపై పెట్టుబడులు పెడుతున్నారు. ఒక నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థి అప్పటి వరకు పరిచయం లేకున్నా డబ్బు సంచులతో దిగి అనుచరులను, వందిమాగధులను సంపాదించుకుంటున్నారు. రాజకీయ రంగ ప్రవేశం చేయక ముందే వారి పేరు, కొత్తగా ఉత్పత్తి చేసిన ప్రతిష్ట ప్రజలకు చేరిపోతున్నది. 2014లో మోడీ పర్సనాలిటీ బిల్డింగ్ (వ్యక్తిత్వ నిర్మాణం) దానికి పెద్ద ఉదాహరణ. ఆ ప్రాంతంతో సంబంధం లేనివాళ్ళూ దిగుమతి అవుతున్నారు. ఒక పార్టీ టికెట్టు కోసం దరఖాస్తు చేసుకొన్నా టికెట్టు రాకుంటే మరొక పార్టీకి వెంటనే జంప్ అయి పోతున్నారు. కమ్యూనిస్టు పార్టీలు మినహా ఏ పార్టీ పేరుమీదనైనా వారు పోటీ చేస్తున్నారు. కొత్తగా వచ్చిన ట్రెండ్ పార్టీలే ఆయా అభ్యర్థులను మార్చేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి తరపున పోటీ చేసిన వారిలో కొంత మంది సీటు ఏ పార్టీకి కేటాయిస్తే ఆ పార్టీ తరపునే అభ్యర్థి పోటీ చేయడం. అనపర్తి, ఉండి లాంటి నియోజకవర్గాలు దీనికి పెద్ద ఉదాహరణ. రాజకీయాల్లో ప్రవహిస్తున్న ఈ డబ్బు జనాన్ని దోచుకున్నదే. అవినీతి నేడు సహజ వనరులపై ఆధిపత్యం, ప్రభుత్వ సహకారంతో బ్లాక్ మనీ పోగేసుకోవడం అన్నీ కలిపి కుబేరుల చేతుల్లోకి సంపద పోయింది. అదే ఎన్నికల బాండ్ల పేరుతో చట్టబద్ధమైంది. అవినీతి సొమ్ముతో రాజకీయాలు నడుస్తున్నాయి. జనాన్ని కూడా అవినీతి కూపంలోకి దించి తమకు అడ్డు లేకుండా చేసుకుంటున్నారు.

ప్రజల్ని చీలుస్తున్న సోషల్ ఇంజనీరింగ్

ఈ ఎన్నికల్లో వ్యక్తమైన మరో ధోరణి సోషల్ ఇంజనీరింగ్. ఇది కొత్తది కాకపోయినా బిజెపి ఈ ఎన్నికల్లో దాన్ని పతాక స్థాయికి చేర్చింది. కులాలు, ఉప కులాలు, తెగలు, ఉప తెగల మధ్య పోటీ పెరిగింది. అస్థిత్వ రాజకీయాల ప్రత్యక్ష ఫలితమిది. కులాలవారీ అడ్డంగా, నిలువునా చీలికలు, పోటీలు చివరకు శ్రామిక ప్రజల మధ్య అనైక్యతకు, ఘర్షణలకు దారితీస్తున్నది. ప్రజల మధ్య చీలికలను పెట్టుబడిదారీ వ్యవస్థను శాశ్వతం చేసుకోవడానికి సాధనంగా వాడుకుంటున్నారు. ఆ యా కులాల, తెగల నాయకులకు కొన్ని పదవులు మరికొంత డబ్బు ఇచ్చి దగ్గర (ఇంక్లూజివ్) చేసుకుంటున్నారు. తమకు నమ్మకమైన అనుచరులుగానూ, ఏజెంట్లుగానూ మార్చుకుంటున్నారు. ప్రజలకు, పెట్టుబడిదార్లకు మధ్య వీరే వారధులు. వైఎస్సార్ ప్రభుత్వం వచ్చాక దీనిని మరింత ఆధునీకరించి ప్రజలతో నిత్య సంబంధాల కోసం వలంటీర్ వ్యవస్థను ఏర్పర్చింది. ఒకరకంగా ఇది ప్రజలపై నిఘా (సర్వైలెన్స్) లాంటిదే. మోడీ ప్రభుత్వం వచ్చాక ప్రజలపై నిఘా పెరిగింది. దానికి సెల్‌ఫోన్, ఇంటర్నెట్ వంటి ఆధునిక సాధనాలు తోడ్పడుతున్నాయి. ప్రజాస్వామ్య హక్కులు కుంచించుకు పోతున్నాయి. ఈ పరిణామాలన్నీ ఏక వ్యక్తి నియంతృత్వానికి దారి తీసే ప్రమాదాన్ని తెచ్చి పెట్టాయి.

> నాడు సుందరయ్య 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' పిలుపు నేటికీ అనుసరణీయం. ఆ పుస్తకంలోని 5వ అధ్యాయం నూతన రాష్ట్రంలో నూతన ప్రజాస్వామిక వ్యవస్థ గురించి వర్ణించారు. ఇందులో ప్రజలే ప్రభువులు. ప్రజల చేతికి అధికారం రావాలంటే పంచాయతీ వ్యవస్థ బలపడాలని, 18 సంవత్సరాలు దాటిన వయోజనులంతా గ్రామ సభల్లో భాగస్వామిగా ఉండాలని ఆయన కోరుకున్నారు. ఈ నూతన ప్రజాస్వామిక వ్యవస్థ స్వరూప స్వభావాలను ఆయన వర్ణించారు. ఎన్నికల వ్యవస్థ ఎలా ఉండాలి, న్యాయ వ్యవస్థ ఎలా పని చేయాలి, మెరుగైన ఆధునిక విద్యా, వైద్య సదుపాయాలెలా ఉండాలో నిర్దిష్టంగా పేర్కొన్నారు. అందమైన, ఆరోగ్యవంతమైన గ్రామ సీమల నిర్మాణానికి ఆయన స్పష్టమైన ప్రణాళికను ప్రకటించారు. రైతులు, వ్యవసాయ, పారిశ్రామిక కార్మికులు, వృత్తిదారులు, మహిళలకు ఉండే ప్రజాస్వామిక హక్కులను నిర్దిష్టంగా పేర్కొన్నారు. ఆనాటికీ, నేటికీ పరిస్థితుల్లో చాలా మార్పులున్నప్పటికీ సుందరయ్య కన్న కల ఆధునిక ఆంధ్రప్రదేశ్ నిర్మాణం ఒక కర్తవ్యంగా మన ముందున్నది.

నూతన రాజకీయ సంస్కృతికి బాట కమ్యూనిస్టు పార్టీ

కమ్యూనిస్టు పార్టీ ప్రజాస్వామిక విలువలకు, సాంప్రదాయాలకు వారసురాలు. నాడు సుందరయ్య 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' పిలుపు నేటికీ అనుసరణీయం. ఆ పుస్తకంలోని 5వ అధ్యాయం నూతన రాష్ట్రంలో నూతన ప్రజాస్వామిక వ్యవస్థ గురించి వర్ణించారు. ఇందులో ప్రజలే ప్రభువులు. ప్రజల చేతికి అధికారం రావాలంటే పంచాయతీ వ్యవస్థ బలపడాలని, 18 సంవత్సరాలు దాటిన వయోజను లంతా గ్రామ సభల్లో భాగస్వామిగా ఉండాలని ఆయన కోరుకున్నారు. ఈ నూతన ప్రజాస్వామిక వ్యవస్థ స్వరూప స్వభావాలను ఆయన వర్ణించారు. ఎన్నికల వ్యవస్థ ఎలా ఉండాలి, న్యాయ వ్యవస్థ ఎలా పని చేయాలి, మెరుగైన ఆధునిక విద్యా, వైద్య సదుపాయాలెలా ఉండాలో నిర్దిష్టంగా పేర్కొన్నారు. అందమైన, ఆరోగ్యవంతమైన గ్రామ సీమల నిర్మాణానికి ఆయన స్పష్టమైన ప్రణాళికను ప్రకటించారు. రైతులు, వ్యవసాయ, పారిశ్రామిక కార్మికులు, వృత్తిదారులు, మహిళలకు ఉండే ప్రజాస్వామిక హక్కులను నిర్దిష్టంగా పేర్కొన్నారు. ఆనాటికీ, నేటికీ పరిస్థితుల్లో చాలా మార్పులు న్నప్పటికీ సుందరయ్య కన్న కల ఆధునిక ఆంధ్రప్రదేశ్ నిర్మాణం ఒక కర్తవ్యంగా మన ముందున్నది.

సుందరయ్య కల నిజమవ్వాలంటే బలమైన ప్రజాస్వామిక ఉద్యమాన్ని నిర్మించాలి. డబ్బు పాత్ర లేని ఎన్నికల వ్యవస్థ రావాలి. ప్రతి పార్టీకి ఎన్నికలకయ్యే ఖర్చును ప్రభుత్వాలే భరించాలి. దామాషా ప్రాతిపదికపై ప్రజా ప్రతినిధులు ఎన్నికవ్వాలి. ప్రజా ప్రతినిధులు దారి తప్పితే వారిని వెనక్కి పిలిపించే (రీకాల్) హక్కు ప్రజలకుండాలి. ప్రజలకు చేసిన వాగ్దానాలను అమలు జరపని పార్టీలపై చర్యలుండాలి. ప్రజలకు మత స్వేచ్ఛ ఉండాలి. మతాన్ని రాజకీయాలకు దుర్వినియోగం చేయడాన్ని నిషేధించాలి. రాజకీయాల్లో కార్పొరేట్ల ఆధిపత్యాన్ని సవాలు చేసే శ్రామిక వర్గం చొరవతో ముందుకొస్తేనే నూతన రాజకీయ సంస్కృతికి పునాది పడుతుంది. రాష్ట్రంలో యువతరం, ప్రగతిశీల, ప్రజాస్వామికవాదులు మతోన్మాద రాజకీయాన్ని, కార్పొరేట్ ఆధిపత్యాన్ని ఎదుర్కోవడానికి నూతన సంస్కృతిని ఒక ప్రత్యామ్నాయంగా ముందుకు తీసుకురావాలి. అదే మనం సుందరయ్యకు అర్పించే నివాళి.

/ వ్యాసకర్త సిపిఎం ఎ.పి రాష్ట్ర కార్యదర్శి /

సంభాల్ ఘటనలు : ముస్లింలపై మాటలూ దాడులూ

వ్యాఖ్య

ఈ రోజుల్లో నరేంద్ర మోడీ కనీసం సత్యానికి కాస్త అటూ ఇటూగానైనా మాట్లాడలేకపోతున్నారు. తాజాగా వారణాసిలో నామినేషన్ దాఖలు చేసిన తర్వత ఈ కోవలోనే ఆయన కొన్ని అసత్య వాక్కులు నుడివారు. 'ఎక్కువ మంది పిల్లలు కనేవారు' అన్న మాట తాను ముస్లింలను ఉద్దేశించి అనలేదని చెప్పుకొచ్చారు. 'ఏ రోజునైతే నేను హిందూ ముస్లింలను వేరుగా చూస్తానో ప్రజా జీవితంలో వుండే అర్హత కోల్పోతాను' అంటూ దిగ్భ్రాంతికరమైన వ్యాఖ్య కూడా చేశారు. ఎందుకంటే ఏప్రిల్ 9న బాన్స్‌వారాలో ఆయన చేసిన ప్రసంగాన్ని ఆలకించిన వారెవరైనా అది ముస్లింలను లక్ష్యంగా చేసినట్టు చాలా తేలిగ్గానే అర్థం చేసుకోగలుగుతారు. 'చొరబాటుదారులు', 'ఎక్కువ మందిని కనేవారు' అన్నది ముస్లింల గురించనే భావిస్తారు. పైగా ఆ సందర్భం కూడా స్పష్టంగా వుంది. దేశ వనరులపై ముస్లింలకు వాటా వుందని మన్మోహన్ సింగ్ చేసిన ప్రకటనను ఆయన ఉటంకించారు కూడా. నిజానికి ముస్లింలు అధిక సంతానం కంటారనేది 2002 గుజరాత్ ఎన్నికల నాటి నుంచి మోడీ నిరంతర ఉవాచగా వుంటోంది. 'మేము అయిదుగురం...మాకు అయిదుగురు...' అంటూ ఆయన వారిని వెక్కిరించారు. ఆ మత మారణకాండ బాధితులైన ముస్లిం శరణార్థుల కోసం ఏర్పాటు చేసిన సహాయ శిబిరాలు 'సంతానోత్పత్తి కేంద్రాలుగా' తయారయ్యాయని అత్యంత బాధ్యతా రహితంగా మాట్లాడారాయన. ఈ హిందూ ముస్లిం పాటే ముదిరి తర్వాత ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో కబరిస్థాన్, శ్మశాన్ ఘాట్ వంటి వాటి గురించి మాట్లాడేందుకు దారి తీసింది. ప్రధాని, ఆయన హంగుదార్లు ఈ విధంగా ముస్లింలను రాక్షసులుగా చిత్రిస్తూ వారిపై దాడి చేయడం క్షేత్ర స్థాయిలో ప్రభావం చూపింది. వారి ఓటు హక్కు తొలగించే చర్యలకు దారితీసింది.



PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

శంభాల్‌లో జరిగిందేమిటి?

మే 7వ తేదీన మూడవ దశ పోలింగ్‌లో పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లోని శంభాల్ పార్లమెంటరీ నియోజకర్గంలో జరిగింది అదే. ఈ నియోజక వర్గంలోని ముస్లిం జనాభా అధికంగా వున్న అనేక గ్రామాలలో వారి ఓటు హక్కు నిరాకరించబడింది. ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాల బయట నిరీక్షిస్తున్న ముస్లింలపై పోలీసులు దాడికి దిగారు. న్యూస్ వెబ్‌సైట్ 'స్క్రోల్'లో ఈ పరిణామాన్ని విశదంగా ప్రచురించారు. మన్సురాపూర్, ఓవరీ, షెబాజ్‌పూర్ కలన్, ముబారక్‌పూర్ తదితర గ్రామాలలో ఇదే పునరావృతమైంది. ఉదయం పది పదకొండు గంటల మధ్య ముప్పై నలభై మంది పోలీసుల గుర్రాల దండు రావడం, అక్కడ ఓటు వేయడానికి కాచుకుని వున్న ఓటర్ల ఆధార్ కార్డులు, ఓటింగ్ స్లిప్‌లు లాగేసుకోవడం ఇదే తంతు. మహిళలని కూడా చూడకుండా వారిలో అనేక మందిని లాఠీలతో బాది, ఫైబర్ బెత్తాలతో కొట్టి తరిమేశారు. ఓవ్రీ లోని ఒక జూనియర్ హైస్కూలులోని పోలింగ్ కేంద్రంలోనైతే ఓటర్లను ఎలా తరిమేశారో చిత్రించిన వీడియో కూడా వుంది. ఈ పోలింగ్ స్టేషన్లలో ఎక్కువగా అస్మొలి శాసనసభ నియోజకవర్గ పరిధిలో వున్నాయి. సంభాల్ పట్టణంలోని కొన్ని ముస్లిం ప్రాంతాలలోనైతే పోలింగ్ కేంద్రాలలోని ఓటర్లపై పోలీసులు దాడులు చేశారు. ఇక్కడ గమనించాల్సింది ఏమంటే ముస్లింలు లేని మరే గ్రామాలపైన గాని, పోలింగ్ కేంద్రాలపైన గాని ఈ విధమైన పోలీసు దాడులు జరగలేదు. ఈ విధంగా అనేక పోలింగ్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఆపరేషన్ జరపడం స్థానిక విషయంగానో లేక చెదురు మదురు ఘటనగానో జరిగే అవకాశం లేదు. జిల్లా స్థాయి పోలీసు అధికారులకు తెలిసీ లేదా ఆమోదంతో ఇవి జరిగి వుండాలి. కుందరికి అసెంబ్లీ ఎంఎల్ఎ కూడా అయిన సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి జియా ఉర్ రహ్మాన్ ముస్లిం ఓటర్లపై దాడికి జరిగిన కుట్రగా దీన్ని అభివర్ణించారు. సంభాల్ లోక్‌సభ స్థానం 2019 ఎన్నికలలో సమాజ్‌వాది పార్టీ గెలుచుకున్నది.

> నిజానికి ముస్లింలు అధిక సంతానం కంటారనేది 2002 గుజరాత్ ఎన్నికల నాటి నుంచి మోడీ నిరంతర ఉవాచగా వుంటోంది. 'మేము అయిదుగురం...మాకు అయిదుగురు...' అంటూ ఆయన వారిని వెక్కిరించారు. ఆ మత మారణకాండ బాధితులైన ముస్లిం శరణార్థుల కోసం ఏర్పాటు చేసిన సహాయ శిబిరాలు 'సంతానోత్పత్తి కేంద్రాలుగా' తయారయ్యాయని అత్యంత బాధ్యతా రహితంగా మాట్లాడారాయన. ఈ హిందూ ముస్లిం పాటే ముదిరి తర్వాత ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో కబరిస్థాన్, శ్మశాన్ ఘాట్ వంటి వాటి గురించి మాట్లాడేందుకు దారి తీసింది. ప్రధాని, ఆయన హంగుదార్లు ఈ విధంగా ముస్లింలను రాక్షసులుగా చిత్రిస్తూ వారిపై దాడి చేయడం క్షేత్ర స్థాయిలో ప్రభావం చూపింది. వారి ఓటు హక్కు తొలగించే చర్యలకు దారితీసింది.

ఇ.సి ఉపేక్షకు వెనుక..

ఈ ఘటనలపై పోలీసులకు, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యా తీసుకోలేదు. బాధితులలో ఒకరిని పోలీసులు ఒత్తిడి పెట్టి అసలు ఏ దాడి జరగలేదని వాంగ్మూలం తీసుకున్న సందర్భం కూడా వుంది. ఉత్తర ప్రదేశ్‌లో ముస్లింలు ఇప్పటికే రెండవ శ్రేణి పౌరులుగా మార్చబడ్డారని సంభాల్ సంఘటన నిరూపించింది. అంతకు ముందు పోలీసులు ఓటర్లను బెదిరించిన, నిరోధించిన ఘటనలపై ఇదే విధంగా మొదటి దశ పోలింగ్ తర్వాత కూడా సమాజ్‌వాది పార్టీ అభ్యర్థులు ఫిర్యాదు చేశారు. రామ్‌పూర్, మొరాదాబాద్, ముజఫర్ నగర్ నియోజక వర్గాలలో జరిగిన ఇలాంటి ఘటనలపై ఫిర్యాదు చేసినప్పుడు ఎన్నికల సంఘం సత్వరం రంగంలోకి దిగి వుండాల్సింది. దాడికి గురైన పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్ జరిపి దోషులైన పోలీసులపై చర్య తీసుకోవలసింది. కానీ అలాంటిదేమీ జరగలేదు. ముస్లింలపై ప్రధాన మంత్రి ఇలా మాట్లాడినా తప్పుగా భావించని ఎన్నికల సంఘం ముస్లిం ఓటర్ల హక్కులను కాపాడుతుందని ఆశించడం అసాధ్యం. నరేంద్ర మోడీ ఆలపిస్తున్న ముస్లిం వ్యతిరేక వికృత రాగాలనూ ఉత్తర ప్రదేశ్ పోలీసులు సంభాల్ నియోజకవర్గంలో ముస్లింల ఓటు హక్కును కాలరాచే దాడులనూ ప్రత్యక్షంగా కలిపే విధాన రేఖ ఒకటే.

(మే15 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

జనవ్యాక్యం

మహిళా ఓటర్ల ప్రభంజనం!

ఏ రంగంలోనైనా మహిళలు ఆర్థికంగా అభ్యున్నతి చెందితే ఆ రంగం ప్రగతి బావుటా ఎగురవేయడం ఖాయం. ఇటీవల జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ, ఎన్నికలలో మహిళా ఓటర్లు అత్యధికంగా నిలిచి ఈ మారు సెభాష్ అనిపించు కున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ మారు ఎన్నికలలో మహిళలు అత్యధికంగా ఓటు వేయడం కీలకమైన అంశం. మన రాష్ట్రంలో 1,69,08,684 మంది మహిళా ఓటర్లు వున్నారు. తమ తమ ఓటు హక్కు వినియోగించుకున్న పురుష ఓటర్లు కంటే మహిళలు 4,78,535 మంది అధికంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని రికార్డు సృష్టించారు. 81.86 శాతం ఓటు వేయడం ద్వారా వీరు రికార్డు అధిగమించారు. ఇక పోస్టల్ బ్యాలెట్‌లో 4.97 లక్షలు మంది తమ ఓటు హక్కుని సద్వినియోగం చేసుకున్నారు. ఈ ఓట్లలో కూడా మహిళా ఓట్ల ప్రభావం ఉంది. ఏదేమైనా అధికారంలోకి ఎవరు రావాలనేది నిర్ణయించేది మహిళా మణుల ఓట్లే అనడంలో సందేహం లేదు.

- ఎల్. ప్రఫుల్ల చంద్ర, ధర్మవరం.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ : editpageps@ gmail.com

ఆసక్తికరంగా ఆ రెండు స్థానాలు

- అమేథీ, రాయ్‌బరేలీ పైనే అందరి దృష్టి

న్యూఢిల్లీ : దేశ రాజకీయాల్లో ఉత్తర ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ, అమేథీ లోక్‌సభ స్థానాలు ప్రత్యేకమైనవి. ఎందుకంటే.. ఆ రెండు స్థానాలు కాంగ్రెస్‌కు కంచుకోటలు. రాయ్‌బరేలీకి ఇందిరాగాంధీ, ఆమె భర్త, అలాగే సోనియా గాంధీలు ప్రాతినిథ్యం వహించారు. ఇక అమేథీ నుంచి రాజీవ్ గాంధీ, సోనియా, రాహుల్ గాంధీలు విజయం సాధిస్తూ వచ్చారు. గత లోక్‌సభ ఎన్నికల్లో అమేథీ నుంచి రాహుల్ గాంధీ ఓడిపోయినా.. రాయ్‌బరేలీ నుంచి మాత్రం కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ విజయం సాధించారు. ఇప్పుడు ఇదే రాయ్‌బరేలీని సోనియా గాంధీ ప్రస్తుతం రాహుల్ గాంధీ కోసం త్యజించారు. దీంతో రాయ్‌బరేలీ నుంచి రాహుల్ బరిలో నిలవటంతో ఈ స్థానం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. "2014లో కాంగ్రెస్ అధికారం కోల్పోయినప్పటికీ రాయ్‌బరేలీ, అమేథీ స్థానాలను మాత్రం గాంధీ కుటుంబం గెలవగలిగింది. అప్పటి వరకు ఈ రెండు నియోజకవర్గాలు గాంధీ కుటుంబానికి పర్యాయపదాలుగా ఉన్నాయి. భారత రాజకీయాలలో గాంధీ కుటుంబం 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎక్కువ కాలం పాటు దేశాన్ని పాలించింది. మూడు తరాల ప్రధానులు.. జవహర్‌లాల్ నెహ్రూ, అతని కుమార్తె ఇందిరా గాంధీ, మనవడు రాజీవ్ గాంధీలు ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు, దాని నుంచి బయటికి వచ్చినప్పుడు.. అమేథీ, రాయ్‌బరేలీలు వేరు చేయబడ్డాయి. ఆ రెండు స్థానాలు చాలా వరకు ఆ కుటుంబానికి అండగా నిలిచాయి" అని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేశారు. 2019లో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అమేథీలో 55,000 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ చేతిలో ఓడిపోయారు. జాతీయ స్థాయిలో 2014లో సోనియా గాంధీ రాయ్‌బరేలీ స్థానాన్ని నిలుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అతిపెద్ద రాష్ట్రం యూపీలో గెలిచిన ఏకైక స్థానం ఇదే.

ఇప్పుడు.. ఐదేళ్ల తర్వాత బిజెపి, కాంగ్రెస్ మధ్య పోరు.. మోడీ వర్సెస్ రాహుల్‌గా మారింది. రాహుల్ ఈసారి రాయ్‌బరేలీ నుంచి బరిలోకి దిగుతున్నారు. బీజేపీకి చెందిన స్మృతి ఇరానీ అమేథీ నుంచి మళ్లీ ఎన్నికకు ప్రయత్నిస్తున్నారు. ఒక్కొక్కరు ఒక్కో పార్టీ నుంచి గట్టి పోటీని ఎదుర్కోవాల్సి వస్తుందని భావిస్తున్నారు. అమేథీ, రాయ్‌బరేలీ స్థానాలకు మే 20న ఎన్నికలు జరగనున్నాయి. బిజెపి రాయ్‌బరేలీని గెలుచుకుని అమేథీని నిలబెట్టుకుంటే.. అది ఉత్తర ప్రదేశ్ నుంచి గాంధీ కుటుంబాన్ని, కాంగ్రెస్‌ను సమర్థవంతంగా తుడిచిపెట్టినట్టవుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. దీనికి విరుద్ధంగా రెండు స్థానాల్లో కాంగ్రెస్ గెలిస్తే.. జాతీయంగా ఎవరు పాలించాలనేది తరచుగా నిర్ణయించే రాష్ట్రంలో బిజెపి వ్యతిరేక పవనాలకు బీజం పడుతుందని వారు విశ్లేషిస్తున్నారు. అమేథీ, రాయ్ బరేలీ స్థానాలలో రాజకీయ గాలులు కాంగ్రెస్ వైపు వీస్తున్నాయనీ, ఇది మొత్తం రాష్ట్రాన్ని ప్రభావితం చేస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అలాగే దీని ప్రభావం దేశం మొత్తమ్మీదా పడి కాంగ్రెస్ పూర్వవైభవం పొందే అవకాశానికి దారి తీస్తుందని చెప్తున్నారు. రాయ్‌బరేలీలో కాంగ్రెస్ కేవలం మూడుసార్లు మాత్రమే ఓడిపోయింది. 1975లో జాతీయ అత్యవసర పరిస్థితిని విధించినందుకు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రజలు ఎదురు తిరిగారు. 1996, 1998లలో.. బిజెపి జాతీయ స్థాయిలో పుంజుకున్నప్పుడు, కేంద్రంలో మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు.. ఇక్కడ నుంచి కాంగ్రెస్‌ను ఓడించింది.

రాహుల్ రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తుండగా.. అమేథీ నుంచి ఇరానీపై గాంధీ కుటుంబానికి దగ్గరి వ్యక్తి అయిన కిషోరీ లాల్ శర్మ పోటీ చేస్తున్నారు.

వేసవి ప్రత్యేక రైళ్లు పొడిగింపు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

వేసవి కాలంలో ప్రయాణికుల అదనపు రద్దీని తగ్గించేందుకు ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ మేరకు 08321 సంబల్‌పూర్ - ఎస్ఎంవి బెంగళూరు ప్రత్యేక రైలు మే 30 నుంచి జూన్ 27 వరకు ప్రతి గురువారం సాయంత్రం 18.45 గంటలకు సంబల్‌పూర్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 04.55 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 05.00 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 23.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. 08322 ఎస్ఎంవి బెంగళూరు - సంబల్‌పూర్ ప్రత్యేక రైలు జూన్ 1 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం అర్ధరాత్రి 01.15 గంటలకు ఎస్ఎంవి బెంగళూరు నుంచి బయలుదేరి అదేరోజు రాత్రి 20.30 గంటలకు దువ్వాడకు చేరుకుని మరలా 20.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 06.30 గంటలకు సంబల్‌పూర్ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు బార్‌ఘర్ రోడ్డు, బలంగీర్, తిట్లాగఢ్, కేసింగ, మునిగూడ, రాయగడ, పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, దువ్వాడ, రాజమండ్రి, విజయవాడ, ఒంగోలు, గూడూరు, కృష్ణరాజ్‌పేట, జోలార్, రేణిగుంట మీదుగా ప్రయాణిస్తాయి.

08325 సంబల్‌పూర్ - కాచిగూడ సమ్మర్ స్పెషల్ మే 27 నుంచి జూన్ 24 వరకు ప్రతి సోమవారం రాత్రి 21.00 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి మరుసటి ఉదయం 07.20 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 07.25 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 21.50 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. 08326 కాచిగూడ - సంబల్‌పూర్ సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ మే 28 నుండి జూన్ 25 వరకు ప్రతి మంగళవారం రాత్రి 23.20 గంటలకు కాచిగూడలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు దువ్వాడ చేరుకుని 12.35 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 23.45 గంటలకు సంబల్‌పూర్ చేరుకుంటుంది. ఈ రైళ్లు బర్‌గఢ్ రోడ్డు, బలంగీర్, తిట్లగఢ్, కేసింగ, మునిగూడ, రాయగడ, పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, దువ్వాడ, అనకాపల్లి, తుని, పిఠాపురం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, చెర్లపల్లి, మల్కాజిగిరి మీదుగా ప్రయాణిస్తాయి.

కుంగిన గోదావరి ఏటిగట్టు

- పొంచి ఉన్న ప్రమాదం!

ప్రజాశక్తి-రామచంద్రపురం (కోనసీమ జిల్లా)

కోటిపల్లి నుంచి సుందరపల్లి మధ్యగల కుమ్మరి సావరం వద్ద గోదావరి ఏటిగట్టు కుంగిపోయి బలహీనపడింది. ఏటిగట్టు రోడ్డు వరకు గోదావరిలోకి మట్టి జారిపోవడంతో ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయంలో ఈ ప్రాంతంలో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వర్షాకాలంలో గోదావరి వరద నీటి ప్రవాహం పెరగడంతో పాటు ప్రతి సంవత్సరం ఆగస్టు నుండి అక్టోబర్ వరకు వరదలు సంభవిస్తుంటాయి. అటువంటి సమయంలో బలహీనంగా ఉన్న ఏటి గట్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉండడంతో ఈ ప్రాంతంలో గ్రోయిన్లను నిర్మించారు. అయినా, వర్షాలకు మట్టి పూర్తిగా కొట్టుకుపోయి కొమ్మరివారు సమరం వద్ద ఏటిగట్టు బలహీనపడింది గోదావరి పరివాహక ప్రాంత రక్షణాధికారులు కన్సర్వెన్సీ శాఖ దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కేవలం ఒక ఎర్రజెండాను ఇక్కడ కట్టి అధికారులు చేతులు దులుపుకున్నారు. వచ్చే వర్షాకాలంలోపు ఇక్కడ మరమ్మతులు చేపట్టకపోతే గోదావరి ఉధృతికి ఈ ఏటుగట్టు వద్ద ప్రమాదం జరిగే అవకాశం పొంచి ఉంది.

గతేడాది బలహీనంగా ఉన్న గట్ల వద్ద ఇసుక మేటలు వేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ మూటలు కొట్టుకుపోవడంతో పరిస్థితి మళ్లీ యథాస్థితికి వచ్చింది. ఈసారి వర్షాకాలానికి ముందే మరమ్మతు పనులు చేపడితే ప్రయోజనం ఉంటుందని, లేదంటే చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందంగా ఉంటుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దీనిపై అధికారులు వెంటనే దృష్టి సారించి జారిపోయిన ఏటిగట్టుకు మరమ్మతులు పూర్తి చేయాలని, రోడ్డు ప్రమాదాలు నివారించాలని పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

జాతీయ స్థాయి నృత్య పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- తాడేపల్లిగూడెం (పశ్చిమగోదావరి జిల్లా)

బివిఆర్ కళా కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి నృత్య పోటీలు బివిఆర్ కన్వెన్షన్ హాలులో శనివారం ప్రారంభమయ్యాయి. సుమారు 200 మంది కళాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. భరతనాట్యం, కూచిపూడి, జానపదం తదితర నృత్యాలను ప్రదర్శించారు. జూనియర్స్, సీనియర్స్ రెండు విభాగాలుగా రెండు రోజులపాటు పోటీలు జరగనున్నాయి. పోటీల సందర్భంగా హైదరాబాద్, విశాఖపట్నం తదితర ప్రాంతాల సీనియర్ కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గండికోట రాజేష్, నందూరి రాధిక న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. బివిఆర్ కళాకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు బుద్దాల వెంకటరామారావు, పిటి.వెంకన్న, దాసరి కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్
CanFinHomes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS ✦ DEPOSITS — Translating Dreams into Reality
CIN No.L85110KA1987PLC008699
డి.నెం.4-1-1, గాయత్రి ప్లాజా, మొదటి అంతస్తు, కొరిటెపాడు మెయిన్ రోడ్, గుంటూరు-522007.
ఫోన్: 0863-2333064, సెల్: 7625079146, ఇ-మెయిల్: guntur@canfinhomes.com

స్వాధీనత ప్రకటన (రూల్ 8(1))(స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002లోని క్రింద **కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారునకు సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ సదరు నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొనబడిన బకాయి **రూ.15,09,788/- (అక్షరాల పదిహేను లక్షల తొమ్మిది వేల ఏడు వందల ఎనభై ఎనిమిది రూపాయలు మాత్రమే)** మరియు తిరిగి చెల్లించే వరకు వడ్డీతో సహా నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసిన **ఋణగ్రహీత: షేక్ షఫియా భాను, తండ్రి: షేక్ జానీ, మరియు సహ-ఋణగ్రహీత: శ్రీ షేక్ జానీ, తండ్రి: షేక్ సుభాని** గార్లను కోరుతూ **తేది.05.03.2024**న **డిమాండ్ నోటీసు** జారీచేశారు.

ఋణగ్రహీతలు సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూల్ 8తో కలిపి చదువుకొనవలసిన సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు **తేది.18.05.2024**న దిగువ వివరించిన ఆస్తిని **స్వాధీనత** తీసుకొన్నారు.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించవలెను.

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైన **రూ.15,09,788/- (అక్షరాల పదిహేను లక్షల తొమ్మిది వేల ఏడు వందల ఎనభై ఎనిమిది రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీ **కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

స్థిరాస్తి వివరములు

ఏ-షెడ్యూల్: గుంటూరు జిల్లా (ప్రస్తుతం పల్నాడు జిల్లా), నరసరావుపేట సబ్-జిల్లా, నరసరావుపేట మునిసిపల్ లిమిట్స్, నరసరావుపేట పట్టణం, సత్తెనపల్లి రోడ్, ఇస్సపాలెం డొంక, ప్లాట్ నెం.16, డి.నెం.39-1, 42/బి, 44, సాయిబాబా గుడి వెనుక గల 363.88 చ॥గ॥ లేదా 304.24 చ॥మీ॥ల స్థలం మరియు ఇస్సపాలెం గ్రామ పంచాయితీ వైడ్ పిఆర్ నెం.3, తేది: 18-06-2016 & జిపి ఆఫీస్ నెం.41/2016, తేది.21-05-2016 అప్రూవ్ చేసిన ప్లాన్‌లో ఉన్న ఆర్‌సిసి బిల్డింగ్‌నకు **హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.20 ఆస్తి, **దక్షిణం:** ప్లాట్ నెం.17 ఆస్తి, **పడమర:** 25అ॥ వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** 30అ॥ వెడల్పు రోడ్డు.
ఈ హద్దుల మధ్య 363.88 చ॥గ॥ల స్థలం అందు సాయి కృష్ణ టవర్స్ పేరిట ఉన్న అపార్ట్‌మెంట్‌లో నిర్మితమైన 12చ॥గ॥ లేదా 10.03 చ॥మీ॥ల అవిభాజ్యపు, అనిర్దిష్టపు వాటా స్థలం కలిగిన నివాస ఫ్లాట్
బీ-షెడ్యూల్: 363.88 చ॥గ॥లలోని పైన పేర్కొన్న అపార్ట్‌మెంట్‌లో 12 చ॥గ॥ లేదా 10.03 చ॥మీ॥ల అవిభాజ్యపు, అనిర్దిష్టపు వాటాలో పైన పేర్కొన్న సాయి కృష్ణ టవర్స్ గ్రౌండ్ ఫ్లోర్‌లోని 550 చ॥అ॥ల ప్లింత్ ఏరియా మరియు కామన్ ఏరియా గల సింగిల్ బెడ్‌రూమ్ కలిగిన ఫ్లాట్ నెం.104నకు **హద్దులు: తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఫ్లాట్ నెం.105, **పడమర:** కామన్ కారిడార్, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై.
ఈ హద్దుల మధ్య ఫ్లాట్ నెం.104 గ్రౌండ్ ఫ్లోర్‌లోని ప్లింత్ ఏరియా 550 చ॥అ॥ల విస్తీర్ణంతో పాటు సర్వహక్కులు మరియు కామన్ యాజిమెంటరీ హక్కులతో సహా స్టిల్ట్ ఫ్లోర్.

తేది : 18.05.2024 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం : గుంటూరు — కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

రికవరీ అధికారి కార్యాలయం-II
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
ఆర్థిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం
గ్రౌండ్ & ఫస్ట్‌ఫ్లోర్, 31-31-21, నారాయణ భవనము, సాయిబాబా వీధి, డాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020

Form-17
(ఆదాయపుపన్ను చట్టం 1961 యొక్క రెండవ షెడ్యూల్ రూల్ 53 చూడుము)
విక్రయ ప్రకటన పరిష్కరించేందుకు నోటీసు
ఓ.ఎ.నెం.881 ఆఫ్ 2020 లో ఆర్.పి.నెం. 370 ఆఫ్ 2023
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఇ-ఆంధ్రాబ్యాంక్), మెయిన్ బ్రాంచి, ఏలూరు రోడ్, గుడివాడ, కృష్ణాజిల్లా
వర్సెస్
శ్రీ కొడాలి అరుణ్ కుమార్ & ఇతరులు

(CD-1) శ్రీ కొడాలి అరుణ్‌కుమార్, తండ్రి: శ్రీ రాధాకృష్ణమూర్తి, డి.నెం.10/130, బైపాస్ రోడ్, గుడివాడ, కృష్ణాజిల్లా-521301.
(CD-2) శ్రీమతి టి.రత్నకుమారి, భర్త : శ్రీ టి.కృష్ణారావు, డి.నెం.10/140, పాటిమీద, గుడివాడ, కృష్ణాజిల్లా-521301.
(CD-3) శ్రీ పియమ్ ఎస్ వి ఆర్ ఎస్ కుమార్, తండ్రి: శ్రీ ఖడ్గరాజకుమార్, డి.నెం.11/110, ఏలూరు రోడ్, నాగవరప్పాడు,గుడివాడ, కృష్ణాజిల్లా.

ఓ.ఎ.నెం.881 ఆఫ్ 2020, తేది 07.06.2023 రికవరీ సర్టిఫికేట్‌లో సూచించిన **రూ.62,03,973.80** పై కి భవిష్యతులో వడ్డీ 10.20% గౌరవ ప్రిసైడింగ్ అధికారి, డెట్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం ద్వారా **04.12.2020** నుండి రియలైజ్ అయ్యే వరకు త్రైమాసిక విశ్రాంతితో కలిపి, క్రింద పేర్కొన్న స్థిరాస్తులను విక్రయించాలని దిగువ సంతకం దారు ఆదేశించినారు.
మీరు. పైన పేర్కొన్న సర్టిఫికేట్ ఋణగ్రహీతలు/ప్రతివాదులు ఈ నోటీసు యొక్క సర్వీసు తేది నుండి 15వ రోజున లేదా ఆ తర్వాత విక్రయ ప్రకటనను రూపొందించడానికి మరియు దాని నిబంధనలను సెటిల్ చేయడానికి నిర్ణయించబడింది అని దీని ద్వారా తెలియచేయడమైయందిం.దిగువ ఉదహరించి అస్థలు లేదా దాని లో భాగానికి అనుబంధంగా వున్నా ఏవైనా భారాలు చార్జీలు క్లైములు లేదా బాధితులను దిగువ సంతకం చేసిన వారిని దృష్టికి తీసుకురావాలని మీరు అభ్యర్థించబడ్డారు.

ఆస్థి వివరములు
షెడ్యూల్-బి
ఐటమ్ నెం.1 : కృష్ణాజిల్లా, గుడివాడ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, రిజిస్టర్డ్ టైటిల్ డీడ్ నెం.1412/1996, తేది : 07.05.1996.
కృష్ణాజిల్లా, గుడివాడ సబ్ రిజిస్ట్రీ, గుడివాడ మునిసిపల్ ఏరియా, నాగవరప్పాడు గ్రామంలో గల 121 1/3 చ॥గ॥ల స్థలము మరియు అందు నిర్మాణమునకు హద్దులు : **తూర్పు :** రోడ్-21 అ॥, **పడమర:** పి యస్ రావు గారి ఆస్థి-21 అ॥, **ఉత్తరం:** పి యస్ రావు గారి ఆస్థి-52 అ॥, **దక్షిణం:** ఖడ్గరాజకుమార్ గారి ఆస్థి-52అ॥.
ఐటమ్ నెం.2 : కృష్ణాజిల్లా, గుడివాడ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, రిజిస్టర్డ్ టైటిల్ డీడ్ నెం.5911/2007, తేది : 18.10.2007.
కృష్ణాజిల్లా, గుడివాడ మండలం, గుడివాడ టౌన్, 11వ వార్డు, ఆర్.ఎస్.నెంలు. 87/1,88/1, ప్లాన్ లే అవుట్ ప్లాట్ నెం.23, డోర్ నెం.11/480 దగ్గరలో మొత్తము ఎ.4.83 సెంట్లలోని 236.8 చ॥గ॥ లేదా 197.98 చ॥మీ॥ల విస్తీర్ణమునకు హద్దులు : **తూర్పు :** 30 అ॥ల వెడల్పు రోడ్-37 అ॥, **పడమర:** పాలిటెక్నిక్ కాలేజి భూమి-37', **ఉత్తరం:** ప్లాట్‌నెం.22-57'6", **దక్షిణం:** ప్లాట్‌నెం.24-57'6".
ఐటమ్ నెం.3 : కృష్ణాజిల్లా, గుడివాడ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, రిజిస్టర్డ్ టైటిల్ డీడ్ నెం.1884/1988, తేది : 29.04.1988.
కృష్ణాజిల్లా, గుడివాడ మునిసిపాలిటీ, ఆర్.ఎస్.నెం.279లో గల 303 చ॥గ॥ల విస్తీర్ణమునకు హద్దులు : **తూర్పు :** 20 అ॥ల రోడ్, **పడమర:** టి.లక్ష్మి గారి ఆస్థి, **ఉత్తరం:** ఎ యస్ వి ప్రసాద్, **దక్షిణం:** యస్ యస్ ఆర్ కె రావు.
(నా స్వహస్తంతో మరియు ట్రిబ్యునల్ ముద్రికతో విశాఖపట్నం వద్ద 20 ఫిబ్రవరి, 2024న జారీచేయబడినది).
(బి.యన్.యస్.వి.యస్.కె.బంగార్రాజు)
రికవరీ ఆఫీసర్-2
డెట్స్ రికవరీ ట్రిబ్యూనల్, విశాఖపట్నం

హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్
HDB FINANCIAL SERVICES
రిజిస్టర్డు ఆఫీసు: రాధిక, 2వ అంతస్తు, లా గార్డెన్ రోడ్, నవరంగ్‌పుర, అహ్మదాబాద్-380009.
బ్రాంచి ఆఫీసు : 76-8-10/1, ఫ్లాట్ నం.4, భవాని టవర్స్, స్వాతి థియేటర్ రోడ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన, భవానీపురం, విజయవాడ-520012.

అనుబంధం-4 - స్వాధీనత ప్రకటన
(రూల్-8(1)చూడండి)(స్థిరాస్తి కొరకు)

[illegible]

తేది: 16.05.2024, ప్రదేశం: విజయవాడ — హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ తరఫున, అధీకృత అధికారి

రికవరీ అధికారి కార్యాలయం-II
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
ఆర్థిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం
గ్రౌండ్ & ఫస్ట్‌ఫ్లోర్, 31-31-21, నారాయణ భవనము, సాయిబాబా వీధి, డాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020

Form-17
(ఆదాయపుపన్ను చట్టం 1961 యొక్క రెండవ షెడ్యూల్ రూల్ 53 చూడుము)
విక్రయ ప్రకటన పరిష్కరించేందుకు నోటీసు
ఓ.ఎ.నెం.744 ఆఫ్ 2016 లో ఆర్.పి.నెం.804 ఆఫ్ 2018
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఇ-ఆంధ్రాబ్యాంక్), గుడివాడ మెయిన్ బ్రాంచి, గుడివాడ, కృష్ణాజిల్లా
వర్సెస్
శ్రీ బుర్రముక్కు పాములరెడ్డి & ఇతరులు

(CD-1) శ్రీ బుర్రముక్కు పాములరెడ్డి, తండ్రి: కోటిరెడ్డి, డి.నెం.3-138/1, కుంచనపల్లి గ్రామం,తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.
(CD-2) శ్రీయన్.వేణుగోపాల్, తండ్రి:శ్రీ దక్షిణామూర్తి, డి.నెం.23-7-7ఎ, వ్యాయామశాల రోడ్, సత్యనారాయణపురం, విజయవాడ, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్.

ఓ.ఎ.నెం.744 ఆఫ్ 2016, తేది 05.04.2018 రికవరీ సర్టిఫికేట్‌లో సూచించిన **రూ.49,14,216/-** కి భవిష్యతులో వడ్డీ **11.25%** గౌరవ ప్రిసైడింగ్ అధికారి, డెట్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం ద్వారా **04.07.2016** నుండి రియలైజ్ అయ్యే వరకు త్రైమాసిక విశ్రాంతితో కలిపి, క్రింద పేర్కొన్న స్థిరాస్తులను విక్రయించాలని దిగువ సంతకం దారు ఆదేశించినారు.
మీరు. పైన పేర్కొన్న సర్టిఫికేట్ ఋణగ్రహీతలు/ప్రతివాదులు ఈ నోటీసు యొక్క సర్వీసు తేది నుండి 15వ రోజున లేదా ఆ తర్వాత విక్రయ ప్రకటనను రూపొందించడానికి మరియు దాని నిబంధనలను సెటిల్ చేయడానికి నిర్ణయించబడింది అని దీని ద్వారా తెలియచేయడమైయందిం.దిగువ ఉదహరించి అస్థలు లేదా దాని లో భాగానికి అనుబంధంగా వున్నా ఏవైనా భారాలు చార్జీలు క్లైములు లేదా బాధితులను దిగువ సంతకం చేసిన వారిని దృష్టికి తీసుకురావాలని మీరు అభ్యర్థించబడ్డారు.

ఆస్థి వివరములు
షెడ్యూల్-బి
టైటిల్ డీడ్ నెం.7404/2006, తేది 16.11.2006, ప్రతివాది నెం.1కు చెందిన ఆస్థి
రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. శనివారం మొదటి సంవత్సరం డిగ్రీ రెండవ సెమిస్టర్‌లో సంస్కృతం, హిందీ తదితర పరీక్షలు నిర్వహించారు. ఆళ్లగడ్డ పట్టణంలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం కాగానే ప్రశ్నాపత్రాన్ని ఇచ్చారు. ప్రశ్నాపత్రంలో ప్రస్తుత సిలబస్‌ను కాదని పాత సిలబస్‌తో కూడిన ప్రశ్నాపత్రం ఇవ్వడంతో విద్యార్థులు ఖంగుతిన్నారు. అధికారులు యూనివర్సిటీ వారికి సమాచారం ఇవ్వగా మరొక ప్రశ్నా పత్రాన్ని వెబ్‌సైట్‌లో ఉంచామని, అది విద్యార్థులకు ఇవ్వమని చెప్పారు. వెంటనే అధికారులు ఆ ప్రశ్నా పత్రాన్ని విద్యార్థులకు ఇచ్చారు. అందులో కూడా పాత సిలబస్ ప్రకారమే ఉండడంతో విద్యార్థులు మరోసారి ఆందోళన చెందారు. మూడోసారి గంట ముందు ప్రశ్నాపత్రాన్ని ఇచ్చారు. ఆ పరీక్ష పేపర్ నాడా ప్రశ్నలను కొట్టేసి చేతితో రాసిచ్చారు. ఆ ప్రశ్నలు అర్థం కాక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అప్పటికే రెండు ప్రశ్నాపత్రాలకు సంబంధించి విద్యార్థులు జవాబులు బుక్‌లెట్‌లో రాయడంతో అనేకమంది విద్యార్థుల బుక్‌లెట్‌లో అయిపోయాయి. మూడో ప్రశ్నా పత్రానికి సమాధానాలు రాసేందుకు బుక్‌లెట్ ఖాళీ లేకపోవడంతో విద్యార్థులు మరొక బుక్‌లెట్ ఇవ్వాలని అడగగా మరొకటి ఇచ్చే అధికారం తమకు లేదని అందులోనే రాయాలని చెప్పినట్టు తెలిసింది. దీంతో విద్యార్థులు అందులోనే వచ్చిన కాడికి రాసేసి బయటకు వచ్చారు. ఒక పరీక్ష కేంద్రంలో కొన్ని రూముల వారికి మూడో ప్రశ్నా పత్రం అందజేశారు.. ఒక రూమ్ వారికి ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మూడు ప్రశ్నాపత్రాల విషయమై కళాశాలల నిర్వహకులకు వివరణ అడగగా యూనివర్సిటీ వారు చేసిన తప్పిదంతో విద్యార్థులు ఇబ్బందులు పడిన విషయం వాస్తవమేనని కొంతమంది ధ్రువీ కరించారు.

నోట్లు.. డ్రగ్స్.. ఆభరణాలతో వల

- గుజరాత్‌లో అత్యధిక ప్రలోభాలు
- ఎన్నికల తనిఖీల్లో.. రూ.8,889 కోట్ల సొత్తు స్వాధీనం: ఇసి

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలలో ఎన్నడూలేని విధంగా నోట్లు.. డ్రగ్స్.. ఆభరణాలను గుమ్మరించాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రలోభాల పర్వం సాగుతున్నట్టు తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల క్రమంలో నాలుగువిడతల పోలింగ్ జరగ్గా.. ఇప్పటివరకు చేపట్టిన తనిఖీల్లో ఇప్పటివరకు రూ.8,889 కోట్ల మేర విలువైన నగదు, మాదక ద్రవ్యాలు, ఇతర తాయిలాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. జప్తు చేసిన సొత్తులో మాదక ద్రవ్యాలదే 45 శాతం వాటా అని, రూ.3,958 కోట్ల మేర డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించింది.

స్వాధీనం చేసుకున్న సొత్తులో నగదు రూపేణా రూ.849.15 కోట్లు, మద్యం (రూ.814.85 కోట్లు), మాదక ద్రవ్యాలు (రూ.3,958 కోట్లు), బంగారం, వెండి వంటి ఆభరణాలు (రూ.1,260.33 కోట్లు), ఇతర ఉచితాలు (రూ.2006.59 కోట్లు) ఉన్నట్లు ఇసి తెలిపింది. మాదక ద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాల స్వాధీనంపై ఈసారి ప్రత్యేక దృష్టిసారించినట్టు పేర్కొంది. గుజరాత్ ఏటీఎస్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, ఇండియన్ కోస్ట్ గార్డ్‌లు కలిసి చేపట్టిన ఆపరేషన్లలో కేవలం మూడు రోజుల్లోనే రూ.892 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుబడినట్టు వెల్లడించింది.

కోడ్‌పై ఇసికి 'విజిల్' ..
2 నెలల్లో 4.24 లక్షల ఫిర్యాదులు

అత్యధికంగా గుజరాత్‌లో రూ.1,461.73 కోట్ల విలువైన ప్రలోభాలను స్వాధీనం చేసుకున్నట్టు ఇసి నివేదికలో వెల్లడైంది. రాజస్థాన్ (రూ.1133.82 కోట్లు), పంజాబ్ (రూ.734.54 కోట్లు) రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో చూసుకుంటే ఆంధ్రప్రదేశ్‌లో రూ.301.75 కోట్లు, తెలంగాణలో రూ.333.55 కోట్ల సొత్తు జప్తు చేసింది.

పశ్చిమ బెంగాల్ రాజ్‌భవన్‌లో ముగ్గురు ఉద్యోగులపై ఎఫ్ఐఆర్

పశ్చిమ బెంగాల్ : పశ్చిమ బెంగాల్ గవర్నర్ సివి ఆనంద్ బోస్‌పై లైంగిక వేధింపుల ఫిర్యాదు ఇచ్చేందుకు ప్రయత్నించిన మహిళా ఉద్యోగిని అడ్డుకున్న కేసులో రాజ్‌భవన్‌కు చెందిన ముగ్గురు ఉద్యోగులపై శనివారం కోల్‌కతా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... ఈ నెల 2న రాజ్‌భవన్‌లో కాంట్రాక్టు ఉద్యోగం చేస్తున్న మహిళ ఫిర్యాదు ఇచ్చేందుకు ప్రయత్నించింది. ఆమెను ఒఎస్‌డి ఎస్ఎస్ రాజ్‌పుత్, ప్యూన్ సంత్ లాల్, కుసుమ్ ఛత్రీ అడ్డుకున్నారు. నిందితులపై ఐపిసి సెక్షన్ 341, 166 కింద కేసు నమోదు చేశారు. సెక్షన్ 164 కింద మేజిస్ట్రేట్ ముందు బాధితురాలి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు.

చట్ట ప్రకారం చర్యలు తీసుకోండి

- మనవడు ప్రజ్వల్‌పై మాజీ పధాని దేవెగౌడ

బెంగళూరు : మాజీ ప్రధాని దేవెగౌడ తన మనవడు ప్రజ్వల్ రేవణ్ణ కేసుకు సంబంధించి తొలిసారి స్పందించారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 'ప్రజ్వల్ రేవణ్ణపై నేరం రుజువైతే అతనిపై చట్టపరంగా చర్యలు తీసుకోండి. దేశంలో చట్టప్రకారం న్యాయం జరగాలి. ప్రజ్వల్ రేవణ్ణపై ప్రభుత్వం న్యాయపరమైన మార్గాలను అనుసరించాలి. ఈ కేసులో ప్రమేయం ఉన్న వారికి న్యాయం జరిగేలా సమగ్ర దర్యాప్తు జరగాలి. చట్టపరమైన విధానాలకు కట్టుబడి ఉండాలి. నా కుమారుడు హెచ్‌డి రేవణ్ణపై లైంగిక దాడి, కిడ్నాప్ కేసులు కావాలని బనాయించినవే. ఈ కేసులో చాలామంది ప్రమేయం ఉంది. బాధిత మహిళలందరికీ న్యాయం జరుగుతుంది. హెచ్‌డి రేవణ్ణకు సంబంధించిన కేసు కోర్టులో ఉంది. అందుకే దీనిపై నేను ఎక్కువగా మాట్లాడదల్చుకోలేదు.' అని అన్నారు. హసన్ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దాడికి పాల్పడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. కర్ణాటక ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈ కేసు దర్యాప్తు చేస్తోంది.

భారత్‌లో ప్రజాస్వామ్యానికి అమెరికా అధికారి కితాబు

వాషింగ్టన్ : భారత్‌లో ప్రజాస్వామ్యానికి అమెరికా అధికారి ఒకరు కితాబిచ్చారు. భారత్ కంటే శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశాలు ప్రపంచంలో లేవని అయన చెప్పారు. భవిష్యత్తులో ఏర్పడే ప్రభుత్వంలో ప్రజల వాణిని వినిపించేలా ప్రజలు ఓటు హక్కును వినియోగించుకున్నారని వైట్‌హౌస్ జాతీయ భద్రతా కమ్యూనికేషన్స్ సలహాదారు జాన్ కిర్బీ అన్నారు. భారత్‌లో ప్రస్తుతం సాగుతున్న ఎన్నికల ప్రక్రియపై అడిగిన ప్రశ్నకు ఆయన పైరీతిన స్పందించారు. ఇండో-పసిఫిక్, క్వాడ్‌లను మరింత విస్తరిస్తూ, వాటిని ప్రస్తుత పరిస్థితులు, అవసరాలకు తగినట్లుగా బలోపేతం చేస్తున్నాం." అని చెప్పారు. ఈ క్వాడ్‌ను ఇప్పుడు స్క్వాడ్‌గా పేరు మార్చారు. ఈ మొత్తం ప్రక్రియలో భారత్ భాగస్వామి అని కిర్బీ పేర్కొన్నారు. 'ఈ భాగస్వామ్యం చాలా శక్తివంతమైనది, చురుకైనది. ఇందుకు ప్రధాని మోడీ నాయకత్వానికి కృతజ్ఞతలు చెప్పాలి." అని పేర్కొన్నారు.

ముగిసిన ఐదో విడత ప్రచారం

- రేపే పోలింగ్
- 49 నియోజకవర్గాలు, 695 మంది అభ్యర్థులు
- ప్రముఖులు రాహుల్‌గాంధీ, రాజ్‌నాథ్‌సింగ్, స్మృతి ఇరానీ..పోటీ

రాజ్‌నాథ్‌సింగ్, రాహుల్‌గాంధీ, స్మృతి ఇరానీ

ప్రజాశక్తి -న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల ఐదో విడత ప్రచార పర్వం శనివారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఎనిమిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 49 నియోజకవర్గాలకు రేపు (సోమవారం) పోలింగ్ జరుగనుంది. మొత్తంగా 695 మంది అభ్యర్థులు ఉన్నారు. వీరిలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో సహా పలువురు ప్రముఖులున్నారు.

ఉత్తరప్రదేశ్‌లోని లక్నో లోక్‌సభ స్థానం నుంచి బిజెపి తరుపున రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పోటీ చేయగా, సమాజ్‌వాదీ పార్టీ రవిదాస్ మెహ్రోత్రాను అభ్యర్థిగా నిలబెట్టింది. మంత్రిగా పనిచేసిన మెహ్రోత్రా ప్రస్తుతం లక్నో సెంట్రల్ అసెంబ్లీ స్థానం నుంచి ఎస్‌పి ఎమ్మెల్యేగా ఉన్నారు. బిఎస్‌పి తన అభ్యర్థిగా సర్వర్ మాలిక్‌ను ఎంపిక చేసింది. ఉత్తరప్రదేశ్‌లో అత్యంత చర్చనీయాంశమైన స్థానాల్లో రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానం ఒకటి. 2019లో రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచిన ఏకైక సీటు ఇదే. అప్పుడు సోనియా గాంధీ ఇక్కడి నుంచి గెలిచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ప్రస్తుతం కాంగ్రెస్ రాయ్ బరేలీ నుంచి రాహుల్ గాంధీని పోటీకి దింపింది. బిజెపి దినేష్ ప్రతాప్ సింగ్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. ఎమ్మెల్సీ దినేష్ ప్రతాప్ ప్రస్తుతం యోగి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. కేంద్ర మంత్రి, ప్రస్తుత అమేథీ ఎంపీ స్మృతి ఇరానీ మరోసారి ఇక్కడ నుంచి బిజెపి టికెట్‌పై పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ తన అభ్యర్థిగా గాంధీ కుటుంబానికి సన్నిహితుడైన కెఎల్ శర్మను బరిలోకి దింపింది. బీఎస్పీ నాన్హే సింగ్ చౌహాన్‌ను తన అభ్యర్థిగా దింపింది.

బీహార్‌లోని హాజీపూర్ లోక్‌సభ స్థానం ఈ ఎన్నికల్లో అత్యంత ప్రజాదరణ పొందిన స్థానాల్లో ఒకటి. ఇక్కడి నుంచి ఎల్‌జేపీ (ఆర్)కు చెందిన చిరాగ్ పాశ్వాన్ ఎన్‌డిఎ నుంచి పోటీ చేస్తున్నారు. హాజీపూర్ స్థానం నుంచి శివచంద్ర రామ్‌కు ఆర్‌జెడి టిక్కెట్టు ఇచ్చింది. శివచంద్ర ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశారు.

కాశ్మీర్ లోయల్లోని పర్వతాలపై మంచు కురుస్తున్నప్పటికీ, ఇక్కడ రాజకీయ ఉష్ణోగ్రత వేడిగా ఉంది. కాశ్మీర్‌లోని బారాముల్లా స్థానంలో మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పోటీ చేయడంతో ఈ స్థానం ప్రత్యేకత సంతరించుకుంది. మెహబూబా ముఫ్తీ పార్టీ పిడిపి నుంచి ఫయాజ్ అహ్మద్‌తో ఒమర్ తలపడుతున్నారు.

ఉత్తరప్రదేశ్ (14)లో మోహన్‌లాల్‌గంజ్, లక్నో, రాయ్‌బరేలీ, అమేథీ, జలౌన్, ఝాన్సీ, హమీర్‌పూర్, బందా, ఫతేపూర్, కౌశంబి, బారాబంకి, ఫైజాబాద్, కైసర్‌గంజ్, గోండా స్థానాలకు పోలింగ్ జరగనుంది. మహారాష్ట్ర (13)లో ధూలే, దిండోరి, నాసిక్, పాల్ఘర్, భివాండి, కళ్యాణ్, థానే, ముంబై నార్త్, ముంబై నార్త్ - వెస్ట్, ముంబై నార్త్ - ఈస్ట్, ముంబై నార్త్ - సెంట్రల్, ముంబై సౌత్ - సెంట్రల్, ముంబై సౌత్ స్థానాలకు పోలింగ్ జరగనుంది. పశ్చిమ బెంగాల్ (7)లో బంగాన్, బరాక్‌పూర్, హౌరా, ఉలుబెరియా, శ్రీరాంపూర్, హుగ్లీ, ఆరంబాగ్ స్థానాలకు పోలింగ్ జరగనుంది. బీహార్ (5)లో సీతామర్హి, మధుబని, ముజఫర్‌పూర్, సరన్, హాజీపూర్ స్థానాలకు, ఒరిస్సా (5)లో బర్గర్, సుందర్‌ఘర్, బోలంగీర్, కంధమాల్, అస్కా స్థానాలకు పోలింగ్ జరగనుంది. జార?ండ్ (3)లో చత్రా, కోదర్మా, హజారీబాగ్ స్థానాలకు, జమ్మూ కాశ్మీర్ (1)లో బారాముల్లా, లడఖ్ (1)లో లడఖ్ స్థానానికి పోలింగ్ జరగనుంది. మహారాష్ట్రలోని 48 నియోజకవర్గాలలో 13 స్థానాలకు ఈదశలో పోలింగ్ జరగనుంది. దీంతో రాష్ట్రంలో ఎన్నికలు ముగుస్తాయి. ఈ విడతతో జమ్మూ కాశ్మీర్‌తో పాటు లడఖ్ కేంద్రపాలిత ప్రాంతంలో కూడా ఓటింగ్ ముగియనుంది. ఇప్పటి వరకు నాలుగు దశల్లో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పూర్తయింది.

స్మృతి ఇరానీకి ఎదురుగాలి !

- బిజెపికి ఓట్లు వేయబోమని క్షత్రియ సామాజిక వర్గం ప్రతిజ్ఞ

స్మృతి ఇరానీ, కెఎల్ శర్మ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ లోక్‌సభకు సోమవారం పోలింగ్ జరగనుంది. ఐదో దశ పోలింగ్ జరగబోయే 14 నియోజకవర్గాల్లో అమేథీ ఒకటి. ఇక్కడ నుంచి బిజెపి తరపున కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, ఇండియా ఫోరం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కెఎల్ శర్మ పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో సునాయాసంగా గెలిచిన స్మృతి ఇరానీకి, ఈసారి ఎదురుగాలి తప్పదనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికల సమయంలో బిజెపి పట్ల క్షత్రియ సామాజికవర్గం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

అమేథీలో స్మృతి ఇరానీకి వ్యతిరేకంగా క్షత్రియ సామాజిక వర్గానికి చెందినవారు ఇటీవల పలు చోట్ల ఆందోళనలు చేపట్టారు. ఈసారి బిజెపికి ఓటేయబోమని ప్రతిజ్ఞ కూడా చేశారు. ఇంతకీ వీరు స్మృతి ఇరానీపై ఎందుకు ఆగ్రహంతో ఉన్నారు?

కొంతకాలం క్రితం కాంగ్రెస్ నేత దీపక్ సింగ్‌పై అక్రమంగా కేసు పెట్టడం పట్ల వీరంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిజెపిలో తమ సామాజికవర్గానికి ప్రాధాన్యత తగ్గుతున్నదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్ణిసేన జాతీయ అధ్యక్షుడు మహిపాల్ సింగ్ మాట్లాడుతూ బిజెపి లోక్‌సభ ఎన్నికల అభ్యర్థులు మహిళలను అవమానిస్తున్నారని, బిజెపి అధినేత, అగ్రనాయకత్వం కూడా పెదవి విప్పడం లేదని అన్నారు. బిజెపికి చెందిన నాయకులందరినీ వ్యతిరేకిస్తామని, వారికి ఓటేయబోమని చెప్పారు. మహిళలను గౌరవించని ఏ పార్టీనైనా వ్యతిరేకిస్తామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా రాజ్‌పుత్ సమాజానికి చెందిన వారెవరూ బిజెపికి ఓటు వేయరని తెలిపారు. బిజెపికి ఓటేశామని, రాజ్‌పుత్‌లను కూలీలుగా ఆ పార్టీ నిలబెట్టిందని అన్నారు. దేశంలోని రాజ్‌పుత్‌లు బిజెపికి ఓటు వేయరని ప్రకటిస్తున్నామని మహిపాల్ సింగ్ చెప్పారు. స్మృతి ఇరానీ మహిళా ఎంపిగా మహిళల గౌరవం గురించి ఎప్పుడూ మాట్లాడలేదని, పార్లమెంట్‌లో మహిళల సమస్యలను లేవనెత్తలేదని, అలాంటప్పుడు మహిళల గౌరవ కోసం పోరాడుతున్నామని చెప్పే హక్కు ఆమెకు లేదని అన్నారు.

ఉత్తర ప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్‌ను కట్టడి చేసేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని చెప్పారు. వసుంధర రాజేను పక్కనపెట్టారని, మధ్యప్రదేశ్‌లో సిఎం పదవి నుంచి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను, హర్యానాలో మనోహర్ లాల్ ఖట్టర్‌ను తొలగించారని, రమణ్‌సింగ్ పరిస్థితి ఏమిటో అందరికీ తెలిసిందేనని అన్నారు. బిజెపిలో క్షత్రియ సామాజికవర్గం స్థాయి తగ్గుతోందని చెప్పారు. రాజ్‌నాథ్ సింగ్‌ను బిజెపి పక్కన పెట్టిందని అన్నారు. బిజెపిలో క్షత్రియ సామాజికవర్గం స్థాయి తగ్గుతోందనడానికి ఇలాంటి ఉదాహరణలు చాలా ఉన్నాయని చెప్పారు. అందుకే కర్ణిసేన సామాజిక వర్గం వారంతా బిజెపిని వ్యతిరేకిస్తున్నారని తెలిపారు.

టూరిస్ట్ బస్సులో మంటలు

- 9మంది మృతి, 14మందికి గాయాలు

గురుగ్రామ్ : హర్యానాలోని నుహ్ జిల్లాలో కుండ్లి-మనేసర్-పాల్వాల్ ఎక్స్‌ప్రెస్‌వేలో టూరిస్ట్ బస్సుకు మంటలు అంటుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారిలో పదేళ్ల బాలికతో సహా 9మంది మరణించగా, 14మందికి తీవ్రంగా కాలిన గాయాలయ్యాయి. శనివారం తెల్లవారు జామున 2గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఆ సమయంలో బస్సులో 60మంది ప్రయాణికులు వున్నారు. యుపిలోని మథుర నుండి పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌కు బస్సు వెళుతోంది. గాయపడినవారిని వెంటనే నల్హార్ మెడికల్ కాలేజీలో చేర్చగా, వారందరూ ప్రమాదం నుండి బయటపడ్డారని పోలీసులు చెప్పారు. మంటలు చెలరేగిన తర్వాత బస్సు తలుపులు తెరుచుకోలేదని, దాంతో కిటికీల్లో నుండి దూకాల్సి వచ్చిందని గాయపడిన వారిలో ఒకరు మీడియాకు తెలిపారు. బస్సు అంతా పొగతో నిండిపోయిందని, ప్రతి ఒక్కరూ ప్రాణభయంతో పరుగులు తీయడం కనిపించిందని చెప్పారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జర్మనీలో ఆరోగ్య సంస్కరణలపై అలజడి

- ఆసుపత్రులు పెద్దయెత్తున మూతపడతాయన్న హక్కుల కార్యకర్తలు, వైద్యులు

కబినెట్ సమావేశానికి ముందు జర్మన్ విదేశాంగ మంత్రి అనాలిన్ బేర్‌బాచ్‌తో ముచ్చటిస్తున్న ఆరోగ్య మంత్రి లాతర్ బాచ్ (ఎడమవైపు)

బెర్లిన్: జర్మనీలోని సోషల్ డెమొక్రాట్ -గ్రీన్ సంకీర్ణ కూటమి ప్రభుత్వం ఆరోగ్య రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇవి ఆరోగ్యరంగాన్ని విప్లవీకరిస్తాయని ఆరోగ్య శాఖ మంత్రి కార్ల్ లాతర్‌బాచ్ అభివర్ణించగా, పెద్దయెత్తున ఆసుపత్రులు మూసివేయడమే ఈ సంస్కరణల లక్ష్యమని హక్కుల కార్యకర్తలు, వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ద్రవ్యోల్బణం, ఇంధన ధరలకు అనుగుణంగా ఆరోగ్య రంగానికి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు పెంచాల్సింది పోయి కోత పెట్టింది. దీంతో చాలా ప్రభుత్వ ఆసుపత్రులు నిధుల కొరతతో దీనావస్థకు చేరాయి. ఇప్పుడీ ఆసుపత్రులు ఎదుర్కొంటున్న సంక్షోభం గురించి కానీ, వాటికి ఆర్థిక తోడ్పాటు నందించడం గురించి కానీ ఒక్క ముక్క కూడా మాట్లాడడం లేదు. ఆరోగ్య సేవలను అందరికీ అందుబాటులోకి తీసుకురావడమెలా అన్న దాని గురించి కాకుండా అనవసర చికిత్సలను నిరుత్సాహపరిచేందుకు ఆసుపత్రుల సామర్థ్యం మదింపు జాబితా నుంచి కొన్ని ట్రీట్‌మెంట్లను తొలగించారు.

ఆరోగ్య సేవలను కుదించేందుకే ఆసుపత్రుల పెర్ఫార్మెన్స్ మదింపు బృందాలను కొత్తగా తెరపైకి తీసుకొచ్చారని అలయెన్స్ క్లినిక్ రెస్క్యూ ప్రతినిధి లారా వలెంతుకెవిసియుట్ సోషలిస్టు వార్తా పత్రిక జంగ్ వెల్ట్ తో మాట్లాడుతూ చెప్పారు. మార్బర్గర్ బండ్ డాక్టర్స్ యూనియన్ చైర్ ఉమెన్ సుసానె జానె మాట్లాడుతూ, ఆసుపత్రులకు ఆర్థిక సాయం అనవసరమని సంస్కరణలు చెబుతున్నాయని అన్నారు. గతేడాది యాభై దాకా ఆసుపత్రులు దివాలా తీశాయని, ఇప్పుడీ సంస్కరణలతో మరిన్ని ఆసుపత్రులు మూతపడే ప్రమాదముందని ఆమె అన్నారు.

విభజించి పాలిస్తున్న ప్రధాని మోడీ

- కాంగ్రెస్ చీఫ్ ఖర్గే విమర్శలు

ముంబయి : తన ఎన్నికల ప్రసంగాల ద్వారా ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలను రెచ్చగొడుతున్నారని, సమాజాన్ని చీలుస్తున్నారని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే విమర్శించారు. మోడీకి ముందు ప్రధానులు ఎవరూ కూడా ఇలా ప్రజలను రెచ్చగొట్టలేదన్నారు. ప్రధాని ప్రజాస్వామ్యం గురించి మాట్లాడతారు కానీ దాని సూత్రాలను అమలు చేయరని ఖర్గే వ్యాఖ్యానించారు. ఐదవ, తుది విడత పోలింగ్ నేపథ్యంలో ఖర్గేతోపాటు ఇండియా బ్లాక్ నేతలు పలువురు మహారాష్ట్రలో ఎన్నికల సభల్లో పాల్గొన్నారు. ఇండియా బ్లాక్ అధికారంలోకి వస్తే 370వ అధికరణని తిరిగి తీసుకువస్తుందని మోడీ పదే పదే చెబుతుండడంపై మీడియా ప్రశ్నించగా, మోడీకి తాను జవాబుదారీ కాదన్నారు.

మేనిఫెస్టోలో ఏం హామీ ఇచ్చామో అదే చేస్తామన్నారు. వెళ్ళిన చోటల్లా ప్రజలను విభజించి పాలించడమే పద్ధతిగా పెట్టుకున్నారంటూ మోడీని విమర్శించారు. అధికారంలోకి వస్తే అయోధ్యలో ఆలయంపై బుల్డోజరు ఎక్కిస్తుందని మోడీ చేసిన వ్యాఖ్యలపై ప్రశ్నించగా తమవి బుల్డోజరు రాజకీయాలు కావని ఖర్గే స్పష్టం చేశారు.

సిఎఎ కింద పౌరసత్వం కోసం పాక్ హిందువుల ప్రయత్నాలు

- ఇంటర్వ్యూల కోసం ఎదురుచూపులు

న్యూఢిల్లీ : పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) కింద పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్న పాకిస్తానీ హిందువులు శనివారం సెంట్రల్ ఢిల్లీలోని ఇంద్రప్రస్థ పోస్టాఫీస్‌లో తమ వంతు ఇంటర్వ్యూ కోసం వేచి చూస్తున్నారు. రైల్వే, పోస్టల్ శాఖ అధికారులతో కూడిన కమిటీ ముందు వారు హాజరు కావాల్సి వుంటుంది. 2014 జూన్‌లో భార్యాపిల్లలతో పర్యాటక వీసాపై భారత్‌కు వచ్చిన కన్వర్‌లాల్ సిఎఎ కింద దరఖాస్తు చేసుకోవడంతో శనివారం ఇంటర్వ్యూకు రావాల్సిందిగా సందేశం రావడంతో వచ్చారు. దాదాపు 40నిముషాల పాటు ఇంటర్వ్యూ జరిగిందని, శరణార్థుల కాలనీ సమీపంలో గల పూజారి జారీ చేసిన అర్హతా సర్టిఫికెట్‌తో సహా అన్ని పత్రాలను తీసుకువచ్చానని, అయినా నోటరీతో అటెస్ట్ చేయించాల్సిన అఫిడవిట్ లేదనే కారణంతో తన దరఖాస్తును తిరస్కరించారని లాల్ తెలిపారు. గతంలో ఇలాంటి ప్రయత్నాలకు పూర్తి చేయాల్సిన డాక్యుమెంట్లు చాలా వుండేవని, తాజాగా సిఎఎ వచ్చిన తర్వాత తమ పని సులభమైందని అమర్‌నాథ్ అద్వానీ వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు ఏళ్ల తరబడి పెండింగ్‌లో వున్న తమ డిమాండ్ ఇప్పుడు నెరవేరే అవకాశం వచ్చిందన్నారు. దేశంలో కింది స్థాయిల్లో పోస్టల్‌కార్యాలయాలు, రైల్వేలు వున్నందున సిఎఎ అమలుకు ఆ మౌలిక సదుపాయాలను ఉపయోగించుకోవాలని నిర్ణయించినట్లు ప్రభుత్వ సీనియర్ అధికారి తెలిపారు.

క్రిమి సంహారకాలు, రసాయనాల అధిక వాడకంపై కేంద్రానికి సుప్రీం నోటీసులు



న్యూఢిల్లీ : పంటలు, ఆహార పదార్థాలపై క్రిమి సంహారక మందులు, ఇతర రసాయనాలు అధికంగా వాడడం వల్ల దేశవ్యాప్తంగా మరణాలు అధికంగా సంభవిస్తున్నాయని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌పై స్పందించాల్సిందిగా సుప్రీం కోర్టు కేంద్రానికి, పలు శాఖలకు నోటీసులు పంపింది. ఈ పిటిషన్‌కు స్పందించి, సమాధానాలు పంపాల్సిందిగా కోరుతూ కేంద్ర ప్రభుత్వంతోపాటు వ్యవసాయ శాఖ, భారత్ ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎఐ) తదితరులకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ నోటీసులు పంపింది. క్రిమి సంహారక మందుల కారణంగానే అధిక సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొంటూ పిటిషనర్ దేశవ్యాప్తంగా డేటాను సేకరించారని ఆయన తరపు న్యాయవాది అనితా షెనోయ్ తెలిపారు. రసాయనాలతో కూడిన క్రిమిసంహారకాలను విపరీతంగా ఆహార పంటలపై వాడుతుండడంతో కేన్సర్లను కలిగించే అనేక రకాల వ్యాధులు, ఇతర అస్వస్థతలు తలెత్తుతున్నాయని ఆ పిటిషన్ పేర్కొంది. 2015-16 సంవత్సరంలో 72,499 ఆహార నమూనాలు విశ్లేషించబడ్డాయని, వాటిలో 16,133 నమూనాలు కల్తీవి లేదా తప్పుడు బ్రాండ్లవిగా కనుగొన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఎఐ డేటాను ఆ పిటిషన్ ప్రస్తావించింది. అధికారులు 1450 క్రిమినల్, 8529 సివిల్ కేసులు నమోదు చేయగా, కేవలం 540 కేసుల్లో మాత్రమే దోషులను నిర్ధారించారని పిటిషన్ పేర్కొంది. తీవ్రత ఇంతలా వున్నా కేంద్ర ప్రభుత్వం దీన్ని నివారించడానికి, నియంత్రించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శించింది.

రిజర్వేషన్లకు ప్రాతిపదిక వెనుకబాటుతనమే

- ఓబిసి రిజర్వేషన్లు మండల్ కమిషన్ సిఫారసులతోనే ఉనికిలోకి
- అస్సాం సిఎం వ్యాఖ్యలపై ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రిజర్వేషన్లకు వెనుకబాటుతనమే ప్రాతిపదిక అని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. రిజర్వేషన్లపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ ఏచూరి, ఆయనకు భారత దేశ చరిత్ర గురించి బొత్తిగా తెలిసినట్లు లేదని అన్నారు. రాజ్యాంగం ఒబిసిల రిజర్వేషన్ గురించి ఎక్కడా పేర్కొనలేదని, మండల్ కమిషన్ నివేదిక వచ్చిన తర్వాతే ఒబిసిల రిజర్వేషన్లు ముందుకు వచ్చాయని ఏచూరి చెప్పారు. అంబేద్కరే ఓబిసిలకు రిజర్వేషన్లు ఇచ్చారని అస్సాం ముఖ్యమంత్రి చెప్పడమంటే ఆయనకు చరిత్ర గురించి తెలియకపోయి అయినా ఉండాలి. లేదా మండల్ కమిషన్ పేరు ఉచ్ఛరించడానికి ఇష్టం లేకనే పేరును ప్రస్తావించకపోయి ఉండాలి అని సిపిఎం నేత అన్నారు. తమకు అనుకూలమైన సొంత చరిత్రను వారు సృష్టించు కుంటున్నారు. తమకు 400 సీట్లు కావాలని బిజెపి అడుగుతున్నది ఎందుకంటే రాజ్యాంగాన్ని పూర్తిగా రద్దు చేసి, దాని స్థానే మనుస్మృతి ఆధారంగా భారత సమాజాన్ని తిరిగి నిర్మించాలని,ఫాసిస్టు నియంతృత్వ పాలన సాగించేందుకేనని ఆయన అన్నారు. దీనిని ఈ దేవ ప్రజలు తిరస్కరిస్తారని ఏచూరి తెలిపారు. రాజ్యాంగం గురించి తెలియకుండానే ముఖ్యమంత్రి అయిపోయారు. ఇంతకన్నా దౌర్భాగ్యమేముంటుంది.రిజర్వేషన్లకు ప్రాతిపదిక. మతం కాదు. ఎస్‌సి, ఎస్‌టిలు వెనుకబడినందున రిజర్వేషన్లు ఇచ్చారు. అంతేతప్ప హిందూ మతంలో భాగం వల్ల రిజర్వేషన్లు ఇవ్వలేదు. అదే వెనుకబాటుతనంతో ఉన్న హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కు, నాస్తికులకు కూడా రిజర్వేషన్లు ఇస్తారు. రిజర్వేషన్లకు ప్రాతిపదిక వెనుకబాటుతనమే. వారికి (బిజెపి) రాజ్యాంగం అర్థం కాదు.

కేజ్రీవాల్ పిఎ అరెస్టు

- బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన ఢిల్లీ కోర్టు
- స్వాతి కేసులో బిభవ్ కుమార్‌కు లభించని ఊరట

బిభవ్ కుమార్, స్వాతి మలివాల్

న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్‌పై దాడి కేసులో ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ పిఎ బిభవ్ కుమార్‌ను ఢిల్లీ పోలీసులు శనివారం సాయంత్రం అరెస్టు చేశారు. ఈ కేసులో ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు తిరస్కరించింది. ఈ కేసులో బిభవ్ కుమార్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేయడానికి ముందుగానే ముందస్తు బెయిల్ కోసం ఢిల్లీ కోర్టును ఆయన ఆశ్రయించారు. ఈ నెల 13న కేజ్రీవాల్‌ను కలిసేందుకు స్వాతి మలివాల్‌కు ఎలాంటి అపాయింట్‌మెంట్ లేదని బిభవ్ కుమార్ తరపు సీనియర్ న్యాయవాది ఎన్ హరిహరన్ కోర్టుకు తెలిపారు. సిఎం కేజ్రీవాల్ భద్రతా ఉల్లంఘనకు ఆమె ప్రయత్నించారని చెప్పారు. స్వాతి మలివాల్‌పై దాడి ఆరోపణలు కల్పితమని బిభవ్ కుమార్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలను ఆయన సమర్పించారు. ఎవరి ఒత్తిడి వల్లనో ఈ నెల 16న పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారని తెలిపారు. బిభవ్ కుమార్‌కు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండానే పోలీసులు ఆయనను అరెస్ట్ చేసినట్లు కోర్టుకు వివరించారు. మరోవైపు బిభవ్ కుమార్ ముందస్తు బెయిల్‌పై విచారణ జరుగుతుండగా శనివారం సాయంత్రం 4.15 గంటలకు ఆయనను పోలీసులు అరెస్టు చేసినట్లు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అతుల్ కుమార్ శ్రీవాస్తవ కోర్టుకు తెలిపారు. దీంతో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను నిరుపయోగంగా పరిగణించాలని కోరారు. ఈ నేపథ్యంలో బిభవ్ కుమార్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు కొట్టివేసింది. బిభవ్ కుమార్‌ని కేజ్రీవాల్ నివాసం నుంచే పోలీసు బృందం శనివారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కి తరలించినట్లు సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ఈ కేసులో పూర్తి సహకారం అందిస్తామని అధికారులకు ఇ-మెయిల్ పంపినప్పటికీ తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని బిభవ్ తరపు న్యాయవాది కరణ్ శర్మ మీడియాకు తెలిపారు.

రేపు మీ ఆఫీస్‌కు వస్తాం జైల్లో పెట్టండి..

- బిజెపిపై కేజ్రీవాల్ ఆగ్రహం

న్యూఢిల్లీ : ప్రతిపక్ష నేతలను అణగతొక్కేయడమే బిజెపి లక్ష్యంగా పెట్టుకుందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. బిజెపి బెదిరింపులకు ఆమ్ ఆద్మీ పార్టీ లొంగకపోవడంతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, అయినా భయపడేది లేదని స్పష్టం చేశారు. ఆప్ రాజ్యసభ సభ్యురాలు, ఢిల్లీ మాజీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ స్వాతి మాలివాల్‌పై దాడి కేసులో తన పిఎ బిబవ్ కుమార్‌ను ఢిల్లీ పోలీసులు శనివారం అరెస్ట్ చేసిన అనంతరం కేజ్రీవాల్ తన ఎక్స్ ఖాతాలో ఒక వీడియోను పోస్టు చేశారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు తమ పార్టీ ముఖ్య నేతలందరినీ తీసుకుని ఢిల్లీలోని బిజెపి ప్రధాన కార్యాలయానికి వస్తానని, అక్కడ మీకు కావాల్సిన వాళ్లను అరెస్ట్ చేసి జైల్లో పెట్టవచ్చని కేజ్రీవాల్ సవాల్ చేశారు. బిజెపి ఇప్పటికే మనీశ్ సిసోడియాను, సంజయ్ సింగ్‌ను జైల్లో పెట్టిందని, ఇప్పుడు తన పిఎను కూడా అరెస్ట్ చేసిందని ఆయన అన్నారు. రాఘవ్ చద్దా లండన్ నుంచి వస్తున్నాడని వాళ్లే చెబుతున్నారని, తనను కూడా వీళ్లు జైల్లో పెడతారని చెప్పారు. ఆప్ నేతలు సౌరభ్ భరద్వాజ్‌ను, అతిషిని కూడా జైల్లో పెడతామని చెబుతున్నారని కేజ్రీవాల్ వెల్లడించారు. కేంద్రం ఇలా తమ వెంట పడుతుండటం ఆశ్చర్యంగా ఉందన్నారు. 'బిజెపి చేయలేని విధంగా ఢిల్లీలో నాణ్యమైన విద్యను అందించడమే మేం చేసిన తప్పు. నగర పౌరుల కోసం మొహల్లా క్లినిక్‌లు ఏర్పాటు చేసి మంచి వైద్యం, మందులు అందించడమే మేం చేసిన తప్పు. బిజెపి అలా చేయలేదు. అందుకే మొహల్లా క్లినిక్‌లను బంద్ చేయాలని చూస్తోంది' అని కేజ్రీవాల్ విమర్శించారు.

స్వాతి చెప్పేవన్నీ అసత్యాలే.. : అతిషి

స్వాతిమలివాల్ తనపై జరిగిన దాడి కేసులో చెప్పేవన్నీ అసత్యాలేనని ఆప్ మంత్రి అతిషి అన్నారు. స్వాతిపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని, వాటి నుంచి తప్పించుకోవడానికే స్వాతి బిజెపితో కుమ్మక్కై, బిభవ్ కుమార్ తనపై దాడి చేశారని ఆరోపిస్తున్నారని అతిషి మండిపడ్డారు. కేజ్రీవాల్ ఇంట్లో రికార్డయిన సిసిటివి ఫుటేజ్ వీడియోను శనివారం ఆప్ బయటపెట్టింది. ఈ వీడియోపై ఆప్ మంత్రి అతిషి శనివారం మీడియాతో మాట్లాడుతూ.. 'సిసి టివి ఫుటేజీ ప్రకారం.. స్వాతి ఎఫ్ఐఆర్‌లో చేర్చిన ఆరోపణలు అన్నీ అసత్యాలే. ఇంకా ఆమెనే పోలీసుల్ని బెదిరించడం వీడియోలో కనిపిస్తోంది. బిభవ్ కుమార్‌ని సైతం ఆమె తీవ్రంగా దూషించారు. కేజ్రీవాల్ నివాసం నుంచి ఆమె బయటకు వచ్చేటప్పుడు ఎటువంటి గాయాలు లేకుండా బయటకు వెళ్తున్నట్లు కనిపిస్తుంది.' అని తెలిపారు.

వాయవ్య భారతంలో వచ్చే 5 రోజులూ వడగాడ్పులు, అధిక ఉష్ణోగ్రతలే!

న్యూఢిల్లీ : వాయవ్య భారతంలోని పలు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలతో వడగాడ్పులు వీస్తున్నాయి. ఈ పరిస్థితులు మరో ఐదు రోజుల పాటు ఇలాగే కొనసాగుతాయని వాతావరణ శాఖ శనివారం పేర్కొంది. ఢిల్లీ, హర్యానా, పంజాబ్, రాజస్థాన్, యుపి ప్రాంతాల ప్రజలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. శుక్రవారం ఉత్తర భారతం అధిక ఉష్ణోగ్రతలను చవిచూసింది. పశ్చిమ ఢిల్లీలోని నజఫ్‌ఘర్‌లో 47.4 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. హర్యానాలోని సిర్సాలో 47.1 డిగ్రీలు నమోదైంది. దేశంలో ఇప్పటివరకు ఈ సీజన్‌లో ఇదే అధికం. రాబోయే ఐదు రోజుల్లో మైదాన ప్రాంతాల్లో, వచ్చే మూడు రోజుల్లో తూర్పు, మధ్య ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తూర్పు రాజస్థాన్, యుపి, బీహార్‌ల్లో ఆరంజ్ అలర్ట్ జారీ చేశారు. మే 18 నుండి 21వ తేదీ మధ్య కనీసం ఒక రోజైనా దేశంలోని 54.3 కోట్లమంది ప్రజలు అత్యధిక ఉష్ణోగ్రతలను అనుభవిస్తారని అమెరికా కేంద్రంగా పనిచేసే క్లైమేట్ సెంట్రల్ వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. మానవ చర్యల ఫలితంగా తలెత్తే వాతావరణ మార్పులే ఇందుకు ప్రధాన కారణమని క్లైమేట్ సెంట్రల్‌కి చెందిన ఆంరడూ పెర్షింగ్ వ్యాఖ్యానించారు. 1998-2017 మధ్య వడగాడ్పుల ఫలితంగా 1,66,000మందికి పైగా చనిపోయారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. అధిక ఉష్ణోగ్రతల వల్ల కూడా ఆర్థిక వ్యవస్థలు ప్రభావితమవుతాయి. వేడిమి, ఉక్కపోతతో కూడిన వాతావరణంలో ప్రజలు ఎక్కువగా పనిచేయలేరు, పిల్లలు నేర్చుకోవడం కూడా ఇబ్బందుల్లో పడుతుంది. సాధారణంగా మైదాన ప్రాంతాల్లో 40, తీర ప్రాంతాల్లో 37, కొండ ప్రాంతాల్లో 30 డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే అక్కడ అధికంగా నమోదైనట్లే భావిస్తారు. సాధారణ ఉష్ణోగ్రతల కన్నా 6.4డిగ్రీలు ఎక్కువైతే దాన్ని తీవ్ర వడగాడ్పుగా ప్రకటిస్తారు. అనేక ప్రాంతాల్లో ఏప్రిల్‌లోనే తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వేసవి సెలవుల్లో మా స్నేహితులు



వేసవి సెలవులకు మా స్నేహితుల్లో కొందరు వారి బంధువుల ఇంటికి వెళ్ళారు. ఇంకొందరు ఇంటి దగ్గర ఉన్న స్నేహితులతో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఆడుకొని తరువాత ఎవరి ఇంటికి వారు వెళ్ళి విశ్రాంతి తీసుకోవడం లేదా టీవీ చూడడం చేస్తున్నారు. మరి కొందరు మామిడి తోటలకు వెళ్తున్నారు. చింత పండు కొట్టడానికి కూడా మా ఫ్రెండ్స్ వెళ్తున్నారు. అలా సాయంత్రం వరకు ఆడుతూ పాడుతూ సరదాగా గడుపుతున్నారు. ఇంటి పనుల్లో కొంతమంది అమ్మకు సహాయం చేస్తున్నారు.

సాయంత్రం 5 గంటలకు మళ్ళీ ఆటకు బయలుదేరుతారు. రాత్రి ఇంటికి వచ్చి అమ్మానాన్నతో కలిసి తింటారు. తాత లేదా నాయనమ్మ దగ్గర నిద్రపోతూ కథలు చెప్పమంటారు. కొందరు పిల్లలు బంధువుల ఇంటి నుండి వచ్చి అక్కడ జరిగిన విషయాల గురించి చెబుతారు.

చాలా తక్కువ మంది మాత్రం ప్రతి రోజూ గంట సేపు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్ ప్రాక్టీసు చేస్తున్నారు. మరికొందరు జాతరలకు, యాత్రలకు కుటుంబం లేదా బంధువులతో వెళ్లారు. తిరిగి వచ్చి వారు చూసిన స్థలాలను, అక్కడ ఉన్న విశేషాల గురించి చెబుతున్నారు. కొంత మంది తెచ్చిన ప్రసాదాలు ఇంటి దగ్గరి వారికి పంచి పెడుతున్నారు. కొందరైతే నాలా పత్రికలకు కథలు రాస్తున్నారు, బొమ్మలు వేస్తున్నారు. అలా ఈ వేసవి సెలవులను మేమంతా చాలా సంతోషంగా గడుపు తున్నాం.

- కారంకంటి ప్రహారిని, 8వ తరగతి, జక్కాపూర్, సిద్దిపేట జిల్లా.

బొమ్మరిల్లు



జి. జోష్ కుమార్, 8వ తరగతి, ప్రభుత్వ పాఠశాల, గండి గ్రామం, చోడవరం.

జి.సంహిత, 6వ తరగతి, అరవింద హైస్కూల్, కుంచనపల్లి, గుంటూరుజిల్లా.

ఎం.ఆద్యా రిపుంజై, 7వ తరగతి, ఆర్‌బిపిఎస్ స్కూల్, మంగళగిరి, గుంటూరు జిల్లా.

గమనిక

వేసవి సెలవుల్లో పిల్లలకు తోడుగా 'చిన్నారి', 'వేసవి విడిది'గా ముస్తాబవుతుంది. విద్యార్థినీ విద్యార్థుల రచనలను ఆహ్వానిస్తోంది. కథలు, కవితలు, బొమ్మలు, సెలవుల్లో మీ అనుభవాలు, ప్రయాణ విశేషాలు, ఇతరత్రా కబుర్లు మెయిల్‌కి లేదా
వాట్సాప్ నెం : 8332925496కి పంపండి.
మెయిల్ ఐడీ : chinnaarips@gmail.com
- ఎడిటర్

నాటి బాల్యం

కోడికూత గోలలోన
చుక్క పొద్దుయాలలేసి
చద్దిబువ్వ చంకనేసి
సాలుపోయ కదిలాము

పేడ పిడక మంటలోన
చలి మంటలు కాగాము
ఊబిలోన నీరు తాగి
ఊసులెన్నో చేశాము

ఈతమట్ట చేతబూని
గేదెనంత తోమాము
గెచ్చి కొట్టి గుర్రమెక్కి
దున్నపోతు తోలాము

బొంగరాల ఆటలోన
గింగిరాలు తిరిగాము
ఉంగరాల జుట్టు కొరకు
రింగులెన్నో తిప్పాము

వాన నీటి జాడిలోన
ఓడలెన్నో వదిలాము
రోత పుట్టి రోవ చేస్తే
రక్కి రక్కి విసిగాము

ఇసుకలోన ఈతగింజ
మొలకలెన్నో తిన్నాము
ఈత కొరకు ఊరు చుట్టు
చెరువులెన్నో ఈదాము

ఇరవై ఎక్కాలు వస్తే
ఐనస్టీన్ అయ్యాము
ఏ బీ సీ డీలు వస్తే
ఎదురే లేదన్నాము

పొద్దు వాలారాగానే
ఆటలెన్నో ఆడాము
బుద్ధిలేక ఇద్దిమరచి
బాసలెన్నో చేసాము

పండగేల సోడితోప
జుర్రుకొని తిన్నాము
ఉన్నవాడు లేనివాడు
కలసి మెలసి బతికాము

చల్లంబలి తాగిన
చల్లగానే బతికాము
చిల్లిగవ్వ లేకున్నా
చేయి చేయి కలిపాము

- వినోద్ కుత్తుం, పలాస, శ్రీకాకుళం జిల్లా 9634314502

జీవన సౌరభం

బాధ్యతను గ్రహించినప్పుడే ఆశయాలను పూర్తి చేసుకోవాలనే పట్టుదల వస్తుంది.

ఎంత చదివినా కూలి చేస్తూ..

చదువుకుంటే బతుకు బాగుపడుతుందని ఎన్నోసార్లు అనుకుంటాం. చదువుకోకపోతే జీవితం వ్యర్థం అని కూడా చాలామందికి చెబుదాం. అయితే, ప్రస్తుత రోజుల్లో ఎంతోమంది విద్యాధికులు రోజు కూలీ కోసం మూటలు ఎత్తుతున్నారు. పారలు పట్టుకుంటున్నారు. పొలం బాట పడుతున్నారు. ఉద్యోగం కోసం పట్టణానికి వలస వచ్చి రోజుకు రూ.300 నుండి రూ.500 రూపాయలకు పనిచేసే గ్రాడ్యుయేట్లు మన చుట్టూ చాలా మంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఎందరో విద్యాధికులు, రెండు పూటలా తిండి తినడం కోసం నానా అగచాట్లు పడుతున్నారు. 'ఉద్యోగాల కోసం చదివిన ఆ చదువులు ఎందుకు పనికి రాకుండా పోయాయి?' అన్న వారి ప్రశ్నలకు కొన్ని దశాబ్దాలుగా సమాధానాలు దొరకడం లేదు.

పాతికేళ్ల క్రితం మనదేశ నిరుద్యోగ యువతలో ఉన్న విద్యావంతులు ఇప్పుడు రెట్టింపు సంఖ్యకు చేరారు. మహారాష్ట్ర దభండి గ్రామానికి చెందిన 42 ఏళ్ల శివానంద్ సావలె బాల్యం నుండి చదువులో చాలా చురుకుగా ఉండేవాడు. విద్య నేర్పిస్తున్న టీచర్లను చూసి చాలా ప్రభావితమయ్యాడు. పెద్దయ్యాక వాళ్లలాగా ఉద్యోగాలు చేయాలని ఆశపడ్డాడు. ఈ మధ్యలో ఎన్నో కష్టాలు చుట్టుముట్టాయి. పేదరికంతో బాధపడ్డాడు. తండ్రి అకాలమరణం చెందాడు. ఎన్ని బాధలు పడ్డా అనుకున్న లక్ష్యం చేరాలని కష్టపడి చదివాడు. గ్రామంలో అత్యధిక విద్యావంతుడిగా చరిత్ర సృష్టించాడు. మాస్టర్ ఆఫ్ సైన్స్ పూర్తి చేసిన సావెలె ఎలిమెంట్రీ స్కూలు టీచరు ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నాడు. ఈలోపు ఏదో ఒక చిన్న ఉద్యోగంలో స్థిరపడ్డాడు. ఇక్కడే అతను మానసికంగా ఎంతో కుంగిపోతున్నాడు. తన చుట్టూ ఉన్న వారు తన తోటి చదువుకున్న వారితో నిత్యం అవమానాలు పడాల్సివస్తోంది. ఎందుకంటే సావెలే, ఆ గ్రామంలో భూమి లేని నిరుపేద కూలీ కంటే తక్కువ డబ్బులు సంపాదిస్తున్నాడు. నెలకు రూ.7500, అంటే రోజుకు రూ.250 కూలీకి పనిచేస్తున్నాడు. ఆ గ్రామంలో వ్యవసాయ కూలీకి అంతకంటే ఎక్కువ జీతమే అందుతోంది. 'నువ్వు చదువుకునేటప్పుడు నీ వెనక చాలా దూరంలో మూలన కూర్చొన్న వ్యక్తి కూడా ఇప్పుడు నీ కంటే ఎక్కువే సంపాదిస్తున్నాడు!' అని ఎన్నోసార్లు ఎంతోమంది గేలి చేశారు. ఈ అవమానాలు సావెలే ఒక్కడివే కాదు.. కొన్ని లక్షల మంది విద్యావంత నిరుద్యోగులవి. తక్కువ వేతనాలకి పనిచేస్తున్న ఎంతోమంది తమ విద్యార్హతను బయటికి చెప్పడానికి కూడా ఇష్టపడకుండా కూలి పనులు చేస్తున్నారు.

సావెలే స్నేహితుడు రాథోడ్‌ది మరో కథ. కుటుంబ సమస్యలతో చదువు అర్థంతరంగా ఆపేశాడు. వారసత్వంగా వచ్చిన భూమిని సాగు చేస్తూ జీవిస్తున్నాడు. స్థిర ఆదాయం కలిగి ఉన్నాడు. తన స్నేహితుడు సావెలే పరిస్థితిని చూసి బాధ పడని రోజు లేదు. 'వాడు స్కూల్లో బాగా చదివేవాడు. ఉద్యోగం కోసం ఎన్నో కలలు కన్నాడు. ఎన్ని కష్టాలు వచ్చినా చదువు ఆపలేదు. కానీ ఈ రోజు చాలా తక్కువ జీతానికి పనిచేస్తున్నాడు. వాడిని చూసినప్పుడల్లా గుండె చెరువైపోతుంది' అని గద్గద స్వరంతో చెబుతున్న రాథోడ్ లాంటి స్నేహితులు మనచుట్టూ ఎంతోమంది.

సావెలే నివసిస్తున్న ప్రాంతానికి వంద కిలోమీటర్ల దూరంలోని రాలేగావ్ టౌన్‌లో 27 ఏళ్ల సిద్ధాంత్ మెండే జీవిస్తున్నాడు. ఇంజినీరింగ్ చదివాడు. కానీ ఇప్పుడు ఓ భవననిర్మాణరంగ సంస్థలో పనిచేస్తున్నాడు. ఇంటి పనులు చేయిస్తున్నాడు. రోజంతా అతడు పడిన కష్టానికి గాను నెలకు రూ.12 వేలు మాత్రమే వస్తుంది. అంటే రోజుకు రూ.400 దక్కుతుంది. భూమి లేని నిరుపేద వ్యవసాయ కూలీ పొలం పనులకు వెళితే వచ్చే మొత్తానికి ఇది సమానం. అయితే ఇంతకు ముందే సిద్ధార్థ్ మెరుగైన ఉద్యోగం కోసం పూణె, నాగపూర్ వంటి పట్టణాలకు కూడా వెళ్లాడు. అక్కడ రూ.13 వేలు వస్తాయని చెప్పడంతో ఖర్చులకు పోను ఏమీ మిగలదని ఉన్న ఊరిలోనే ఏదో ఒక పని చేసుకుని బతుకుదామని గ్రామానికే పరిమితమయ్యాడు.

'నా డిగ్రీకి, నా పనికి ఏ సంబంధం లేదు. డిగ్రీ సాధించడం కోసం నాలుగేళ్లు కష్టపడ్డాను. మెరుగైన ఉద్యోగం కోసం రెండేళ్లు తిరిగాను. ఎక్కడా సంతృప్తి లేదు. ఇప్పుడు నా తప్పు తెలిసివచ్చింది. కానీ గడిచిన సమయం తిరిగి రాదు కదా! అని చెబుతున్నప్పుడు ఎంతోమంది నిరుద్యోగుల ఆవేదన కనిపిస్తోంది.

'దశాబ్ద కాలంలో రెండు కోట్లకు పైగా ఉద్యోగాలు కల్పిస్తామని 2014 ఎన్నికల్లో బిజెపి చేసిన వాగ్దానానికి ఎంతో సంతోషించాను. కానీ అటువంటిదేమీ జరగలేదు. నా చుట్టూ పనిచేసే వాళ్లలో చాలామంది చదువుకున్న వారే ఉంటున్నారు. ఈ పరిస్థితి చూసి 2019 నుండి నా అభిప్రాయం మార్చుకున్నాను. ఇప్పుడు నేను బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేస్తాను' అని చెబుతున్న సిద్ధార్థ్, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగంలో సంతృప్తికరంగా లేదు. సొంతంగా ఏదైనా వ్యాపారం చేయాలని భావిస్తున్నాడు. 'ఏ వ్యాపారం చేయాలో ఇంకా నిర్ణయించుకోలేదు' అంటున్న సిద్ధార్థ్ ముఖంలో భవిష్యత్తుపై బెంగ స్పష్టంగా కనిపిస్తోంది.

ఆ ప్రాంతంలోనే నివసిస్తున్న 21 ఏళ్ల ఆర్తీ కున్‌కున్వార్ గ్రాడ్యుయేట్ మధ్యలోనే ఆపేసింది. తండ్రి చనిపోవడంతో కుటుంబానికి తనే పెద్ద దిక్కైంది. ఈ పరిస్థితుల్లో గ్రామం విడిచి వెళ్లలేక, ఉన్న ఊరిలోనే చాలా తక్కువ వేతనానికి పిల్లలకు ట్యూషన్లు చెబుతూ కాలం వెళ్లదీస్తోంది. 'నా స్నేహితుల్లో చాలా మంది గ్రాడ్యుయేట్ పూర్తిచేసి, ఇప్పటికీ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. వారందరినీ చూస్తే, నేను ఎంతోకొంత సంపాదిస్తున్నానని తృప్తి చెందుతున్నాను' అంటోంది.

పైన చెప్పుకున్న ఈ వ్యక్తులు, వాళ్లకెదురైన సందర్భాలు నిరుద్యోగులుగా మిగిలిపోయిన ఎంతోమంది విద్యావంతులవి. పాలకుల ప్రగల్భాలకు లోబడుతున్న నిరుద్యోగులందరూ వాస్తవ పరిస్థితులను అంచనా వేసుకోవాలి. కుల, మతాల విద్వేషాలు రెచ్చగొట్టే పాలకులు, ఎప్పుడూ ఉపాధి మార్గం వైపు ఆలోచించరు. కాబట్టి ఆచితూచి అడుగు వేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉంది.

హైదరాబాద్‌లో మలేషియా సెట్టింగ్

ఆగస్ట్ 15న ఎలాగైనా విడుదల చేయాలని 'పుష్ప2' టీమ్ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. దీనికోసం రాత్రింబవళ్లు పని చేస్తున్నారు. ఈ సినిమా కోసం మలేషియాలో కీలకమైన సన్నివేశాల్ని తెరకెక్కించాలనుకున్నారు. అయితే ఇప్పుడు అంత టైమ్ లేదు. అందుకే హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీనే మలేషియాగా మారుస్తున్నారు. అక్కడ ఈ సినిమా కోసం ఓ భారీ సెట్ తీర్చిదిద్దారు. 'పుష్ప 2' షూటింగ్ ఎంత వేగంగా జరుగుతున్నా టీమ్‌ని రెండు విషయాలు ఇబ్బంది పెడుతున్నాయని తెలుస్తోంది. ఒకటి.. ఈ సినిమాలో కీలకపాత్ర పోషిస్తున్న ఫహద్ ఫాజిల్ డేట్లు కుదరటం లేదు. తనపై ఇప్పటికే కొంతమేర షూటింగ్ చేశారు. మరో 15 రోజుల కాల్షీట్లు అవసరం అయ్యాయి. ఐటెమ్ సాంగ్ ఎవరిని తీసుకోవాలన్న విషయంలో ఇంకా ఓ క్లారిటీకి రాలేదట. అల్లు అర్జున్ సరసన రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

సూర్యకు జోడీగా పూజా హెగ్డే

కోలీవుడ్ హీరో సూర్యకు జోడీగా పూజాహెగ్డే నటించబోతున్నారు. కొన్నాళ్ల క్రితం తెలుగులో వరస సినిమాలతో హిట్ కొట్టిన ఆమె ఆ తర్వాత వచ్చిన ఫ్లాప్స్ దెబ్బకు పూర్తిగా సినిమాలకు దూరంగా ఉంటున్నారు. సూర్య 'కంగువ' మూవీ చేస్తున్నాడు. ఈ ఏడాదే థియేటర్లలోకి రానుంది. మరోవైపు తన 44వ చిత్రాన్ని కూడా రెడీ చేసేస్తున్నాడు. దీనికి కార్తీక్ సుబ్బరాజ్ దర్శకుడు. సూర్య సొంత నిర్మాణ సంస్థ 2డీ ఎంటర్‌టెయిన్‌మెంట్స్, కార్తీక్ సుబ్బరాజ్ కలిసి సంయుక్తంగా నిర్మించనున్నారు. ఈ మూవీకి పూజా హెగ్డేని హీరోయిన్‌గా ఎంపికచేశారు. పదకొండేళ్ల క్రితం 'మాస్క్' అనే తమిళ సినిమాతోనే హీరోయిన్ అయిన పూజా హెగ్డే.. మధ్యలో విజయ్‌తో 'బీస్ట్'తో రీఎంట్రీ ఇచ్చింది. కానీ అది దెబ్బకొట్టింది. ప్రస్తుతం ఫ్లాప్స్ వల్ల పూర్తిగా ఛాన్సుల్లేక సైలెంట్ అయిపోయిన ఈమెకు.. సూర్య మూవీలో ఛాన్స్ అంటే బంపరాఫర్ అనే చెప్పొచ్చు. ఒకవేళ ఇది హిట్ అయితే మాత్రం మళ్లీ సౌత్‌లో పాగా వేసే ఛాన్స్ ప్లస్ కోరుకున్న బ్రేక్ రావొచ్చు.

20 నుంచి 'విశ్వంభర' తుది షెడ్యూల్

చిరంజీవి ప్రస్తుతం 'విశ్వంభర' చిత్రంతో బిజీగా ఉన్నారు. వశిష్ట దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని యు.వి క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. ఫాంటసీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విజువల్ ఎఫెక్ట్స్‌కి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా సమాచారం. పోస్ట్ ప్రొడక్షన్ చాలా కీలకమైనందున వీలైనంత ఎక్కువ సమయం తీసుకుంటున్నారు. జూన్ చివరి నాటికి షూటింగ్ మొత్తం పూర్తవ్వాలన్న లక్ష్యంతో చిత్ర బృందం పని చేస్తోంది. ఈ నెల 20 నుంచి హైదరాబాద్‌లో కీలకమైన షెడ్యూల్ మొదలు కాబోతుంది. చిరంజీవి, త్రిషతో సహా మిగిలిన టీమ్ మొత్తం ఈ షెడ్యూల్‌లో భాగం కానున్నారు. ఈ షెడ్యూల్‌లో పాటల్ని కూడా తెరకెక్కిస్తారు. చిన్న బ్రేకులు మినహా.. జూన్ చివరి వారం వరకూ సుదీర్ఘంగా షెడ్యూల్ సాగనుంది. దీంతో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. జులై నుంచి పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభం అవుతాయని చిత్ర బృందం తెలిపింది. సీజీ ఈ సినిమాలో కీలక పాత్ర పోషించనుందని ఇప్పటికే దర్శకుడు చెప్పారు. అందుకోసం కొన్ని విదేశీ కంపెనీలను చిత్రబృందం సంప్రదించబోతోంది. సంక్రాంతి సందర్భంగా జనవరి 10 ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

హిట్ లిస్ట్ టీజర్ బాగుంది: సూర్య

"హిట్ లిస్ట్' మూవీ టీజర్ చాలా బాగుంది. సినిమా ఇంకా బాగుంటుందని ఆశిస్తున్నాను. విజయ్ కనిష్కతో పాటు టీమ్‌కి ఈ మూవీ మంచి సక్సెస్ ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని హీరో సూర్య అన్నారు. తమిళ దర్శకుడు విక్రమన్ తనయుడు విజయ్ కనిష్క హీరోగా సముద్ర ఖని, శరత్‌కుమార్, గౌతమ్ వాసుదేవ మీనన్ ముఖ్యపాత్రల్లో నటించిన చిత్రం 'హిట్ లిస్ట్'. సూర్య కతిర్ కాకల్లార్, కె.కార్తికేయన్ దర్శకత్వం వహించారు. దర్శకుడు కెఎస్ రవికుమార్ నిర్మించారు. ఈ మూవీని శ్రీ శ్రీనివాస స్క్రీన్స్, శ్రీ శ్రీనివాస ఇన్‌ఫ్రా, బెక్కం ప్రొడక్షన్స్ సంస్థలు తెలుగులో విడుదల చేస్తున్నాయి. త్వరలో విడుదల కానున్న ఈ సినిమా టీజర్‌ని సూర్య ఆవిష్కరించారు. "యాక్షన్, సస్పెన్స్, క్రైమ్ జానర్‌లో రూపొందిన చిత్రం 'హిట్ లిస్ట్'. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచేస్తోంది" అని మేకర్స్ వ్యాఖ్యానించారు.

యావరేజ్ స్టూడెంట్ ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల



'మెరిసే మెరిసే' చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన పవన్ కుమార్ కొత్తూరి హీరోగా మారారు. ఆయన హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. స్నేహ మాలవ్య, సాహిబా భాసిన్, వివియా సంత్ హీరోయిన్లుగా నటించారు. శ్రీ నీలకంఠ మహాదేవ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పి బ్యానర్‌పై పవన్ కుమార్ కొత్తూరి, బిషాలీ గోయెల్ నిర్మించిన ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ కొత్తూరి మాట్లాడుతూ "యూత్‌ఫుల్ లవ్, యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. అన్ని తరగతుల ప్రేక్షకులకు మా సినిమా నచ్చుతుందనే నమ్మకం ఉంది" అన్నారు. ఝాన్సీ, రాజీవ్ కనకాల, 'ఖలేజా' గిరి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: కార్తీక్ బి. కొడకండ్ల, కెమెరా: సజీష్ రాజేంద్రన్.

ప్లే-ఆఫ్‌కు బెంగళూరు

- ఉత్కంఠ పోరులో చెన్నైపై 27పరుగుల తేడాతో గెలుపు
- డుప్లెసిస్ అర్ధసెంచరీ
- రాణించిన కోహ్లి, పటీధర్

కోహ్లి, డుప్లెసిస్ తొలి వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యం

బెంగళూరు: ప్లే-ఆఫ్స్ చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) అద్భుతం చేసింది. 219పరుగుల భారీ లక్ష్యాన్ని చెన్నైకు నిర్దేశించింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చెన్నై జట్టు చివరి బంతి వరకు పోరాడి 27పరుగుల తేడాతో ఓటమిపాలైంది. 201పరుగులు చేస్తే ప్లే-బెర్త్ చెన్నైకు దక్కే ఛాన్స్ ఉండగా.. చివరి ఓవర్లో బెంగళూరు బౌలర్ యశ్ దయాల్ సూపర్ బౌలింగ్ చేసి అద్భుతం చేశాడు. చివరి 6బంతుల్లో 17పరుగులు చేస్తే చెన్నై ప్లే-ఆఫ్స్‌కు చేరుతుంది. క్రీజ్‌లో ధోనీ, జడేజా ఉన్నారు. ఆ దశలో తొలి బంతిని ధోనీ భారీ సిక్సర్ కొట్టాడు. దీంతో 5బంతుల్లో 11 పరుగులు చేస్తే చెన్నైకు ప్లే-బెర్త్ ఛాన్స్ దక్కుతుందనగా యశ్ దయాల్ మ్యాజిక్ బౌలింగ్ చేశాడు. ఆ తర్వాత బంతికి ధోనీని ఔట్ చేశాడు. ఆ తర్వాత శార్దూల్ రెండు బంతులు ఎదుర్కొని ఒక పరుగు చేసినా.. చివరి 2 బంతుల్లో 10 పరుగులు చేస్తే చెన్నైకు ప్లే-ఆఫ్ ఛాన్స్ దక్కుతుంది. ఆ దశలో యశ్ దయాల్ ఆ తర్వాత రెండు బంతులకు ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా బెంగళూరు గెలిపించాడు. దీంతో చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యే సరికి 7వికెట్లు కోల్పోయి 191పరుగులే చేసింది. దీంతో బెంగళూరు జట్టు చాలాకాలం తర్వాత ప్లే-ఆఫ్‌కు చేరింది. దీంతో బెంగళూరు జట్టు 14పాయింట్లతో 4వ స్థానంలో నిలిచి నాకౌట్‌కు చేరింది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు బ్యాటర్లు విరాట్ కోహ్లి, డుప్లెసిస్, పాటిదార్, కామెరాన్ గ్రీన్.. ఇలా టాపార్డర్‌లో అందరూ రాణించారు. కోహ్లి, డుప్లెసిస్ జోడీ తొలి వికెట్‌కు 78 పరుగులు జోడించి శుభారంభం అందించారు. కోహ్లి 29బంతుల్లో 3ఫోర్లు, 4సిక్సర్లతో 47పరుగులు చేయగా... కెప్టెన్ డుప్లెసిస్ 39బంతుల్లో 3ఫోర్లు, 3సిక్సర్లతో 54 పరుగులు చేశాడు. రజత్ పటీదార్ చిచ్చరపిడుగులా 23బంతుల్లో 2ఫోర్లు, 4సిక్సర్ల సాయంతో 41 పరుగులు చేశాడు. చివర్లో కామెరాన్ గ్రీన్ ఈ మ్యాచ్ లో భారీ షాట్లతో అలరించాడు. గ్రీన్ 17 బంతుల్లోనే 3ఫోర్లు, 3సిక్సర్లతో 38పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దినేశ్ కార్తీక్ 6 బంతుల్లో 14, మ్యాక్స్‌వెల్ 5 బంతుల్లో 16 పరుగులు చేశారు. చెన్నై బౌలర్లలో శార్దూల్ ఠాకూర్‌కు రెండు, తుషార్ దేశ్ పాండే, మిచెల్ సాంట్నర్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చెన్నైను 200పరుగులలోపు కట్టడి చేస్తే బెంగళూరు జట్టు ప్లే-ఆఫ్‌కు చేరడం ఖాయం.

ఫైనల్‌కు సాత్విక్-చిరాగ్

బ్యాంకాక్: భారత స్టార్ డబుల్స్ జంట చిరాగ్ శెట్టి-సాత్విక్ సాయిరాజ్ మరో టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచారు. థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. శనివారం జరిగిన సెమీఫైనల్లో సాత్విక్-చిరాగ్ 21-11, 21-12తో చైనీస్ తైపీకి చెందిన లూ-మింగ్, టాంగ్ కుయ్‌లను ఓడించారు. టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన వీరు ప్రారంభం నుంచే ప్రత్యర్థులపై బలమైన ఫోర్‌హ్యాండ్ షాట్లతో విరుచుకుపడ్డారు. ఈ మ్యాచ్ కేవలం 35నిమిషాల్లోనే ముగిసింది. ఇక రెండో గేమ్‌లో 17-10పాయింట్ల ఆధిక్యతలోకి దూసుకెళ్లారు. ఆ తర్వాత ప్రత్యర్థి షట్లర్లకు ఏమాత్రం అవకాశమివ్వకుండా మ్యాచ్‌ను ముగించారు. ఆదివారం జరిగే ఫైనల్లో వీరు చైనాకు చెందిన చెన్-బో యంగ్, లూ యాలతో తలపడనున్నారు. చైనా జంట 21-19, 21-18తో కొరియాకు చెందిన కిమ్ జి-కిమ్ సాలను ఓడించారు. మహిళల డబుల్స్ సెమీస్‌లో తానీషా-పొన్నప్ప పోరాటం ముగిసింది. వీరు సెమీస్‌లో 12-21, 20-22తో ఇండోనేషియాకు చెందిన టాప్‌సీడ్ జోడీ చేతిలో ఓటమిపాలయ్యారు.

నేటితో ముగియనున్న ఐపిఎల్ లీగ్ పోటీలు

21 నుంచి ప్లే-ఆఫ్స్, 26న ఫైనల్

ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-17 పోటీలు చివరి దశకు చేరాయి. మార్చి 22న చిదంబరం స్టేడియంలో బెంగళూరు-చెన్నై జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్‌తో ఈ ఏడాది ఐపిఎల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఆదివారం రాజస్తాన్-కోల్‌కతా జట్ల మధ్య జరిగే చివరి మ్యాచ్‌తో ఈ సీజన్ లీగ్ పోటీలు ముగియనున్నాయి. శనివారం నాటికి మూడు ప్లే-ఆఫ్ బెర్త్‌లు ఖాయం కాగా.. నాల్గో బెర్త్‌కోసం బెంగళూరు-చెన్నై జట్లు వేచిచూస్తున్నాయి. లక్నో, ఢిల్లీ, గుజరాత్, పంజాబ్, ముంబయి జట్లు ప్లే-ఆఫ్ రేసునుంచి ఇప్పటికే నిష్క్రమించాయి. ఐదుసార్లు టైటిల్ విజేత ముంబయి జట్టు ఈ సీజన్‌లో అభిమానులకు తీవ్ర వేదనను మిగిలించింది. ఎన్నడూ లేనంతగా ఈ సీజన్‌లో ఆడిన 14 మ్యాచుల్లో 10మ్యాచుల్లో ఓడి పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచింది. ఇక గత మూడు సీజన్లలో అట్టడుగు స్థానంలో నిలిచి అభిమానులకు తీవ్ర వేదనను మిగులుస్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఈసారి ప్లే-ఆఫ్‌కు చేరింది. ఇక రెండుసార్లు టైటిల్ విజేత కోల్‌కోతా, ఒక్కోసారి టైటిల్‌ను ముద్దాడిన రాజస్తాన్, సన్‌రైజర్స్ ప్లే-ఆఫ్ బెర్త్‌లను ఖాయం చేసుకున్నాయి.

ఇక 2022 టైటిల్ విజేత, 2023 రన్నరప్ గుజరాత్ జెయింట్ ఈసారి ఆశించినస్థాయిలో రాణించలేకపోయింది. కెప్టెన్ మార్పు జట్టు ప్రదర్శనపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. గత సీజన్ వరకు గుజరాత్‌కు కెప్టెన్‌గా ఉన్న హార్దిక్ పాండ్యా ముంబయికి తరలడం.. ముంబయి జట్టు కెప్టెన్‌గా అతడు కొనసాగడంతో ఈ రెండుజట్లు మరో రెండు లీగ్ మ్యాచ్‌లు మిగిలి ఉండగానే ప్లే-ఆఫ్ రేసునుంచి వైదొలిగాయి. ఆటగాళ్ల ప్రదర్శన, సమన్వయ లోపానికి ఇది దారితీసింది.

- ప్రజాశక్తి స్పోర్ట్స్ కరస్పాండెంట్

ఐపిఎల్‌లో నేడు

సన్‌రైజర్స్ × పంజాబ్
వేదిక: హైదరాబాద్; మ.3.30గం॥లకు

రాజస్తాన్ × కోల్‌కతా
వేదిక: గౌహతి; రా.7.30గం॥లకు

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
కోల్‌కతా	13	9	3	1	19	1.42
రాజస్తాన్	13	8	5	0	16	0.27
సన్‌రైజర్స్	13	7	5	1	15	0.40
బెంగళూరు	14	7	7	0	14	0.45
చెన్నై	14	7	7	0	14	0.39
ఢిల్లీ క్యాపిటల్స్	14	7	7	0	14	-0.37
లక్నో	14	7	7	0	14	-0.66
గుజరాత్	14	5	7	2	12	-1.32
పంజాబ్‌కింగ్స్	13	5	8	0	10	-0.34
ముంబయి	14	4	10	0	8	-0.31

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; ర: రద్దు; నె.ర.:నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68